RNI.No. APTEL/2014/57702 ESTD: 1999




www.voodayam.com

# వుదయం




గుంటూరు 26-09-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 189 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

### తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**తిరువనంతపురం, సెప్టెంబర్ 25 (ఎఎంఎస్) :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదన్ మహమ్మద్ - 2026' ఉత్తమ ప్రజాసేవక్ పురస్కారం లభించింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, దివంగత ఆర్యదన్ మహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన 'ఆర్యదన్ మహమ్మద్ ఫౌండేషన్' ఈ అవార్డును అందజేసింది. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

అవార్డు స్వీకరించిన అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేరళ ప్రజలు చూపే ఆప్యాయతకు, ఆర్యదన్ మహమ్మద్ గారి సేవలకు తన నివాళులు అర్పించారు. "కేరళకు రావడం నాకు ఎప్పుడూ ఎంతో సంతోషాన్నిస్తుంది. ప్రతిసారీ ఇక్కడి ప్రజలు నన్ను ఆత్మీయంగా స్వాగతించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగిన 'భారత్ జోడో యాత్ర'తో పాటు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ నేను ఇక్కడికి వచ్చాను. నాటి ఎన్నికల్లో మేం ప్రజలను ఓట్లు అడిగాం, వారు కాంగ్రెస్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాన్ని ఇచ్చారు" అని గుర్తుచేశారు.



'కేరళ రాజకీయంలో ఆర్యదన్ ఒక చాణక్యుడు'

కాంగ్రెస్ సిద్ధాంతాలకు, లౌకికత్వానికి కేరళ నిలయంగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. "శ్రీ ఆర్యదన్ మహమ్మద్ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం నా భాగ్యంగా భావిస్తున్నాను. ఆయన ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు వేర్వేరు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా సేవలు అందించిన ఉద్దండ రాజకీయ వేత్త. కేరళ రాజకీయాల్లో ఆయన ఒక చాణక్యుడి లాంటివారు. ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నిజమైన సైనికుడు ఆయన" అని వ్యాఖ్యానించారు.

కేరళేతరుల్లో ఈ అవార్డును అందుకున్న తొలి వ్యక్తిని నేనే కావడం ఎంతో గర్వకారణమని, ఏఐసీసీ ముఖ్య నేత కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా దీనిని తీసుకోవడం విశేషమని అన్నారు.

## దేశీయ ఆయుధ తయారీతో సరిహద్దుల్లో భద్రత బలోపేతం

### యూపీ బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌లో వణుకు: అమిత్ షా

### నోయిడా అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో కేంద్ర హోంమంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (వుదయం) :**

ఉత్తర్‌ప్రదేశ్‌లో రూపుదిద్దుకుంటున్న బ్రహ్మోస్ క్షిపణులు శత్రుదేశమైన పాకిస్థాన్‌ను భయపెడుతున్నాయని, ఆ దేశంలో నిద్రలేని రాత్రులకు కారణమవుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 రైఫిళ్లు ఉగ్రవాదులు, మావోయిస్టుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను ఏ విధంగా మట్టికరిపించిందో ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. నోయిడాలో వైభవంగా ప్రారంభమైన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో పాల్గొన్న ఆయన, 2017లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వాతావరణ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తోందని అమిత్ షా పునరుద్ఘాటించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పురోగమనం వైపు నడిపించేందుకు మారిషస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రియా, బ్రిటన్, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ వంటి పలు దేశాలతో చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో విజయవంతంగా అమలువుతున్న 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' విధానం స్థానిక పరిశ్రమలకు కొత్త ఊపిరి పోసిందని ప్రశంసించారు. గతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ఎన్డీయే పాలనలో శాంతిభద్రతలు మెరుగుపడి రాష్ట్రం రక్షణ ఉత్పత్తులు, వాహన తయారీ, వైద్య పరికరాల తయారీ రరంగాల్లో దేశానికే కేంద్రబిందువుగా మారిందన్నారు. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం సెప్టెంబరు 25న ప్రధాని మోదీ ప్రతిష్టాత్మక 'భారత్‌లోనే తయారు చేద్దాం' (మేక్ ఇన్ ఇండియా) పిలుపునిచ్చారని, ఆ ఆశయం నేడు స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధాలు తయారుచేసే స్థాయికి చేరిందని స్పష్టం చేశారు.

## ఎల్లంపల్లి వరదను వాడుకోవడంలో వైఫల్యం

**సిద్దిపేట, సెప్టెంబర్ 25 (ఎఎంఎస్) :**

గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం పోటెత్తుతున్నా నీటిని ఎత్తిపోయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వర్షాభావ పరిస్థితుల నెపంతో కాలయాపన చేయకుండా, తక్షణమే అన్ని మోటార్లను నిరంతరాయంగా నడిపి ఎండిపోతున్న రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేస్తూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి శుక్రవారం ఆయన ఒక సుదీర్ఘ లేఖ రాశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునే చందంగా వ్యవహరించకుండా, అందివచ్చిన గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవడంలో నీటి నిర్వహణ లోప స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం వ్యవస్థ ద్వారా 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని లిఫ్ట్ చేయకుండా రైతుల పొలాలను ఎండబెడుతోందని ఆరోపించారు.




ఒకవైపు నదిలో వరద నీరు వృథాగా పోతుంటే, మరోవైపు అన్నపూర్ణ, రంగనాయక సాగర్ జలాశయాలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని హరీష్‌రావు లేఖలో పేర్కొన్నారు. 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్న సాగర్‌లో కేవలం 13 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 15 టీఎంసీలకు గాను 6 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. మల్లన్న సాగర్‌ను నింపితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ ప్రక్షాళనకు నీటిని మళ్లించే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

## అగ్రరాజ్య ఒత్తిళ్లకు ఇరాన్ లొంగదు

టెహ్రాన్: అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూర్ పెజెష్కియాన్ అత్యంత కీలక ప్రకటన చేశారు. రెండు దేశాల నడుమ నడుస్తున్న ఈ పోరాటం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సిన బాధ్యత అమెరికాపైనే ఉందని తేల్చిచెప్పారు. తమ దేశం యుద్ధాన్ని పొడిగించాలని ఎంతమాత్రం కోరుకోవడం లేదని, అయితే పోరును ముగించే అంశంపై ఇరుపక్షాల మధ్య సరైన అవగాహన లేదని స్పష్టం చేశారు. బాహ్య శక్తుల ఒత్తిళ్లకు తమ దేశం ఎప్పటికీ తలవంచదని హెచ్చరించారు. స్వదేశంలో నెలకొన్న ఆర్థిక సమస్యలను ఆసరాగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాల నేతలు ఇరాన్‌లో అశాంతిని రెచ్చగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రగులుతున్న ఈ వివాదాలు ఇటు ఇరాన్‌కు గానీ, అటు అమెరికాకు గానీ ఎలాంటి మేలు చేయవని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరినాటికి యుద్ధానికి తెరపడుతుందా అని విలేకరులు ప్రశ్నించిన సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింత క్షీణిస్తోంది. యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. తాజాగా రాజధాని రియాద్‌లోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డారు.

## ఇంతే కదా...!












# రేషన్ కార్డుల్లో ఊరి పేరు తప్పు

- పంపిణీ రోజే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నేటికీ సవరణ లేదు

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 25(వుదయం):**
రేషన్ కార్డుల్లో గ్రామం పేరు తప్పుగా నమోదు కావడంతో కొనాయిపల్లి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామానికి ఇటీవల పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లో 'కొనాయిపల్లి' పేరుకు బదులుగా కోనాపూర్ గా ముద్రించారు. దీంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డుల పంపిణీ జరిగిన మొదటి రోజే ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తప్పును వెంటనే సరిచేయాలని మొరపెట్టుకున్నట్లు తెలిపారు. అయితే రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి సవరణ చర్యలు చేపట్టకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం... రేషన్ కార్డుల్లో గ్రామం పేరు తప్పుగా ఉండటం చిన్న పొరపాటుగా భావించరాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రేషన్ కార్డు అనేక ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల్లో కుటుంబ వివరాలకు ఆధారంగా ఉపయోగపడుతుంది. గ్రామం పేరు తప్పుగా నమోదై ఉంటే ప్రభుత్వ రికార్డులతో వివరాలు సరిపోలకపోవడం, పథకాల లబ్ది పొందే సమయంలో ధ్రువీకరణ సమస్యలు, చిరునామా నిర్ధారణలో ఇబ్బందులు, ఇతర అధికారిక దరఖాస్తుల్లో వివరాల వ్యత్యాసం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పొరపాటును సరిచేయకపోతే భవిష్యత్తులో ప్రతి కార్డుదారుడు విడివిడిగా సవరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఒకే గ్రామానికి చెందిన పలువురి కార్డుల్లో ఒకే తప్పు దొర్లడం చేసుకోకపోవడంతో దీనిని వ్యక్తిగత సమస్యగా కాకుండా అధికారిక రికార్డుల సవరణకు సంబంధించిన అంశంగా పరిగణించాలని కోరుతున్నారు.

**వెంటనే సరిచేయాలని విజ్ఞప్తి**
రేషన్ కార్డుల పంపిణీ చేసిన రోజే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ ఉలుకు పలుకు లేకపోవడం బాధాకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తప్పుగా నమోదైన 'కోనాపూర్' పేరును తొలగించి, అధికారిక గ్రామం పేరు కొనాయిపల్లి గా నమోదు చేయాలని కోరుతున్నారు. కార్డుదారులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# దుద్దెడలో సీఎంఆర్ఎఫ్ చెక్ ల పంపిణీ

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి సెప్టెంబర్ 25**
మండల పరిధిలోని దుద్దెడ గ్రామానికి చెందిన 8 మందికి గ్రామ సర్పంచ్ మిద్దె శివకుమార్, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి కొండపాక మండల బీఆరెస్ పార్టీ అధ్యక్షులు నూనె కుమార్ లబ్ధిదారులైన గజ్వేల్ నాగరాజు కు రూ 37500, నర్ల శ్రీనివాస్ రెడ్డి కి రూ 23000, నాగార్ని రాములు కు 29000, సామలేటి పుష్ప కు 17500, కొమ్ము దేవలక్ష్మి కు 15000, నూనె అరవింద్ కు 16500, మహ్మద్ ఖాసిమ్ కు 9000, రాములు గౌడ్ కు 12000 మంజూరు అయినా చెక్ లను అందించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల వారు అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసహాయాన్ని అందించేందుకు అవకాశం ఉంది కాబట్టి ఇట్టి పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ 8 చెక్ లు మంజూరు కావడానికి అన్ని విధాల సహకరించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి లకు లబ్ధిదారులుతరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామ ఉపసర్పంచ్ పల్లె జానకి యాదగిరి, బీఆరెస్ పార్టీ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, దర్గ ప్రసాద్, చిక్కుడు భాను, పల్లె బాబు, ఎండి మగ్దుమ్, బసవరాజు నవీన్ చందు, పోతుగంటినాగరాజు, కెమ్మ సారంసంతోష్, ఎండినయిమ్, మెరుగు శివకుమార్, తలారి యాదగిరి, కొమ్ము కనకనరసింహులు, గజ్వేల్ నర్సింలు, సామలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




# సీనియర్ నాయకుడు మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్రెడ్డి

- మర్యాదపూర్వకంగా కలిసిన శాసనసభ్యులు డా పట్లోళ్ల సంజీవరెడ్డి వారి సోదరుడు డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

**_వుదయం మనూరు సెప్టెంబర్:25**
సంగారెడ్డి,జిల్లా కాంగ్రెస్ కమిటీ,(డీసీసీ),నూతన అధ్యక్షుడిగా, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి నియమితులైన,సందర్భంగా గౌరవ,మంత్రివర్యులు ఉత్తంకుమార్, రెడ్డి గారి స్వగృహం, హైదరాబాదులో శాలువా,కప్పి బొకే ఇస్తూ డిసిసి,ఎన్నికకు సహకరించినందుకు ధన్యవాదాలు,తెలిపిన శాసనసభ్యులు,డాక్టర్ పట్లోళ్ల,సంజీవరెడ్డి డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్,రెడ్డి ఈ,సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా,బాధ్యతలు స్వీకరించిన,పట్లోళ్ల చంద్రశేఖర్, రెడ్డికి మంత్రివర్యులు,ఉత్తమ్ కుమార్, రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ,బలోపేతానికి నిరంతరం, కృషి చేయాలని ఆకాంక్షించారు.జిల్లాలో,కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి,నుంచి మరింత పటిష్టం,చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి,నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం, చేసుకుంటూ ముందుకు,సాగుతామని ఈ సందర్భంగా,తెలియజేశారు



# గణేష్ గడ్డపై ముగిసిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు



- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం!
- 11 రోజులు విశేష అలంకరణలు.. ముగింపు వేళ 'ఫలసిద్ధి వినాయకుడి'గా దివ్య దర్శనం!
- నిరంతర నిత్య అన్నదానం.. అద్భుత ఏర్పాట్లతో ఈవో లావణ్య గారికి భక్తుల జేజేలు!

**సదాశివపేట సెప్టెంబర్ 25 (వుదయం):**
రుద్రారం శ్రీ గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయంలో 11 రోజుల పాటు సాగిన వినాయక చవితి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ 11 రోజుల్లో ఆలయానికి లక్షలాది మంది భక్తులు పోటెత్తడంతో గణేష్ గడ్డ పరిసరాలు జనసముద్రంగా మారాయి. 11 రోజులు విశేష అలంకారాలు: స్వామివారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హోమాలు, పుష్పాలంకరణలు నిర్వహించారు. 11వ రోజున యాపిల్, అనాస, ద్రాక్ష, దానిమ్మ వంటి రంగురంగుల తాజా పండ్లతో మూలవిరాట్టును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా, స్వామివారు 'ఫలసిద్ధి వినాయకుడి'గా భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. మరోవైపు లడ్డూ వేలంపాటపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.
వేలాది భక్తులకు నిత్య అన్నదానం: ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు కడుపునిండా నిరంతర నిత్య అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత సంతృప్తికరంగా నిర్వహించారు. ఈవో లావణ్య గారి తిరుగులేని పర్యవేక్షణ: లక్షల మంది భక్తులు తరలివచ్చినా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు రాకుండా కార్యనిర్వహణాధికారిణి (ఈవో) లావణ్య గారు క్షేత్రస్థాయిలో ఉంటూ స్వయంగా పర్యవేక్షించారు. భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు, తాగునీరు, ప్రత్యేక క్యూలైన్లు, నిరంతర నిత్య అన్నదాన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించి భక్తుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆమెకు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**పాల్గొన్న ప్రముఖులు:**
ఈ కార్యక్రమంలో ఈవో లావణ్య గారితో పాటు జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, ప్రముఖులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కె. సాయి గణేష్, ఎస్. సతీష్ కుమార్, ఎ. మురళి గౌడ్, ఎ. సంతోష్, ఎ. ప్రభు, టి. శివ రాములు, ఎ. రాజేష్ గౌడ్, ఎ. ముకుంద రెడ్డి, సి. నారాయణ రెడ్డి, డి. మహేష్, ఎ. కృష్ణ, ఆర్. శ్రీనివాస్, ఎం. భరత్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా నిలుస్తున్న కాద్లూర్ సర్పంచ్ సిద్దు

- ఎల్లయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.
- పార్టీలకతీతంగా సేవలు అందిస్తున్నారంటూ గ్రామస్తుల అభినందనలు.

**టేక్మాల్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కాద్లూర్ గ్రామ సర్పంచ్ ఎస్తేరు సిద్దు ప్రజలకు కష్టకాలంలో అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపదొచ్చినా తనవంతు సహాయం చేస్తూ ముందుకెళ్తున్నారు.
గ్రామానికి చెందిన మారిగారి ఎల్లయ్య తల్లి ఆకస్మికంగా మరణించిన విషయం తెలుసుకున్న సర్పంచ్ సిద్దు, వెంటనే స్పందించి ఆ కుటుంబానికి రూ. 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ఎల్లయ్య కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు.కాద్లూర్ గ్రామంలో పేదల వివాహాలు, వేడుకలు లేదా ఎవరికైనా అనారోగ్య సమస్యలొచ్చి ఆసుపత్రి పాలైనా, అంసతువులైన కుటుంబాలకు సర్పంచ్ ఎస్తేరు సిద్దు పార్టీలకు అతీతంగా స్పందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. కష్టాల్లో ఉన్నవారికి ఆర్థికంగా, నైతికంగా భుజంకాస్తున్న సర్పంచ్ సేవలను గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కమ్మర్ పల్లి లో సంపూర్ణ మద్యపాన నిషేధం సర్పంచ్ బరిగే సుజాత

- మద్యం అమ్మకాలను నిషేధించిన గ్రామస్తులు
- మద్యం అమ్మితే లక్ష రూపాయల జరిమానా
- మద్యం అమ్మినట్లు సమాచారం అందిస్తే పదివేల నజరానా
- మద్యపానంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తుల ఆవేదన
- అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో తీర్మానం

**దుబ్బాక, సెప్టెంబర్ 25, వుదయం:**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం కమ్మర్ పల్లి గ్రామంలో శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ బరిగే సుజాతనరేష్ ఆధ్వర్యంలో గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో మద్యం వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

**లక్ష రూపాయల జరిమానా...**
నేటి నుండి గ్రామంలో ఎవరూ మద్యం అమ్మకూడదని తీర్మానించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.1,00,000 (ఒక లక్ష) జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం అమ్మే వారి వివరాలను గ్రామ పంచాయతీకి తెలిపిన వారికి రూ.10,000 పారితోషికం ఇస్తామని ప్రకటించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు, అధికారులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.వందన, వార్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# గ్యాస్ వినియోగదారులపై 'డెలివరీ' దోపిడి..!

- రూపాయి వదలకుండా ముక్కుపిండి వసూలు చేస్తున్న ఏజెన్సీలు
- బుకింగ్ ఛార్జీల్లోనే డెలివరీ ఫీజు ఉన్నా.. సిలిండర్‌కు రూ. 30 నుండి రూ. 50 అదనం
- మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో నిలువు దోపిడీ
- కేంద్రం ఇచ్చే సబ్సిడీ రూ. 46.. ఏజెన్సీలు నొక్కేసేది రూ. 50!
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు




**మిరుదొడ్డి, సెప్టెంబర్ 25, వుదయం:**
అది ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించే గ్యాస్ సిలిండర్.. కానీ దాన్ని సామాన్యుడి ఇంటికి చేర్చాలంటే ఏజెన్సీల 'మామూలు' చెల్లించాల్సిందే! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా వినియోగదారులు నిర్దేశిత రూ. 1011/ చెల్లించి సిలిండర్ బుక్ చేసుకుంటుంటే, డెలివరీ బాయ్స్ రూపంలో ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను నిలువునా దోచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, అక్బర్‌పేటభూంపల్లి మండలాల్లో గ్యాస్ డెలివరీ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనల ప్రకారం డెలివరీ ఛార్జీలు కూడా బుకింగ్ అమౌంట్‌లోనే కలిసి ఉన్నప్పటికీ.. ఇంటికొచ్చే సరికి డెలివరీ బాయ్స్ సిలిండర్‌పై అదనంగా రూ. 30 నుండి రూ. 50 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇవ్వని పక్షంలో సిలిండర్ లేదని తెగేసి మాట్లాడుతుండటంతో, సామాన్య వినియోగదారులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబోదిబోమంటున్నారు.

**రోజుకు వేలు.. నెలకు లక్షల దోపిడీ!**
ఈ నాలుగు మండలాల్లో కలిపి ప్రతి రోజూ వేల సంఖ్యలో గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతోంది. ఒక్కో సిలిండర్‌పై రూ. 50 చొప్పున లెక్కగట్టినా, రోజుకు వేల రూపాయలు, నెలకు లక్షల రూపాయల అదనపు భారం పేద, మధ్యతరగతి వినియోగదారులపై పడుతోంది. కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల ఖాతాల్లో నేరుగా రూ. 46 వరకు సబ్సిడీ అమౌంట్ జమ చేస్తుంటే, ఇటు ఏజెన్సీ నిర్వాహకులు డెలివరీ బాయ్స్ ద్వారా అంతకంటే ఎక్కువే (రూ. 50) ముందుగానే దండుకుంటుండటం గమనార్హం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మొత్తం కాస్తా.. ఏజెన్సీల అక్రమ సంపాదనకు దారి మళ్లుతోందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెలివరీ బాయ్స్ కేవలం ముఖచిత్రం మాత్రమేనని, అసలు సూత్రధారులు ఏజెన్సీ నిర్వాహకులేనని, వారి కనుసన్నల్లోనే ఈ వసూళ్ల పర్వం నడుస్తోందని స్పష్టమవుతోంది. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఐదు కిలోమీటర్ల లోపు ఉన్నవారికి డెలివరీ ఛార్జ్ లేకుండా ఉచితంగా, 15 కిలోమీటర్లు ఉన్నవారికి 10 రూపాయలు, ఆ పైన వారికి 15 రూపాయలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం వాటిని తుంగలో తొక్కుతున్నారు.

**అధికారుల వైఖరిపై విమర్శలు!**
ఈ బహిరంగ దోపిడీపై జిల్లా పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లై) అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏజెన్సీల నుంచి ముడుపులు అందుతుండటం వల్లే ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించిన ప్రజల సమస్యను తెలుసుకున్న దాఖలాలు లేవని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.



# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

- తాడూర్ లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**తాడూర్, సెప్టెంబరు 25 (వుదయం ప్రతినిధి):**
పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం తాడూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ కుమార్, తాడూర్ సర్పంచ్ సంద మల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు యార రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిక్కొండ్ర మల్లేష్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన తేజస్వినికి ఎమ్మెల్యే సన్మానం

- వైద్యరంగంలో ఉన్నతంగా రాణించి ప్రజలకు సేవ చేయాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల, సెప్టెంబర్ 25 వుదయం కరస్పాండెంట్)**
గద్వాల పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన తేజస్విని ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆమెను ఘనంగా సన్మానించారు. శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో తేజస్వినిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యరంగంలో మెరుగైన విద్య, శిక్షణ పొందిన అనంతరం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన తేజస్విని భవిష్యత్తులో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామం, గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.తేజస్వినిని స్ఫూర్తిగా తీసుకుని గద్వాల నియోజకవర్గంలోని మరింత మంది విద్యార్థులు వైద్యరంగంతో పాటు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని తమ లక్ష్యాలను సాధించగలరని అన్నారు. తేజస్వినికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘం నరసింహులు, మాల శ్రీనివాసులు, రామాంజనేయులు, ఆంజనేయులు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 36 లక్షలకు పైగా [illegible] లడ్డూ కైవసం!

- పంచవటి క్షేత్రంలో కనీవినీ ఎరుగని రికార్డు నెలకొల్పిన భక్తులు " శ్రీ అవుసలి వీరన్న – విజయలక్ష్మి దంపతులు
- పరమ పూజ్యశ్రీ శ్రీ శ్రీ సద్గురు కాశీనాథ్ బాబా వారి దివ్య ఆశీస్సులతో భక్తి పారవశ్యం

**సదాశివపేట సెప్టెంబర్ 25 (వు దయం):**
పంచవటి పుణ్యక్షేత్రంలోని శ్రీ సిద్ధి సరస్వతీ దేవాలయ ప్రాంగణంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో సాగిన గణనాథుని లడ్డూ వేలం భక్తి పారవశ్యంతో పులకరించిపోయింది. చరిత్ర సృష్టించిన భక్తి ప్రపత్తులతో సాగిన ఈ వేలంపాటలో ఏకంగా రూ. 36,00,001/ (ముప్పై ఆరు లక్షల ఒక రూపాయి) లు వెచ్చించి మహాగణపతి లడ్డూను రాఘవాపూర్ శ్రీ అవుసలి వీరన్న - శ్రీమతి విజయలక్ష్మి దంపతులు కైవసం చేసుకున్నారు.

**బాబా వారి మంగళాశాసనాలతో ఘనంగా వేలం:**
సాక్షాత్ అవధూత స్వరూపులు, పరమ పూజ్యశ్రీ శ్రీ శ్రీ సద్గురు కాశీనాథ్ బాబా గారి దివ్య మంగళాశాసనాలతో, ఏకంగా 41 మంది ఉద్దండ వేద పండితుల వేదమంత్రాల నడుమ 11 రోజుల పాటు వైభవోపేతంగా విశేష పూజలందుకున్న సాక్షాత్ సిద్ధి వినాయకుని మహా ప్రసాదాన్ని (లడ్డూను) దక్కించుకోవడానికి భక్తుల నడుమ తీవ్రమైన పోటీ నెలకొంది. ఆ పోటాపోటీ వేలంలో అచంచల భక్తి భావంతో, అనన్యమైన ధైర్యంతో ముందుకొచ్చిన పరమ భక్తులు రాఘవాపూర్ అప్పగారు శ్రీ అవుసలి వీరన్న - విజయలక్ష్మి దంపతులు రికార్డు స్థాయిలో వేలం పాడి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు.
మా జన్మజన్మల పుణ్యఫలం - భక్తులు రాఘవాపూర్ అప్పగారు:
**లడ్డూ ప్రసాదం దక్కించుకున్న అనంతరం భక్తి సామ్రాజ్య చక్రవర్తులుగా నిలిచిన రాఘవాపూర్ అప్పగారు శ్రీ అవుసలి వీరన్న - విజయలక్ష్మి దంపతులు భావోద్వేగంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**



"గత 11 సంవత్సరాలుగా పుష్కరకాల చండీ రుద్ర మహాయాగాల మహా దివ్య హోమజ్వాలలతో పునీతమైన ఈ పంచవటి దివ్యక్షేత్రంలో సాక్షాత్ విఘ్నేశ్వరుని మహాప్రసాదాన్ని దక్కించుకోవడం, పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ సద్గురు కాశీనాథ్ బాబా గారి దివ్య ఆశీస్సులను ప్రత్యక్షంగా అందుకోవడం మా జన్మజన్మల పుణ్యఫలం. ఇది మేము చేసుకున్న ఎన్నో జన్మల సుకృతం" అని పరవశించిపోయారు.

**భక్తుల జయజయధ్వానాలు – ప్రశంసల జల్లు:**
స్వామివారిపై వారికి ఉన్న అపారమైన భక్తిని, త్యాగనిరతిని చూసి క్షేత్ర నిర్వాహకులు, వేద పండితులు మరియు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం నివ్వెరపోయారు. దశదిశలా భక్తి కీర్తిని చాటిచెప్పిన రాఘవాపూర్ అప్పగారు శ్రీ అవుసలి వీరన్న విజయలక్ష్మి దంపతులపై సకల భక్తకోటి ప్రశంసల వర్షం కురిపించింది.
గణనాథుని కరుణాకటాక్షాలతో, సద్గురు బాబా గారి దివ్య ఆశీర్వాదాలతో రాఘవాపూర్ అప్పగారు శ్రీ అవుసలి వీరన్న గారి కుటుంబం సకల సంపదలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆలయ ప్రతినిధులు, భక్తులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్వాడి రోడ్లను డ్రైనేజీలను పరిశీలించిన సర్పంచ్ ఉప సర్పంచ్

- గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఆధ్వర్యంలో పరిశీలన

**ఊర్కొండ న్యూస్ 27 వుదయం ప్రతినిధి**
నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు గుండ్ల గుంటపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ రమేష్ నాయక్ ఉపసర్పంచ్ కొండల్ మరియు పంచాయతీ సెక్రెటరీ నస్రీన్ మేడమ్ గారు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేయడమైనది బాలింతలకు మరియు గర్భిణీ స్త్రీలకు సరియైన నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని మెనూ ప్రకారంగా అందించాలని సూచించడం అయినది.రోడ్లపై మురుగు నీరు అండర్ డ్రైనేజీలోకి ప్రతి ఒక్కరు కలుపుకోవాలని వర్షపు నీరును నిలవకుండా చూసుకోవాలని సూచించడం అయినది నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వల్ల రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలకు తెలియజేయడమైనది . సర్వే నెంబర్ 120 లో ప్రభుత్వ ప్లాట్లు ఉన్నందున ప్లాట్ లను కొనడం గాని అమ్మడం గాని చేయకూడదు ఒకవేళ కొన్న అమ్మిన గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా ఎవరు గానీ ఇల్లు కట్టుకోవడానికి కచ్చితంగా గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకోవాల్సిందే అని సూచించడం జరిగింది అని గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ ప్రజలకు తెలియజేశారు



# పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే పోలీసుల ప్రధాన బాధ్యత
- ఏఎస్సైగా పదోన్నతి పొందిన కె. గోపాల్‌కు జిల్లా ఎస్పీ అభినందనలు

**గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)**
ఉద్యోగ జీవితంలో పదోన్నతి కేవలం పదవిలో ఎదుగుదల మాత్రమే కాదని, బాధ్యతలు మరింత పెరిగే దశగా భావించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., అన్నారు. మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె. గోపాల్ తన కృషి, నిబద్ధతకు ప్రతిఫలంగా ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా గోపాల్‌కు నక్షత్రాలు తొడిగి అభినందనలు తెలిపారు. పదోన్నతితో కొత్త ఉత్సాహం, మరింత నిబద్ధత, సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.విధుల నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.





## ప్రగతినగర్ లో ఘనంగా శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలు



బాచుపల్లి, సెప్టెంబర్ 25, (వుదయం ప్రతినిధి ),

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి
- ముఖ్య అతిథికి ఘన స్వాగతం

ప్రగతి నగర్ 2వ డివిజన్‌లోని శ్రీ మహా గణపతి దేవాలయం వద్ద ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శ్రీ మహాగణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, కాలనీ ప్రజలు హన్మంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధి కలగాలని స్వామి వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 276 ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, 294 బహదూర్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, ఆంజనేయ వర్మ, వేణు, ఖయ్యుమ్, ఆలేటి శ్రీనివాస్, కాళిదాస్, రాములు నాయక్, సురేందర్ యాదవ్, సుబ్బు, మద్ది నారాయణ రెడ్డి, మేడ శ్రీనివాసరావు, హరీష్, రాజ్ రెడ్డి, సాంబశివరావు, శ్రీ మహా గణపతి ఉత్సవ సమితి సభ్యులు, కాలనీ ప్రతినిధులు దివాకర్, డి. శ్రీనివాసరావు, గణపతి రావు, సాయి గౌడ్, వెంకటేష్, శ్రీకాంత్ పటేల్, విజయ్ భాస్కర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, రమేష్, మురళి, ప్రతాప్, రాంపుల్లా రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

## వేముల వీరేశం సమీక్షా సమావేశం

నకిరేకల్ (వుదయం ప్రతినిధి):



నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు అన్ని శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ఇరిగేషన్, R&B, విద్య, వైద్యం, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, పోలీస్ తదితర శాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారుఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం గారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.ఇరిగేషన్: చెరువులు, కాలువలు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.R&B: నియోజకవర్గంలో కొత్త రహదారుల నిర్మాణం, ఇప్పటికే మంజూరైన రోడ్ల పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. మరమ్మతులు అవసరమైన రహదారుల చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు: అర్హులైన పేదలకు రెండో విడతలో ఇళ్ల మంజూరులో ఎలాంటి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్య, వైద్యం: ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజలు తమ సమస్యలతో వచ్చినప్పుడు వాటిని తక్షణమే పరిష్కరించేలా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరు సంతోషంగా ఉండాలి



- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25,(వుదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం 277వ డివిజన్‌లో మహాదేవపురం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని విఘ్నేశ్వరుడిని వేసుకున్నట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పిస్తాయని అన్నారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మహాదేవపురం అసోసియేషన్ కాలనీ ప్రెసిడెంట్ వెంకట రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ రెడ్డి, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయరాం రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, కమలాకర్, తెలంగాణ సాయి, మాజీ ప్యాక్ డైరెక్టర్ పర్వ శ్రీనివాస్, కాలనీ జనరల్ సెక్రెటరీ దుగ్గిల ప్రసాద్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా, అజయ్ ప్రసాద్ గుప్తా, నగేష్, గాలి పోచమ్మ నరసింహ, శివ నాయక్, గౌస్, భాస్కర్, పవన్, అనిల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, దిలీప్, చందు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సెస్ త్వరిత వసూలు



- పంచాయతీ, మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆదేశం

గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ సెస్ వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఇప్పటివరకు ఉన్న బకాయిలను త్వరిత గతిన వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీలోని తన ఛాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ సెస్ వసూళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో వసూలు చేసే ఇంటి పన్నులో 0.8 శాతం గ్రంథాలయ సెస్‌ను విధిగా వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని గ్రంథాలయ సెస్ బకాయిల వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మొత్తాలను ఎలాంటి జాప్యం లేకుండా వసూలు చేయాలని ఆదేశించారు.వసూలు చేసిన గ్రంథాలయ సెస్ మొత్తాలను జిల్లా గ్రంథాలయ సంస్థ, జోగులాంబ గద్వాల ఖాతాలో సకాలంలో జమ చేయాలని స్పష్టం చేశారు. గ్రంథాలయ సెస్ వసూళ్లలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.గ్రంథాలయ సెస్ వసూళ్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బకాయిల వసూళ్లకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## చెట్లపోతారంలో గణేష్ లడ్డూ రికార్డు!

- లక్కీ డ్రాలో మహిళకు 10 తులాల వెండి కాయిన్
- చిన్న లడ్డూ యూత్ సభ్యుడి సొంతం
- అంగరంగ వైభవంగా ముగిసిన నిమజ్జన మహోత్సవం

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్లపోతారం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడిని స్థానిక అయ్యమ్మ చెరువులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

**పెద్ద లడ్డూ రూ. 2.15 లక్షలు**

నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన గణపతి పెద్ద లడ్డూ వేలం పాటలో స్థానిక నాయకుడు మద్దూరి పటేల్ బాలయ్య రూ.2.15 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

**లక్కీ డ్రాలో మహిళకు వెండి కాయిన్**

గణనాథుడి వద్ద పూజలు అందుకున్న 10 తులాల వెండి కాయిన్‌ను నిర్వహించిన లక్కీ డ్రాలో స్థానిక మహిళ నారబోయిన కోమల నర్సింగ్‌రావు గెలుచుకున్నారు. పెద్ద లడ్డూతో పాటు చిన్న లడ్డూ, వెండి కాయిన్ విజేతలను



చెట్లపోతారం ఫ్రెండ్స్ యూత్ గణేష్ లడ్డూ @ రూ. 2.15 లక్షలు

ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ గణేశుడి కృపాకటాక్షాలతో ఈ అదృష్టం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గణపతి శోభాయాత్రను కోలాటాలు, డీజే స్టెప్పులు, ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులో గణనాథుడి నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లికార్జున హిల్స్ లడ్డూ రూ.1.75 లక్షలు



అమీన్‌పూర్ (వుదయం):

అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం భక్తుల మధ్య ఉత్సాహభరితంగా సాగింది. గణేష్ మండపం వద్ద నిర్వహించిన ఈ వేలం పాటలో తలారి శైలజ-రాజు దంపతుల కుమారుడు చరణ్ పోటాపోటీగా పాల్గొని వినాయక స్వామివారి మహా లడ్డూను రూ.1,75,116లకు కైవసం చేసుకున్నారు. లడ్డూ వేలం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందేందుకు ఉత్సాహం చూపించారు. వేలం ముగిసిన అనంతరం నిర్వాహకులు తలారి శైలజ-రాజు దంపతులను ఘనంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ, వినాయక ఉత్సవాలు భక్తి, ఐకమత్యం మరియు సామాజిక స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. స్వామివారి లడ్డూను దక్కించుకున్న చరణ్ మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వినాయకుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున హిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, జనరల్ సెక్రటరీ తలారి రాజు, వైస్ ప్రెసిడెంట్లు రాఘవ రెడ్డి, హనుమంత్ రెడ్డి, ట్రెజరర్ శివకుమార్, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, యువత మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

## ఆర్భాటాలు వద్దు... సేవలే ముద్దు!



- విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేత.. మదర్సా విద్యార్థులకు భోజన వసతి

చేవెళ్ల, సెప్టెంబర్25 (వుదయం)

పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు చేవెళ్ల బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు, ఇబ్రహీంపల్లి మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ జాహెద్. తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే పలు సామగ్రిని తన సొంత ఖర్చులతో అందజేశారు.పాఠశాలకు కుర్చీలు, బీరువా, చెత్తబుట్టలు, విద్యా సామగ్రి తదితర అవసరమైన వస్తువులను అందించారు.అనంతరం ఇబ్రహీంపల్లి వార్డులోని మదర్సా విద్యార్థులకు ప్రత్యేకంగా భోజన వసతి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ అవార్డు గ్రహీత, సామాజికవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి. రామకృష్ణారావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ కార్యక్రమాలకు హాజరై మహమ్మద్ జాహెద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పుట్టినరోజును జరుపుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఊరడి రాం ప్రసాద్,సామాజిక కార్యకర్త అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి, బురాన్ రాజు, మైనార్టీ నాయకులు యాసిన్, దాతర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నక్కాకు కెమిస్ట్రీ పీహెచ్.డీ

పటాన్చెరు (వుదయం):



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ నక్కా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డిజైన్ ద్వారా విశ్లేషణాత్మక నాణ్యత (AQbD), గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను ఉపయోగించి ఔషధాలలో నైట్రోసమైన్ ఔషధ పదార్థసంబంధిత మలినాల (NDSRIs) కోసం LC MS పద్ధతి అభివృద్ధికి వ్యూహాత్మక విధానాల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాస్ డాక్టరేట్ పరిశోధన, ఔషధాల సంశ్లేషణ, ఫార్ములేషన్, నిల్వ, తయారీ ప్రక్రియల సమయంలో ఏర్పడగల NDSRIsతో ముడిపడి ఉన్న, పెరుగుతున్న ఫార్మాస్యూటికల్, రోగిభద్రతా ఆందోళనలను పరిష్కరిస్తుందని తెలియజేశారు. ఈ అధ్యయనం సిప్రోఫ్లోక్సాసిన్, మోక్సిఫ్లోక్సాసిన్, ఏక్లోఫెనాక్, మెఫెనామిక్ యాసిడ్, టామ్సులోసిన్‌తో సహా ఎంపిక చేసిన యాంటీబయాటిక్, యాంటీఇన్ ఫ్లమేటరీ, ఆల్ఫా1 బ్లాకర్ ఔషధ పదార్థాలు, ఉత్పత్తులలో NDSRIs సంశ్లేషణ, విషపూరితత అంచనా, సున్నితమైన పరిమాణీకరణపై దృష్టి సారించిందన్నారు.ఔషధ తయారీలో కఠినమైన నియంత్రణ అవసరాలకు మద్దతునిస్తూ, నాణ్యత నియంత్రణ, రోగిభద్రతా చర్యలను బలోపేతం చేస్తూ, ఈ మలినాలను ఖచ్చితంగా గుర్తించడానికి, వాటి పరిమాణాన్ని నిర్ధారించడానికి అత్యంత సున్నితమైన UPLC-MS/MS విశ్లేషణా పద్ధతిని అభివృద్ధి చేయడం జరిగిందని వివరించారు.డాక్టర్ శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించడమే గాక, ఔషధ మలినాల పరిశోధనకు ఆయన చేసిన విలువైన కృషిని అభినందించినట్టు తెలిపారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకితభావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబును కూడా ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి

- 36 లక్షల రూపాయల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పటాన్చెరు ( వుదయం):

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో.. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు సంబంధించిన 83 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 35 లక్షల 30 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు.ఈ కార్య కుమార్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, రామచంద్రపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీకాంత్ బాలరాజు, వెంకటేష్, హమీద్, మధు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రూ.1.05 లక్షలకు గణేష్ లడ్డూ



- వేలంలో గణేష్ లడ్డు దక్కించుకున్న నరాల వంశీ క్రిష్ణ - కవిత

మేడిపల్లి

వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 25.

మేడిపల్లి లోని హరిని మాన్షన్ ఎదురుగా, హై టెన్షన్ లేన్ లోని వర సిద్ధి వినాయక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గణేష్ లడ్డూ వేలం పాట భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు, లడ్డు వేలంలో 1,05,116/లకు నరాల వంశీ క్రిష్ణ కవిత దంపతులు గణేష్ లడ్డూను దక్కించుకుని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేత దంపతులకు ఉత్సవ కమిటీ సభ్యులు హృదయపూర్వక అభినందనలు, శుభా కాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ నరాల వంశీ క్రిష్ణ కవిత దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సభ్యులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ గౌడ్ కుటుంబానికి పరామర్శ

- కుమార్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

పటాన్చెరు( వుదయం):

పటాన్చెరు మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడిల శ్రీకాంత్ గౌడ్ కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లు పరామర్శించారు.శ్రీకాంత్ గౌడ్ తండ్రి గడిల కుమార్ గౌడ్ రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇస్నాపూర్‌లోని శ్రీకాంత్ గౌడ్ నివాసానికి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెళ్లారు. ముందుగా కుమార్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం శ్రీకాంత్ గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, కుమార్ గౌడ్ మృతికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గడీల కుమార్ గౌడ్ ను పరామర్శించారు. ఇటీవల కుమార్ గౌడ్ తండ్రి గడిల ఈశ్వరయ్య గౌడ్ గారు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కష్టపడే కార్యకర్తలకు న్యాయం జరిగేదెప్పుడు?

చేవెళ్ల,సెప్టెంబర్ 25 (వుదయం)



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కష్టపడే కార్యకర్తలకు న్యాయం ఎప్పుడు జరుగుతుందని చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరెళ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షరీఫ్ ఖాన్ ప్రశ్నించారు.శుక్రవారం ఆయన కార్యకర్తల సమస్యలు, పార్టీ పరిస్థితిపై భావోద్వేగంగా స్పందించారు.కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ, కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోస్తూ కార్యకర్తలు పార్టీకి అండగా నిలిచారని తెలిపారు. యిలో నిరంతరం పనిచేసిన కార్యకర్తలను ప్రస్తుతం పట్టించుకునే నాథుడు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నా, ఇప్పటి వరకు కనీసం ఒక్కసారి కూడా పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించకపోవడం విచారకరమని షరీఫ్ ఖాన్ పేర్కొన్నారు.కార్యకర్తల సమస్యలు, వారి అభిప్రాయాలు తె స్యలు తెలుసుకుని, పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు, న్యాయం కల్పించాలని షరీఫ్ ఖాన్ విజ్ఞప్తి చేశారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని, వారి ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా నాయకత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

వెల్దండ సెప్టెంబర్ 25 (వు దయం)

మండల కేంద్రంలో శ్రీ రామ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి తొమ్మిది రోజులుగా విశేష పూజలు అందించి శుక్రవారం నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో వరుసగా రెండు సార్లు లడ్డూ ను రేవల్లి దర్గయ్య 65 వేలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమానికి. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ దర్గయ్యకు శాలువాలు కప్పి సన్మానించారు .



కార్యక్రమంలో ఉప సర్పంచ్, శ్రీరామ గణేష్ యూత్ ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, రామకృష్ణ ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు ఉన్నారు.




" ఇరాన్ అమెరికా మధ్య ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది అమెకానే. యుద్ధాన్ని కొనసాగించాలని మేము కోరుకోవట్లేదు. దీన్ని ఎలా ముగించాలనే విషయంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేదు. అగ్రరాజ్య ఒత్తిడికి టెహ్రాన్ ఎప్పటికీ లొంగబోదు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి అమెరికా, ఇజ్రాయెల్ యూరప్ నాయకులు అశాంతి వాతారణాన్ని సృష్టిస్తున్నారు. ఇరాన్‌కు గాని, అమెరికాకు గాని సంఘర్షణలు ప్రయోజనకరం కాదు. పెజెష్కియాన్, ఇరాన్ అధ్యక్షుడు "

**- పెజెష్కియాన్, ఇరాన్ అధ్యక్షుడు**

## వే'మన' పద్యం

**వేషభాషలెరిగి కాషాయవస్త్రముల్**
**కట్టగానె ముక్తి కలుగబోదు**
**తలలు బోడులైన తలపులు బోడులా**
**విశ్వదాభిరామ వినురవేమ**



# సంపాదకీయం

## ఎఐ వల్ల లాభమా? నష్టమా?


ఒకప్పుడు మనకు ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో వెతికేవాళ్లం. మనం ఇచ్చిన ప్రశ్నకు సంబంధించిన సమాచారం ఏ వెబ్‌సైట్లలో ఉందో గూగుల్ చూపించేది. మనమే ఆ వెబ్‌సైట్లను తెరిచి, సమాచారాన్ని చదివి, అవసరమైన విషయాన్ని అర్థం చేసుకోవాల్సి వచ్చేది.ఇప్పుడు పరిస్థితి మారింది. చాట్‌జిపిటి, డీప్‌సీక్ వంటి కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాధనాలు మన ప్రశ్నను అర్థం చేసుకుని, వివిధ సమాచారాన్ని విశ్లేషించి, మనిషి సమాధానం చెప్పినట్టుగా ఒక సమగ్ర సమాధానాన్ని అందిస్తున్నాయి. సమాచారాన్ని వెతకడం నుంచి దాన్ని విశ్లేషించి మనకు అర్థమయ్యే రూపంలో అందించడం వరకు ఒక కొత్త దశ ప్రారంభమైంది.కానీ ఈ సౌకర్యం వెనుక మన కళ్లకు కనిపించని ఒక భారీ మౌలిక సదుపాయాల వ్యవస్థ పనిచేస్తోంది. అదే డేటా సెంటర్ల ప్రపంచం. ఏఐ సేవలు పనిచేయడానికి విస్తారమైన డేటా సెంటర్లు అవసరం. పదుల వేల నుంచి లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఈ కేంద్రాల్లో వేలాది కంప్యూటర్లు, శక్తివంతమైన సర్వర్లు పనిచేస్తుంటాయి. వినియోగదారు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మాత్రమే కాదు, ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడం, శిక్షణ ఇవ్వడం, వాటిని నిరంతరం మెరుగుపరచడం వంటి ప్రక్రియలకు కూడా భారీ కంప్యూటింగ్ శక్తి అవసరం. ఒక ఏఐ మోడల్‌కు శిక్షణ ఇవ్వాలంటే అపారమైన డేటాను వేలాది కంప్యూటర్ల ద్వారా ప్రాసెస్ చేయాలి. ప్రశ్నలోని పదాలు మాత్రమే కాదు, వాటి మధ్య ఉన్న సంబంధాలు, సందర్భం, అర్థం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమాధానాన్ని రూపొందించాలి.ప్రశ్న ఎంత క్లిష్టంగా ఉంటే, దాని వెనుక జరిగే కంప్యూటింగ్ ప్రక్రియ కూడా అంత పెద్దదిగా ఉండొచ్చు. అంటే ప్రతి డిజిటల్ ప్రశ్నకు ఒక భౌతిక ఖర్చు కూడా ఉంటుంది. ఆ ఖర్చులో ముఖ్యమైనది విద్యుత్తు.ఏఐ వినియోగం వేగంగా పెరుగుతున్న కొద్దీ డేటా సెంటర్ల విద్యుత్ అవసరం కూడా పెరుగుతోంది. సాధారణ సెర్చ్ కంటే ఏఐ ఆధారిత ప్రశ్నలకు ఎక్కువ కంప్యూటింగ్ శక్తి అవసరమవుతుందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఈ తేడా ప్రతి మోడల్, ప్రశ్న, డేటా సెంటర్, సాంకేతికతను బట్టి మారుతుంది. కాబట్టి 'ఏఐ ప్రతి ప్రశ్నకు గూగుల్ కంటే ఖచ్చితంగా పది రెట్లు విద్యుత్తు వాడుతుంది’ అనే సాధారణీకరణను జాగ్రత్తగా చూడాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ అసలు సమస్య వేరే చోట ఉంది. ఆ విద్యుత్తు ఉత్పత్తిలో బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాల వాటా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డేటా సెంటర్ల విస్తరణ పరోక్షంగా కార్బన్ ఉద్గారాలను కూడా పెంచే అవకాశం ఉంది.డేటా సెంటర్ల పర్యావరణ ప్రభావం విద్యుత్తుతో మాత్రమే ముగియదు. నీటి వినియోగం కూడా అంతే ముఖ్యమైన అంశం. శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్లు పనిచేసేటప్పుడు పెద్ద మొత్తంలో వేడి ఉత్పత్తి అవుతుంది. ఆ వేడిని తొలగించడానికి అనేక డేటా సెంటర్లు వివిధ రకాల కూలింగ్ వ్యవస్థలను ఉపయోగిస్తాయి. వాటిలో కొన్ని నీటిని కూడా ఉపయోగిస్తాయి.కూలింగ్ టవర్ల ఆధారిత వ్యవస్థల్లో వేడెక్కిన నీటిని చల్లబరిచి తిరిగి ఉపయోగిస్తారు. అయితే ఈ ప్రక్రియలో కొంత నీరు ఆవిరైపోతుంది. ఆ నీరు వెంటనే అదే ప్రాంతానికి తిరిగి చేరదు. వాతావరణంలోకి వెళ్లిన నీటి ఆవిరి ఎక్కడ వర్షంగా కురుస్తుందన్నది గాలి ప్రవాహాలు, వాతావరణ పరిస్థితులు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఒక పరిశ్రమకు నీరు అందుబాటులో ఉందని మాత్రమే చూసి నిర్ణయం తీసుకోకుండా, ఆ ప్రాంతంలోని భూగర్భజలాలు, స్థానిక నీటి అవసరాలు, వర్షపాతం, వ్యవసాయం, ప్రజల తాగునీటి అవసరాలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.ఏఐని పూర్తిగా వ్యతిరేకించడం సమస్యకు పరిష్కారం కాదు. వైద్యం, విద్య, పరిశోధన, పరిశ్రమలు, పరిపాలన వంటి అనేక రంగాల్లో ఏఐ అందించే అవకాశాలు గణనీయమైనవి. అయితే ప్రతి సాంకేతిక విప్లవానికీ దాని పర్యావరణ, సామాజిక ఖర్చు ఉంటుంది.అందుకే ప్రశ్న ఏఐని ఉపయోగించాలా వద్దా అన్నది కాదు. ఏఐని ఎంత బాధ్యతాయుతంగా అభివృద్ధి చేయాలి? అన్నదే. డేటా సెంటర్లకు పునరుత్పాదక ఇంధనాన్ని పెంచడం, విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, నీటి వినియోగాన్ని తగ్గించే కూలింగ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, స్థానిక విద్యుత్ గ్రిడ్‌పై అదనపు భారాన్ని పారదర్శకంగా లెక్కించడం వంటి చర్యలు అవసరం. ఏఐ మనకు ఇచ్చే సమాధానాలు ఎంత వేగంగా, ఎంత తెలివిగా మారుతున్నాయో చూస్తున్నాం. కానీ ఆ ఒక్క సమాధానం వెనుక ఎన్ని సర్వర్లు పనిచేశాయి, ఎంత విద్యుత్తు ఖర్చయింది, ఎంత నీరు వినియోగించబడింది, ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వచ్చింది అన్న ప్రశ్నలను కూడా అడగాల్సిన సమయం వచ్చింది.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మానవతావాది చిలకమర్తి లక్ష్మనరసింహం

సాధారణంగా పుస్తకాలలో చదవడం కన్నా, దృశ్య శ్రవణ రూపంలో చూపిస్తే, వినిపిస్తే, అవలీలగా అందరికీ చేరి, ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గ్రహించిన పూర్వీకులు ప్రయోగాత్మకంగా చేసి సఫలీ కృతులైనారు. నాటి నాటకాలు, వీధి భాగోతాలు, హరికథలు, బుర్రకథలు, ముఖ్యంగా మన పౌరాణికాలు, ప్రబంధాలు సామాన్య ప్రజలకు అతి సులువుగా అర్థమయ్యేటట్లు చేశారు. అలాంటి ప్రజానాడి తెలిసి తదనుగుణంగా సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీయాలను తన నాటక రచనలలో చొప్పించి, ఆయా పాత్రల ద్వారా సగటు ప్రేక్షకునికి ఎంతో అనుభూతిని అందచేసిన మహా రచయిత, మానవతావాది, దాదాపు పాతిక వరకు నాటకాలను సృష్టించిన సంఘ సంస్కర్త, జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు చిలకమర్తి. చిలకమర్తి లక్ష్మీనరసింహం (సెప్టెంబరు 26, 1867 జూన్ 17, 1946) కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణ వాది, విద్యావేత్త. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. మహాకవి, కళాప్రపూర్ణ ఆయన బిరుదులు. ఇరవై రెండేళ్ళ



వయస్సప్పుడు ఆయన రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం "ప్రతులు లక్ష"కి పైబడి అమ్ముడు పోవట మనేది తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26 న పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలము లోని ఖండవల్లి గ్రామములో ఒక బ్రాహ్మణ కుటుంబములో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురం పట్టణాలలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టం చేత పట్టుకొన్నారు. 1889 లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఇన్నీసు పేట స్కూలు లోనూ, మునిసిపల్ హైస్కూలు లోనూ విద్యాబోధన సాగించారు. తరువాత ఒక సంవత్సరం "సరస్వతి పత్రిక" సంపాదకునిగా పని చేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నడిపారు. తరువాత ఆ పాఠశాల వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చ బడింది. పాఠశాలలో ఉన్నపుడే పద్యాలు వ్రాయడం ప్రారంభించిన లక్ష్మీ నరసింహం ఎన్నో రచనలు చేశారు. "కీచక వధ" ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. గయోపాఖ్యానం నాటకంలో "టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం" వేసేవారు. ఆయన వ్రాసిన నవలలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవి. సరస్వతి పత్రిక సంపాదకునిగా ఉన్నపుడు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం వ్రాశారు. ఇంకా అనేక రచనలు చేశాడు.అటు తెనుగు సాహిత్య, నాటక రంగాలకు, ఇటు సంఘ సంస్కరణోద్యమానికి మహోన్నత సేవలను అందించిన అపూర్వ వ్యక్తి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం. వీరు రచించిన "గయోపాఖ్యానం" నాటక పద్యాలు, "వందేళ్ళ" నుండి తెలుగు వారి నోట వినిపిస్తూ ఉన్నాయి. నాటక సమాజం ఉన్న ప్రతీ ఊరులోనూ ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 1943 నాటికి లక్ష ప్రతులు (కాపీలు) అమ్ముడు పోయినాయి అంటే అది ఎంత గొప్ప రచనో చెప్పకనే తెలుస్తోంది.1908లో ఒక ప్రెస్ స్థాపించారు. 1916 లో మనోరమ, పత్రిక అనే పత్రిక స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘు వంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. 21 అధ్యాయాల్లో రాసిన స్వీయ చరిత్రములో, ఆయన జీవిత కృషి మొత్తం వివరించ బడింది. బాల్యం, నర్సాపురంలో చదువు, రాజమండ్రిలో విద్యాభ్యాసం, ఉద్యోగం. గ్రంథ రచన, నాటక సమాజం, వివాహం, మండల సభల్లో పాల్గొనడం, రామమోహన పాఠశాల ఏర్పాటు, నిర్వహణ, ఉన్నత పాఠశాల ప్రారంభం, కుటుంబ సమస్యలు, కష్టాలు, టంగుటూరి ప్రకాశం ఇంగ్లండ్ యాత్ర, హితకారిణి సమాజ స్థాపన, అచ్చు యంత్రాన్ని నెలకొల్పడం, భారత జాతీయ కాంగ్రెస్ సభకు హాజరవడం, పత్రికా సంపాదకత్వం, నిర్వహణ - యివన్నీ సవివరంగా రాశారు. చిలకమర్తి ఏకసంధాగ్రాహి మాత్రమే కాదు, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి, స్వీయ చరిత్రలో, తన జీవిత కాలంలో జరిగిన ఘటనలను, సూక్ష్మాంశాలతో సహా చిత్రించారు. చారిత్రక ఘటనలను సమతూకం తోనూ, వ్యక్తుల గూర్చి రాస్తున్నప్పుడు రాగద్వేషాల కతీతంగా, స్పష్టంగా, క్లుప్తంగా రాశాడు. నిత్యనైమిత్తకాల గూర్చి రాస్తున్నా, వాటినొక అంతర్ దృష్టితో పరికించారు. లక్ష్మీ నరసింహం మొదటి తరం సంఘ సంస్కర్త. 1909 లో సామాజికంగా వెనుకబడిన వర్గాలకోసం ఒక పాఠశాల (రామమోహన పాఠశాల) స్థాపించారు. నిమ్న జాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్ర దేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుప బడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించ లేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్య కలాపాలలో పాలు పంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. గాంధీజీ భారత రాజకీయ పటంలోకి రాక మునుపే హరిజన బాలులకు చదువు చెప్పేందుకు "రాజారామోహన రాయి పాఠశాలను " నడిపించి తనలో నిక్షిప్తమై ఉన్న సంస్కరణా భిమానాన్ని చాటి చెప్పారు. ఇన్ని సుగుణాల సమాహారం మన చిలకమర్తి లక్ష్మీనరసింహం. తనకు మార్గదర్శకుడైన వీరేశలింగం పంతులు గారితో కలసి, రాజమహేంద్ర వరంలో హితకారిణీ సంస్థ నడిపించారు. కనుచూపు కోల్పోయినా, పరిస్థితులకు ఎదురొడ్డి నిలచి, పోరాడి, జీవితాంతం తెలుగు సాహిత్య నాటక రంగాలకు, సాంఘిక సంస్కరణలకు తన జీవిత కాలం ధారపోశారు. ఓ సుప్రసిద్ధ నాటక కర్తగా, హాస్య రచయితగా, పద్య, గద్య రత్నాకరుడిగా, నవలా రచయితగా తన రచనలతో సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సాధించారు. "గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వారి ప్రతాప రుద్రీయం, శ్రీపాద గారి బొబ్బిలి యుద్ధం, చిలకమర్తి వారి గయోపాఖ్యానం" తెలుగు నాటక మణి రత్నాలు. అనేక తెలుగు పద్య, గద్య రచనలు కావించారు చిలకమర్తి. వీటిలో అత్యధికాదరణలు పొందినవి 'గయోపాఖ్యానం', 'గణపతి'.1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది.

1946, జూన్ 17న లక్ష్మీనరసింహం మరణించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## రెక్కల బలం

గట్టు మీది నుంచి..
బాయిలో దూకడం
బహు తేలిక
బాయిలోంచి పైకి
ఎగరడం అసాధ్యం
నిర్ణయం
తీసుకోవడమే కాదు..
మాట జారడం కూడా
అంతే కదా!

చెట్టు పైన కూర్చున్న
పక్షి..
కొమ్మ విరుగుతుందని
గాని..
కింద పడతానని గాని
భయపడదు
పిట్టకి చెట్టు కొమ్మ పై
కాదు..
తన రెక్కల బలంపై
అతి విశ్వాసం!

తన కడుపులో
దాచుకున్న దారం..
అదే కొవ్వత్తిని దహనం
చేస్తుంది
మనుషులు కూడా
అంతే..
మన చుట్టూ నీడలా
నిలిచినోళ్లే..
నమ్మించి వెన్నుపోటు
పొడుస్తారు!

మనసులో చెడు
భావనలు ఉంటే
గుడి, గంగా జలం, తీర్థ
స్నానాలు..
మనల్ని ఉద్ధరించి
దీవిస్తాయా..
తియ్యని మాటలు
చెప్పేవారి కన్న..
చేదు నిజాల్ని ముఖం
మీద చెప్పేవారే..
నికార్సయిన నీ వాళ్ళు
అని తెలుసుకో!

ఆకర్షణీయ దుస్తులు..
మన అందాన్ని
రెట్టింపు చేస్తాయి
మంచి మనసు ఉన్న
మనిషి..
జీవితాన్ని ఉన్నతంగా
గడుపుతాడు
బాహ్యం కన్న అంతర్
సౌందర్యమే మిన్న!
పడినపుడు లేచి
నిలబడు
కష్టాల్లో అత్మ విశ్వాసం
వదులుకోకు
గాయాలకు భయపడి
ఆట మానుకోకు
గెలుపును శాశ్వతమని
విర్రవీగకు
చీకటి తర్వాత వెలుగు
రావడం తథ్యం!



మధుసూదన్ రెడ్డి
9949700037

# డీజే మోతలో మృత్యుఘోష

ఆనందం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టడం ఎందుకు?.పండుగైనా,పెళ్లి వేడుకైనా,ఊరేగింపైనా,విజయోత్సవమైనా..డీజే శబ్దాల మోత తప్పనిసరి అన్నట్టుగా మారింది.ఆనందాన్ని పంచుకోవాల్సిన వేడుకలు చెవులు చిల్లులు పడేంతటి శబ్దాలతో హోరెత్తుతున్నాయి. ఆ శబ్దాల మధ్య గంటల తరబడి డాన్సులు చేయడం, గుంపులుగా కదలడం, వాహనాలపై ఊరేగింపులు చేయడం ఇప్పుడు ఒక ట్రెండ్‌గా మారుతోంది. అయితే క్షణిక ఆనందం కోసం ఆరోగ్యాన్ని, చివరకు ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసం?

అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం వల్ల వినికిడి సమస్యలు, చెవుల్లో మోగుడు, నిద్రకు భంగం, ఒత్తిడి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అధికంగా, నిరంతరంగా ఉండే శబ్ద కాలుష్యం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్య నిపుణులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్నాయి.

***వినోదం మితిమీరితే.. ప్రమాదమే!***

డీజే అంటే కేవలం సంగీతం కాదు.. శబ్దాన్ని ఎంత ఎక్కువగా పెంచితే అంత గొప్ప వేడుక అన్న అపోహ కూడా పెరుగుతోంది. శబ్దం పెరిగిన కొద్దీ ఉత్సాహం పెరగాల్సింది పోయి, ప్రమాదం పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు అధిక శబ్దం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది.

అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం వల్ల వినికిడి శక్తిపై ప్రభావం పడవచ్చు. పునరావృతంగా తీవ్రమైన శబ్దానికి గురైతే శాశ్వత వినికిడి లోపం కూడా సంభవించే ప్రమాదం ఉంది. అంతేకాదు.. నిద్రాభంగం, మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలకూ శబ్ద కాలుష్యం కారణమవుతుంది.

అందుకే “అతి చేస్తే అనర్థమే” అన్న మాటను గుర్తుంచుకోవాలి. వేడుకలో ఉత్సాహం ఉండాలి.. కానీ ఉన్మాదం ఉండకూడదు. వినోదం మనిషి కోసం ఉండాలి.. మనిషి వినోదానికి బలి కాకూడదు. డీజే శబ్దం తగ్గితే ఆనందం తగ్గదు.. కానీ శబ్దం హద్దులు దాటితే ప్రమాదం మాత్రం పెరుగుతుంది.

***నిబంధనలు కాగితాలపై కాదు,క్షేత్రస్థాయిలో అమలు కావాలి***

దేశంలో శబ్ద కాలుష్య నియంత్రణకు Noise Pollution (Regulation and Control) Rules, 2000 అమల్లో ఉన్నాయి. ప్రాంతాన్ని బట్టి పగలు, రాత్రి శబ్ద పరిమితులు నిర్ణయించబడ్డాయి. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, న్యాయస్థానాల చుట్టూ నిశ్శబ్ద ప్రాంతాలను ఏర్పాటు చేసే నిబంధనలు కూడా ఉన్నాయి. లౌడ్‌స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల వినియోగానికి అనుమతి అవసరం. రాత్రి వేళల్లో వాటి వినియోగంపైనా పరిమితులు ఉన్నాయి.

అయితే నిబంధనలు ఉండటం ఒక్కటే సరిపోదు.. వాటి అమలే అసలు విషయం. వేడుకలకు ముందే నిర్వాహకులకు స్పష్టమైన నియమాలు తెలియజేయాలి. అనుమతుల పరిశీలన, శబ్దస్థాయి పర్యవేక్షణ, నిబంధనల ఉల్లంఘనపై తక్షణ చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఇబ్బంది కలిగించే స్థాయిలో శబ్దం ఉంటే ఫిర్యాదులను అధికారులు వేగంగా స్వీకరించి స్పందించాలి.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతలో శబ్ద కాలుష్యాన్ని కూడా భాగంగా చూడాలి. “వేడుక కదా.. కాసేపే కదా..” అంటూ నిర్లక్ష్యం చేస్తే చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు.

***బాధ్యత పాలకులదే కాదు.. ప్రజలదీ!***

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతగా భావించడం సరికాదు. డీజే నిర్వాహకులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. వేడుకకు వచ్చిన యువత ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకోవాలి. తల్లిదండ్రులు, పెద్దలు కూడా అధిక శబ్దం వల్ల కలిగే ఇబ్బందులపై పిల్లలకు అవగాహన కల్పించాలి.ప్రతి వేడుకలో ఒక విషయం గుర్తుంచుకోవా ——ఆనందం అందరికీ ఉండాలి.. ఇబ్బంది ఎవరికీ ఉండకూడదు. మన వేడుక వల్ల పక్కింటి వృద్ధుడు నిద్రపోలేకపోవడం, విద్యార్థి చదువుకోలేకపోవడం, అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఇబ్బంది పడటం, చిన్నారులు భయపడటం జరిగితే ఆ వేడుక ఉద్దేశమే దెబ్బతింటుంది.

పండుగల సంస్కృతి మనుషులను కలపాలి.. శబ్ద కాలుష్యం మనుషులను ఇబ్బంది పెట్టకూడదు. ఆధునికత పేరుతో మితిమీరిన శబ్దాన్ని ప్రోత్సహించడం కాదు.. సంగీతాన్ని ఆస్వాదించే సంస్కారాన్ని పెంచుకోవాలి. డీజే ఎంత పెద్దదైతే వేడుక అంత గొప్పది కాదు; మనుషుల భద్రత, ప్రశాంతత ఎంత కాపాడితే ఆ వేడుక అంత సార్థకం.**ప్రాణం కంటే పెద్ద వేడుక ఏదీ కాదు!**

ఒక వేడుక కోసం వందలాది మంది చేరుతారు. కొద్దిసేపు ఉత్సాహంగా గడుపుతారు. సంగీతం ఆగిపోతుంది.. జనాలు ఇళ్లకు వెళ్లిపోతారు.. కానీ ఏదైనా ప్రమాదం జరిగితే ఒక కుటుంబానికి జీవితాంతం తీరని విషాదం మిగులుతుంది. అందుకే వేడుక ముగిసిన తర్వాత మిగిలేది ఆనందపు జ్ఞాపకమా.. లేక విషాదపు జ్ఞాపకమా అన్నది మన నియంత్రణలోనే ఉంది.

డీజే పెట్టుకోవడం తప్పు కాదు.. కానీ హద్దులు దాటి శబ్దం చేయడం తప్పు. ఆనందించడం తప్పు కాదు.. కానీ ఇతరుల ప్రశాంతతను, ఆరోగ్యాన్ని భంగం చేయడం తప్పు. ఉత్సాహం తప్పు కాదు.. కానీ విచక్షణ కోల్పోవడం మాత్రం ప్రమాదకరం. పాలకులు నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలు నిబంధనలను గౌరవించాలి. యువత ఉత్సాహంతో పాటు అప్రమత్తతను కూడా చూపాలి. ఒక డీజే శబ్దాన్ని తగ్గించడం ద్వారా ఒకరి చెవులను కాపాడవచ్చు.. ఒకరి ఆరోగ్యాన్ని కాపాడవచ్చు.. ఒక్కోసారి ఒక ప్రాణాన్ని కూడా కాపాడవచ్చు.

వేడుకలు మన సంస్కృతికి ప్రతిబింబం. కాబట్టి మన వేడుకల స్థాయి డీజే శబ్దంతో కాదు.. మన సంస్కారం, సంయమనం, సామాజిక బాధ్యతతో కొలవాలి. శబ్దం పెంచడం గొప్పతనం కాదు.. బాధ్యత పెంచుకోవడమే నిజమైన గొప్పతనం. డీజే మోత కంటే మనిషి ప్రాణం విలువైనది.. క్షణిక ఆనందం కంటే జీవితం ముఖ్యం!

శబ్దాన్ని అదుపులో పెట్టండి.. ప్రమాదాన్ని దూరం పెట్టండి..

వేడుకను ఆనందంగా జరుపుకోండి.. విషాదంగా మార్చుకోకండి.

ప్రాణాలను పణంగా పెట్టే వినోదం మనకు అవసరం లేదు.

ఆనందం ఉండాలి.. ఆర్భాటం ఉండొచ్చు.. కానీ మితిమీరిన మోత మాత్రం వద్దు!

వినోదం మితిమీరితే.. ప్రమాదమే!* డీజే అంటే కేవలం సంగీతం కాదు.. శబ్దాన్ని ఎంత ఎక్కువగా పెంచితే అంత గొప్ప వేడుక అన్న అపోహ కూడా పెరుగుతోంది. శబ్దం పెరిగిన కొద్దీ ఉత్సాహం పెరగాల్సింది పోయి, ప్రమాదం పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు అధిక శబ్దం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది. అధిక శబ్దానికి ఎక్కువ సేపు గురికావడం వల్ల వినికిడి శక్తిపై ప్రభావం పడవచ్చు. పునరావృతంగా తీవ్రమైన శబ్దానికి గురైతే శాశ్వత వినికిడి లోపం కూడా సంభవించే ప్రమాదం ఉంది. అంతేకాదు.. నిద్రాభంగం, మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలకూ శబ్ద కాలుష్యం కారణమవుతుంది.



మేకిరి దామోదర్
9573666650.



# జాతీయం - అంతర్జాతీయం





## సిఇసిపై క్రిమినల్ విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25(ఎ.ఎం.ఎస్) :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి చట్టబద్ధమైన విధులను ఉల్లంఘించారనే ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై క్రిమినల్ విచారణ జరపాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద న్యాయవాది శైలేంద్ర మని త్రిపాఠి శుక్రవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే జ్ఞానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్‌వేర్ మార్పులు రాజ్యాంగ విరుద్ధమని, చెల్లవని ప్రకటించాలని పిటిషన్ కోరింది. ఎస్ఐఆర్‌పై, ఫార్మ్ 6, ఓటర్ల జాబితా డేటా నిర్వహణపై ఎన్నికల ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సందర్భాల్లో అభ్యంతరం వ్యక్తం చేశారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వెల్లడించిన సంగతి తెలిసిందే. తమకు తెలియకుండా లేదా తమ సిఫారసులకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారన్న నిర్ణయాలకు సంబంధించినవే ఈ అభ్యంతరాలని నివేదిక తెలిపింది. అధికారిక విధులను విస్మరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్ కుమార్, సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీష్ గార్గ్, డైరెక్టర్ జనరల్ (ఐటీ) సీమా ఖన్నా, ఇతర బాధ్యులైన అధికారులపై 'ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950'లోని సెక్షన్ 32 కింద ఫిర్యాదులు నమోదు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఫారం 6ను అనధికారికంగా సవరించడం, ఓటర్ల జాబితా డేటాబేస్‌లను కేంద్రీకరించడం, ఇసిఐనెట్ వ్యవస్థ ద్వారా అర్హులైన ఓటర్లను పునరుద్ధరించడంలో విఫలమవడం, మరియు ఇసిఐ పేరుతో ఓటర్లను చేర్చడాన్ని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్‌లో 16.10 లక్షల అప్పీళ్లను దాఖలు చేయడం వంటివి ఫిర్యాదు చేయబడిన చర్యలలో ఉన్నాయని పిటిషనర్ ఆరోపిస్తున్నారు.పూర్తి కమిషన్ ఆమోదం లేకుండా లేదా ఎన్నికల కమిషనర్ల మెజారిటీ అభిప్రాయానికి విరుద్ధంగా జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన, ఆమోదించిన లేదా అమలు చేసిన అన్ని నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు మరియు సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, అధికార పరిధిని అతిక్రమించినవిగా, ప్రారంభం నుండే చెల్లనివిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు.

## జిన్‌పింగ్ కు ట్రంప్ దంపతుల ప్రత్యేక విందు

- **అమెరికన్-చైనీస్ రుచుల కలయిక**

**అమెరికా :**

అమెరికా పర్యటనకు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు ప్రత్యేక అధికారిక విందును ఇచ్చారు. శ్వేత సౌధంలోని ఈస్ట్ రూమ్‌లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. జిన్‌పింగ్ కోసం అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో ప్రత్యేక మెనూను సిద్ధం చేశారు.ఈ విందుకు సంబంధించిన మెనూను వైట్ హౌస్ విడుదల చేసింది. విందులో ప్రధాన వంటకాలుగా నువ్వులతో తయారు చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్, పసుపు గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో తయారు చేసిన ఫ్రికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్‌ప్లాండ్ వంటకాలను అందించారు. బాక్ చోయ్ అనేది చైనీస్ క్యాబేజీకి చెందిన ఒక రకం. డెజర్ట్‌లలోనూ ప్రత్యేకత కనిపించింది. వెనీలా క్రిమెక్స్, వైట్ హౌస్ హనీ క్రీమ్, వాల్‌నట్ ఫ్రాంగిపేన్, చెర్రీ కాన్ఫిట్ వంటి తీపి వంటకాలను అతిథులకు వడ్డించారు. ఇలా రెండు దేశాల వంటకాల ప్రత్యేకతలను కలిపి జిన్‌పింగ్ కోసం ఈ మెనూను రూపొందించారు.



**జిన్‌పింగ్‌కు అరుదైన కానుక ...**

విందు సందర్భంగా ట్రంప్ .. జిన్‌పింగ్‌కు ప్రత్యేక బహుమతిని అందించారు. అమెరికా జాతీయ పక్షి అయిన బాల్డ్ ఈగల్ విగ్రహాన్ని కానుకగా ఇచ్చారు. సుమారు మూడు అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని విందు సమయంలో అతిథుల సమక్షంలో ప్రదర్శించారు. బాల్డ్ ఈగల్ విగ్రహం స్వేచ్ఛ, స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ విగ్రహం చైనాలోనూ ప్రత్యేక గుర్తింపును పొందుతుందని ఆయన ఆకాంక్షించారు.

**విందు తర్వాత మరో ప్రత్యేకత ....**

విందు అనంతరం ట్రంప్.. శ్వేతసౌధంలో నూతనంగా నిర్మిస్తున్న బాల్‌రూమ్‌ను జిన్‌పింగ్‌కు చూపించారు. ఈ సందర్భంగా ''ఈ గదిలోకి వచ్చిన తొలి విదేశీ నేత మీరే'' అని ట్రంప్ జిన్‌పింగ్‌తో అన్నారు. దీంతో ఈ పర్యటనలోని అధికారిక కార్యక్రమాల్లో బాల్‌రూమ్ సందర్శన కూడా ప్రత్యేకంగా నిలిచింది.

**హాజరైన టెక్ దిగ్గజాలు ....**

జిన్‌పింగ్ గౌరవార్థం నిర్వహించిన ఈ విందుకు అమెరికా టెక్నాలజీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్, ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్, ఓపెన్ఏఐకి చెందిన శామ్ ఆల్ట్‌మన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తంగా జిన్‌పింగ్ అమెరికా పర్యటన సందర్భంగా శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విందు.. రెండు దేశాల వంటకాల కలయిక, అరుదైన బహుమతి, ప్రముఖ టెక్ దిగ్గజాల హాజరుతో ప్రత్యేకంగా నిలిచింది.




## నెతన్యాహూకు వ్యతిరేకంగా హాలీవుడ్ స్టార్స్ నిరసన..

**న్యూయార్క్ :**

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూకు వ్యతిరేకంగా న్యూయార్క్‌లో గురువారం హాలీవుడ్ స్టార్స్ సహా పలువురు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనను అడ్డుకున్న పోలీసులు హాలీవుడ్ నటి సుసాన్ సరండన్, 'హాక్స్' నటి హన్నా ఐన్‌బైండర్ సహా సుమారు 100 మందిని అదుపులోకి తీసుకున్నట్లు న్యూయార్క్ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎన్‌వైపిడి) ప్రతినిధి తెలిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నెతన్యాహు ప్రసంగించనున్న నేపథ్యంలో 'జ్యూయిష్ వాయిస్ ఫర్ పీస్' ఆధ్వర్యంలో ఐరాస ప్రధాన కార్యాలయం వెలుపల ఈ నిరసన జరిగింది. 'ఇజ్రాయెల్‌కు ఆయుధాలు ఇవ్వడం ఆపండి', 'జాతి నిర్మూలనను అంతం చేయండి' అంటూ నిరసనకారులు బ్యానర్లు ప్రదర్శించారు. నిరసనకారులు ప్రధాన కూడలిని దిగ్బంధించారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధానికి అమెరికా అందిస్తున్న సైనిక సహాయాన్ని నిలిపివేయాలని, యుద్ధాన్ని ముగించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. నిరసనను అడ్డుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారి సంఖ్యను పోలీసులు వెల్లడించలేదు. అయితే 100 మందికి పైగా అరెస్టయ్యారని 'జ్యూయిష్ వాయిస్ ఫర్ పీస్' సోషల్ మీడియాలో పేర్కొంది. అరెస్టయిన సుసాన్ సరండన్ గతంలోనూ గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్నారు. తన రాజకీయ అభిప్రాయాల కారణంగా హాలీవుడ్‌లో కొన్ని సినిమా అవకాశాలను కోల్పోయినట్లు ఆమె ఇటీవల వెనిస్ చలనచిత్రోత్సవంలో వెల్లడించారు. ఐరాససర్వసభ్య సమావేశంలోనూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూకి నిరసన ఎదురైంది. సమావేశంలో నెతన్యాహు ప్రసంగం ప్రారంభించగానే పలువురు దేశాల ప్రతినిధులు వాకౌట్ చేశారు.

## దళిత్, ఆదివాసీ రిజర్వేషన్లు కొనసాగించాలి

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎస్ఎఫ్ఐ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఎ.ఎం.ఎస్) :**

ఉత్తరప్రదేశ్‌లోని స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ (ఎస్పీపీ) కింద నాలుగు మెడికల్ కళాశాలల్లో దళిత్, ఆదివాసీ విద్యార్థులకు ప్రస్తుతం అమలవుతున్న 70 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది.'ఎస్పీపీ బచావో అభియాన్' అనే సంస్థతో కలిసి అలహాబాద్ హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులపై ఎస్ఎఫ్ఐ చట్టపోరాటానికి దిగింది. దళిత, ఆదివాసీ విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అంబేద్కర్ నగర్, కనౌజ్, జలౌన్, సహారన్‌పూర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో ఈ రిజర్వేషన్లను పరిరక్షించడమే తమ ప్రధాన ధ్యేయమని ఎస్ఎఫ్ఐ తెలిపింది.హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులు దళిత, ఆదివాసీ విద్యార్థుల విద్యా హక్కులను కాలరాసేలా ఉన్నాయని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తాము చివరి వరకు పోరాడతామని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సజి, ప్రధాన కార్యదర్శి సృజన్ భట్టాచార్య స్పష్టం చేశారు.







## బ్రిజ్ భూషణ్ నిర్దోషిగా విడుదలచేయడాన్ని సవాలు చేసిన మహిళా రెజ్లర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఎ.ఎం.ఎస్) :**

లైంగిక వేధింపుల కేసులో డబ్ల్యుఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను నిర్దోషిగా విడుదల చేయడాన్ని మహిళా రెజ్లర్లు రౌస్ అవెన్యూ కోర్టులో సవాలు చేశారు. ఈ అప్పీల్‌పై ప్రత్యేక జడ్జి (ఎంపిఎమ్మెల్యే కేసులు ) దిగ్ వినయ్ సింగ్ శనివారం విచారణ చేపట్టనున్నారు. బ్రిజ్‌భూషణ్, డబ్ల్యుఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌లను నిర్దోషులుగా విడుదల చేస్తూ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశ్విని పన్వార్ ఆగస్టు 3న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. రహస్య విచారణల అనంతరం ఈ తీర్పు వెలువడింది. ఈ తీర్పు చట్టబద్ధంగా నిలవదని, రికార్డులో ఉన్న సాక్ష్యాలను తప్పుగా, పక్షపాతంగా అంచనా వేశారని పేర్కొంటూ మహిళా రెజ్లర్లు తీర్పును సవాలు చేశారు.సంబంధిత కోర్టు తీర్పు ఊహాగానాలు, అనుమానాలపై ఆధారపడి ఉందని, చట్టపరంగా స్థిరపడిన న్యాయ సూత్రాలను సరిగ్గా వర్తింపజేయలేదని అప్పీల్‌లో వాదించారు. తీర్పులోని కీలక అంశాలు లైంగిక దాడి, వేధింపులకు గురైన బాధితులు ఎలా ప్రవర్తించాలనే విషయంలో పాతకాలపు, మూస ధోరణులతో కూడిన అంచనాలపై ఆధారపడి ఉన్నాయని అప్పీలుదారులు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల పరిస్థితులు, ఘటనల నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని సాక్ష్యాలను పరిశీలించాల్సి ఉండగా, బాధితుల 'ఆశించిన ప్రవర్తన' ఆధారంగా వాటిని అంచనా వేశారని ఆరోపించారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా బ్రిజ్‌భూషణ్ ఉన్న సమయంలో మహిళా రెజ్లర్లు ఆయనపై చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ కేసు కొనసాగుతోంది.బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ 2023లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ రెజ్లర్లు నిరసన చేపట్టారు. అనంతరం ఈ ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు 2023 జూన్‌లో బ్రిజ్‌భూషణ్, తోమర్‌లపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. బిఎన్ఎస్‌లోని సెక్షన్లు 354, 354ఎ, 354డి, 506తో సహా పలు నిబంధనల కింద కేసు నమోదు చేశారు. ఐదుగురు ఫిర్యాదుదారులు చేసిన ఆరోపణలకు సంబంధించి రౌస్ అవెన్యూ కోర్టు 2024 మేలో బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు మోపగా, మరో మహిళా రెజ్లర్ ఫిర్యాదుకు సంబంధించి అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. ఒక ఫిర్యాదుదారునికి సంబంధించి తోమర్‌పై నేరపూరిత బెదిరింపుల అభియోగాలు మోపబడ్డాయి. ప్రాసిక్యూషన్, ఫిర్యాదుదారులు, నిందితుల వాదనలు విన్న కోర్టు ఆగస్టు 3న బ్రిజ్ భూషణ్, తోమర్‌లను నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ తీర్పును సవాలు చేసిన అప్పీల్ శనివారం సెషన్స్ కోర్టు ఎదుట పరిశీలనకు రానుంది.

# మానవ నియంత్రణలోనే 'ఎఐ'

**వాషింగ్టన్:**

ప్రపంచ శ్రేయస్సు కోసం కృతిమమేధ (ఎఐ) అభివృద్ధి మానవ నియంత్రణలోనే ఉండాలని చైనా అధ్యక్షులు జిన్ పింగ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన బుధవారం మధ్యాహ్నం జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు చేరుకున్నారు. జిన్‌పింగ్‌కు, ఆయన సతీమణి పెంగ్ లియువాన్‌కు విమానాశ్రయంలో ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ స్వయంగా అరుదైన రీతిలో స్వాగతం పలికారు. అమెరికన్ చిన్నారులు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేయగా, 21 తుపాకుల వందనం, ఇరు దేశాల జాతీయ గీతాల ఆలాపన, సైనిక విమానాల ప్రదర్శనతో స్వాగత కార్యక్రమం ఘనంగా సాగింది.

**శ్వేతసౌధంలో లాంఛనప్రాయ స్వాగతం**

గురువారం శ్వేతసౌధం సౌత్ పోర్టికోలో సైనిక బృంద వాద్యాల నడుమ ట్రంప్, మెలానియా దంపతులు జిన్‌పింగ్, పెంగ్‌లకు లాంఛనప్రాయంగా స్వాగతం పలికారు. అమెరికా అధ్యక్షుడు వినియోగించే 'బీస్ట్'కు సమానమైన నల్లరంగు హాంగ్‌కీ (రెడ్ ఫ్లాగ్) ఎన్701 ఎస్‌యువిలో జిన్‌పింగ్ శ్వేతసౌధానికి చేరుకున్నారు. ఇరు జంటలు రెడ్ కార్పెట్ పై కొద్దిసేపు కలిసి నిలబడిన అనంతరం లోపలికి వెళ్లారు. ఈ భేటీ, శ్వేత సౌధంలో జరిగిన లాంఛనాలను అమెరికాలోని ప్రధాన టివి చానెళ్లు ఏవీ ప్రత్యక్ష ప్రసారం చేయకపోవడం గమనార్హం.

**జిన్‌పింగ్‌తో కలిసి పనిచేస్తూనే ఉంటాను : ట్రంప్**

తన ప్రారంభోపన్యాసంలో ట్రంప్ మాట్లాడుతూ, రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా పాత్రను గుర్తుచేస్తూ, ''ఆ యుద్ధంలో విజయం సాధించేందుకు మన ప్రజలు కలిసి పని చేసినట్టుగానే, ఇరు దేశాల ఉజ్వల భవిష్యత్తు కోసం అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పనిచేస్తూనే ఉంటాను'' అని పేర్కొన్నారు. 2016లో తాను తొలిసారి అధ్యక్షుడిగా గెలిచినప్పటి నుంచి జిన్‌పింగ్‌తో పరస్పర గౌరవం, ప్రజల ప్రయోజనాల ప్రాతిపదికన ''నిజమైన గొప్ప స్నేహాన్ని'' పెంపొందించుకున్నట్టు ట్రంప్ చెప్పారు.

**'థ్యూసిడైడిస్ ట్రాప్'ను నివారించాలి: జిన్‌పింగ్**

శ్వేతసౌధంలోని గ్రాండ్ ఫోయర్‌లో జరిగిన లాంఛన కార్యక్రమంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ, స్నేహాన్ని కొనసాగించేందుకు, సహకారాన్ని విస్తరించేందుకు, ఇరు దేశాల ప్రజల శ్రేయస్సును పెంపొందించేందుకు ట్రంప్ ఆహ్వానం మేరకు తాను అమెరికా వచ్చినట్టు తెలిపారు. చైనా, అమెరికాలు రెండు ప్రధాన దేశాలుగా సహకారం వల్ల ప్రయోజనం పొందుతాయని, ఘర్షణ వల్ల రెండూ నష్టపోతాయని పలుమార్లు తాను చెప్పినట్టు ఆయన గుర్తుచేశారు. అభివృద్ధి చెందుతున్న శక్తికి, స్థిరపడిన శక్తికి మధ్య యుద్ధం అనివార్యమనే సిద్ధాంతమైన 'థ్యూసిడైడిస్ ట్రాప్'ను ఇరు దేశాలు నివారించాలని ఆయన సూచించారు. ''పోటీ అనే మాటను మనం విస్మరించాల్సిన అవసరం లేదు, కానీ మన పోటీ ఆరోగ్యకరంగా, పరిమితుల్లోనే ఉండాలి. అది ఒకరినొకరు అధిగమించే పరుగు పందెంలా ఉండాలే తప్ప, ఒకరు గెలిస్తే మరొకరు ఓడిపోయే మల్లయుద్ధంలా ఉండకూడదు'' అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, అమెరికాల మధ్య ఘర్షణ, తలపడే పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాలని, ఈ గ్రహంపై రెండు గొప్ప దేశాలుగా కలిసి మెలిగే సరైన మార్గాన్ని ఖచ్చితంగా కనుగొనగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సంక్షోభ సమయాల్లో సంభాషణ, నివారణ యంత్రాంగాలను మెరుగుపరచుకుంటూ ఇరు దేశాల సైన్యాలు క్రమం తప్పకుండా చర్చలు జరపాలని, ''థ్యూసిడైడిస్ ట్రాప్'ను అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.కృత్రిమ మేధ (ఎఐ) అంశాన్ని కూడా జిన్‌పింగ్ తన ప్రారంభోపన్యాసంలో ప్రస్తావించారు. ఎఐని మనుషులే ఎల్లప్పుడూ నియంత్రించేలా చూడాల్సిన బాధ్యత ఇరు దేశాలపై ఉందని పేర్కొంటూ, ''ఎఐ అభివృద్ధి, నిర్వహణను మంచి కోసం వినియోగించే సామర్థ్యం, బాధ్యత రెండూ మన కున్నాయి. ఎఐ అభివృద్ధి ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండేలా, ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడేలా చూసుకోవాలి'' అని ఆయన స్పష్టం చేశారు.

అట్లాంటాకు రెండు పాండాలు, లక్ష మంది అమెరికన్ విద్యార్థులకు ఆహ్వానం కొద్ది రోజుల్లో అట్లాంటాలోని జూలో ఒక జత పాండాలు కొత్త నివాసం ఏర్పరచుకోనున్నాయని జిన్‌పింగ్ తెలిపారు. వచ్చే ఐదేళ్లలో మార్పిడి కార్యక్రమాలు, అధ్యయనం నిమిత్తం లక్ష మంది అమెరికన్ యువతను చైనాకు ఆహ్వానించేందుకు బీజింగ్ యోచిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను పెంచాలని కూడా జిన్‌పింగ్ శ్వేతసౌధంలో పిలుపునిచ్చారు. శ్వేతసౌధంలో లాంఛనప్రాయ స్వాగతం అనంతరం ఇరువురు నేతలు ఓవల్ ఆఫీసులో చర్చలు జరిపి, సాయంత్రం భారీ రాజకీయ విందుకు హాజరు కానున్నారు.

వాణిజ్య యుద్ధ విరమణ పొడిగింపు

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జరిగిన కీలక పరిణామంలో, వాణిజ్య యుద్ధ విరమణను జనవరి వరకూ పొడిగించనున్నట్టు అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. చైనా ఉప ప్రధాని హీ లిఫెంగ్‌తో భేటీ అనంతరం మాట్లాడుతూ, నవంబర్ 10తో ముగియాల్సిన 'బుసాన్ ఒప్పందా'న్ని పొడిగించేందుకు, పరస్పరం సుంకాలను తగ్గించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్టు ఆయన తెలిపారు. అధిక సుంకాల పరిస్థితి తిరిగి రాకుండా చూసుకునేందుకు ఈ పొడిగింపు ఇరు దేశాలకూ ప్రయోజనకరమే అయినప్పటికీ, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను మరిన్ని కొనుగోలు చేస్తామని, అరుదైన ఖనిజాలను ఎక్కువగా విక్రయిస్తామని ఇచ్చిన హామీలను చైనా విస్మరించినట్టు తెలుస్తోంది. తైవాన్‌కు అమెరికా చేస్తున్న ఆయుధాల విక్రయాన్ని మరింత వాయిదా వేయాలని జిన్‌పింగ్ ట్రంప్‌ను కోరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



**అగ్రస్థానంలో కృత్రిమ మేధ (ఎఐ)**

ఈ శిఖరాగ్ర భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చే అంశం ఎఐ కానుంది. ఈ సాంకేతికత వల్ల కలిగే ప్రమాదాలపై పరిశ్రమ వర్గాల నుంచి హెచ్చరికలు వెలువడుతున్నప్పటికీ, అభివృద్ధిని నెమ్మదింపజేసేందుకు కొత్త నిబంధనలపై ఇరు దేశాలు అంగీకారానికి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నారు. అయితే, సాంకేతికత అదుపు తప్పితే ఒకరినొకరు హెచ్చరించుకునేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడంపై నేతలు అంగీకరించే అవకాశం ఉంది. జిన్‌పింగ్‌తో భేటీకి ముందు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ పోస్ట్ చేస్తూ, ''సూపర్ ఇంటెలిజెన్స్ (ఎస్ఐ)'' చర్చకు వస్తుందని, అయితే దాన్ని ప్రస్తుత స్థితిలోనే ఉంచాలని తాను, చైనా ఇరువురూ భావిస్తున్నామని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ఇటీవల మాట్లాడుతూ, 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'ను 'సూపర్ ఇంటెలిజెన్స్'గా పునర్నామకరణం చేయాలని ట్రంప్ అభిప్రాయపడగా, కొత్త నిబంధనలను తాను గట్టిగా వ్యతిరేకిస్తున్నట్టు కూడా సంకేతాలిచ్చారు. మరోవైపు, ''ముప్పు కథనాలు'' ప్రపంచ ఎఐ పాలనకు ఆటంకం కలిగిస్తాయని చైనా విదేశాంగ శాఖ హెచ్చరించింది.

టెక్ దిగ్గజాలతో విందు

గురువారం నిర్వహించే ప్రత్యేక విందులో మైక్రోసాఫ్ట్‌కు చెందిన సత్య నాదెళ్ల, యాపిల్‌కు చెందిన టిమ్ కుక్, ఓపెన్ఏఐకి చెందిన సామ్ ఆల్ట్‌మన్, ఎన్విడియాకు చెందిన జెన్సన్ హువాంగ్‌లతోపాటు, అమెజాన్ చైర్మన్ జెఫ్ బెజోస్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, గూగుల్ అధిపతి సుందర్ పిచాయ్ తదితరులు ట్రంప్, జిన్‌పింగ్‌లతో కలిసి పాల్గొననున్నట్టు శ్వేతసౌధం అధికారులు తెలిపారు.

ట్రంప్, జిన్‌పింగ్ మధ్య సంబంధాలు కుదురుకున్నట్టు కనిపిస్తున్నా, వ్యక్తిగత శైలిలో వీరిద్దరూ పూర్తి భిన్నం. బీజింగ్‌లో గత మేలో జరిగిన భేటీలో ''మీరు గొప్ప నాయకుడు'' అంటూ జిన్‌పింగ్‌ను ట్రంప్ ప్రశంసించగా, జిన్‌పింగ్ మాత్రం ఎప్పుడూ ఆచితూచి వ్యవహరిస్తారు. ట్రంప్ ప్రశంసలకు ఆయన స్పందించరు. బదులుగా ఇరు దేశాల మధ్య ఈ భేటీల ప్రాముఖ్యతపైనే దృష్టి సారిస్తారు. మీడియా ముందు యథేచ్ఛగా మాట్లాడే ట్రంప్ శైలికి భిన్నంగా, జిన్‌పింగ్ తన పర్యటనలోని ప్రతి అంశం జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా సాగాలని కోరుకుంటారని పలువురు విశ్లేషిస్తున్నారు.

## జెన్‌జీ ఓట్ల భయం: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సైలెంట్‌గా నిలిపివేత !




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 (ఎ.ఎం.ఎస్) :**

దేశంలో నవతరం (జెన్‌జీ) ఓటర్లను నమోదు చేసే వార్షిక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిలిపివేసింది. చట్ట ప్రకారం ప్రతి ఏటా చేపట్టాల్సిన 'స్పెషల్ సమ్మరీ రివిజన్' (SSR) ప్రక్రియ దాదాపు మూడేళ్లుగా నిలిచిపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై జెన్‌జీ యువతలో వ్యక్తమవుతున్న ఆగ్రహం, మతపరమైన రాజకీయాలపై పెరిగిన విముఖత అధికార వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త తరం ఓటర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచే వ్యూహంలో భాగమే ఈ నిలిపివేత అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజాప్రాతినిధ్య చట్టం (1950) సెక్షన్ 21 ప్రకారం ప్రతి ఏటా కొత్త ఓటర్లను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత. అయితే, 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (SIR) జరుగుతోందనే సాకుతో ఈ స్పెషల్ సమ్మరీ రివిజన్ (SSR)ను అడ్డుకుంటున్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల తర్వాత కేంద్ర ప్రభుత్వ లోపాలు బహిర్గతం కావడంతో యువత రాజకీయంగా మరింత చైతన్యవంతమైంది. ఈ నేపథ్యంలోనే వారి ఓటు హక్కును అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.సాధారణంగా ప్రతి ఏటా మేజూన్ నెలల్లో నోటిఫికేషన్ విడుదల చేసి నిర్వహించే SSR ప్రక్రియ 2024 నుంచి ఆగిపోయింది.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్తున్నప్పటికీ, సాంకేతిక అడ్డంకులు, ఫారమ్6 ప్రక్రియలో సమస్యల వల్ల స్వయంగా ఓటు నమోదు చేసుకునేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.ఈ విషయమై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పదేపదే హెచ్చరించినప్పటికీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (CEC) మౌనం వహించారని తెలుస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిల మధ్య ఈ విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఏళ్లు గడుస్తున్నా లభించని న్యాయసలహా : సంధూ, జోషిలు వెంటనే SSR ప్రక్రియను పునఃప్రారంభించాలని గట్టిగా డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ రాజకీయాలకు అతీతంగా ఓటర్ల జాబితాలో చేర్చడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని వారు హెచ్చరించారు. SIR జరుగుతున్నంత మాత్రాన SSR నిలిపివేయడం సరికాదని స్పష్టం చేశారు.అయితే, కొన్ని రాష్ట్రాల్లో 'SIR' జరుసాధారణంగా ప్రతి ఏటా మేజూన్ నెలల్లో నోటిఫికేషన్ విడుదల చేసి నిర్వహించే .ఈ విషయమై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పదేపదే హెచ్చరించినప్పటికీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (CEC) మౌనం వహించారని తెలుస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిల మధ్య ఈ విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఏళ్లు గడుస్తున్నా లభించని న్యాయసలహా : సంధూ, జోషిలు వెంటనే SSR ప్రక్రియను పునఃప్రారంభించాలని గట్టిగా డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ రాజకీయాలకు అతీతంగా ఓటర్ల జాబితాలో చేర్చడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని వారు హెచ్చరించారు. SIR జరుగుతున్నంత మాత్రాన SSR నిలిపివేయడం సరికాదని స్పష్టం చేశారు.అయితే, కొన్ని రాష్ట్రాల్లో 'SIR' జరుగుతున్నందున, మళ్లీ కొత్త ఓటర్ల నమోదు అవసరమా అనే ప్రశ్నను లేవనెత్తుతూ ఈ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. దీనిపై న్యాయసలహా తీసుకుంటున్నామని చెప్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఎన్నికల వేళ ఓట్ల కోత వ్యూహం? :

2024లో చివరిసారిగా దేశవ్యాప్తంగా SSR జరిగింది.

2025లో బిహార్‌లో ప్రారంభమైన SIR ప్రక్రియను ఇతర రాష్ట్రాలకూ విస్తరించారు. రాబోయే కాలంలో ఉత్తర ప్రదేశ్, గోవా వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, SSR ద్వారా కొత్త ఓట్లు రాకుండా చూడటం, SIR నెపంతో తమకు వ్యతిరేకంగా పడే ఓట్లను తొలగించడం లాంటి వ్యూహాత్మక చర్యలు జరుగుతున్నాయని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలసి అభివృద్ధి ప్రతిపాదనలు అందజేసిన ఎంపీ కావ్య

**వరంగల్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతులు త్వరగా వచ్చేలా చొరవ చూపాలని కోరుతూ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ: వర్సిటీలో పరిశోధనలు, మౌలిక వసతుల కల్పనకు గాను 'పీఎంఉషా' పథకం కింద కేటాయించిన నిధులను త్వరగా విడుదల చేయించేలా కేంద్రాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు. పురావస్తు మ్యూజియం (రూ. 10 కోట్లు) వరంగల్ కోటలో కొత్తగా నిర్మించిన మ్యూజియంలో పరిరక్షణ, ప్రదర్శన, భద్రతా వసతుల కోసం కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని కోరారు.నైలిట్ కేంద్రం ఉమ్మడి జిల్లా యువతకు AI, సైబర్ సెక్యూరిటీ, IoT వంటి నూతన సాంకేతిక రంగాలు, ఐటీ ఆధారిత శిక్షణ ఇచ్చేందుకు వరంగల్‌లో 'నైలిట్' కేంద్రాన్ని మంజూరు చేయించాలని అభ్యర్థించారు. సీఐటీడీ కేంద్రం ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు స్థానిక MSME పరిశ్రమలకు సాంకేతిక సహకారం, 3D ప్రింటింగ్, రోబోటిక్స్ వంటి అంశాల్లో శిక్షణ కోసం సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ప్రస్తుతం ఉన్న POPSK స్థానంలో, తత్కాల్ సేవలతో కూడిన పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని కోరారు.



ఎంపీ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనలపై సంబంధిత శాఖలతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గిరిజన గురుకులాల్లో పార్ట్ టైం ఫ్యాకల్టీ నియామకాలు

**అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం**
**26 నుంచి 28 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**ఐటీడీఏ పీఓ బి.రాహుల్**

**భద్రాచలం 25 సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి):**



202627 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు పార్ట్ టైం ఫ్యాకల్టీగా బోధన సిబ్బందిని నియమించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. ఈ మేరకు అర్హత కలిగిన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధనా ప్రక్రియ మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన బోధన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. పార్ట్ టైం ఫ్యాకల్టీగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలను కలిగి ఉండాలని, నిర్దేశించిన అర్హతలు ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోధన సిబ్బంది నియామకం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండటంతో పాటు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈడీ పూర్తి చేసి ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్హతలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకుని, వాటి నకళ్లను దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సంబంధించిన ఖాళీలను ఈ నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఖాళీల వివరాలను వెల్లడిస్తూ మహిళల విభాగంలో జూనియర్ లెక్చరర్ తెలుగు సబ్జెక్టులో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా జనరల్ విభాగంలో జూనియర్ లెక్చరర్ తెలుగు ఒక పోస్టు, గణితం రెండు పోస్టులు, ఫిజిక్స్ ఒక పోస్టు, పీజీటీ గణితం ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. మహిళల విభాగంలో ఒక పోస్టు, జనరల్ విభాగంలో ఐదు పోస్టులు కలిపి మొత్తం ఆరు పోస్టులను ప్రస్తుతానికి భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 26092026 ఉదయం 10.00 గంటలకు ప్రారంభమై 28092026 సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందని తెలిపారు. నిర్ణీత తేదీల్లో కార్యాలయ పని దినాలలో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏ, భద్రాచలంలో నేరుగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే సమయంలో తమ విద్యార్హతలకు సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, అవసరమైన పత్రాలు పూర్తిగా జతచేసి సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా విద్యార్హతల్లో సాధించిన మార్కులు మరియు డెమో ఆధారంగా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు వెల్లడించారు.కేవలం దరఖాస్తు సమర్పించినంత మాత్రాన నియామకం లభించినట్లుగా భావించరాదని, అధికారులు సూచించిన ఎంపిక ప్రక్రియకు హాజరై అర్హత సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్న ఈ నియామక ప్రక్రియలో సంబంధిత నిబంధనలు, అర్హతలు మరియు ఎంపిక విధానాన్ని అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. నియామక ప్రక్రియకు సంబంధించి మరిన్ని వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై సందేహాలు ఉన్న అభ్యర్థులు 8500136628 చరవాణి నంబరును సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు. ముఖ్యంగా మహిళా విద్యాలయానికి సంబంధించిన ఖాళీకి మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో బోధనా రంగంలో పనిచేయాలనుకునే అర్హులైన గిరిజన అభ్యర్థులకు ఈ నియామక ప్రక్రియ ద్వారా అవకాశం లభించనుందని అధికారులు తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చివరి తేదీ వరకు వేచి ఉండకుండా నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో తమ దరఖాస్తులను సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కోరారు. గురుకుల విద్యాలయాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయగల అర్హులైన బోధనా సిబ్బందిని ఎంపిక చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నందున ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలను తెలుసుకుని, నిబంధనల ప్రకారం దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

# తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి : మంత్రి సీతక్క

**హనుమకొండ, సెప్టెంబర్ 25 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులందరూ పకడ్బందీ ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అధికారులతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎల్ నినో సన్నద్ధత, వీబీజీ రాంజీ, హ్యామ్ రోడ్ల నిర్మాణంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...తాగునీరు, భూగర్భ జలాలు, వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పంట కుంటలు,ఊట కుంటలు, చెక్ డ్యామ్‌లు, బోర్ రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలి.రిజర్వాయర్లు, మోటార్లు, పైప్‌లైన్ల స్థితిగతులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సమస్యలు ఉంటే వెంటనే పునరుద్ధరించాలి. పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలు, గ్రామాల్లో స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అందేలా చూడాలి. హ్యామ్ రోడ్లు & గ్రామీణాభివృద్ధి: రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. ప్రతి ఆవాసం నుంచి మండలానికి మౌలిక వసతులను కల్పిస్తూ హ్యామ్ రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలి. ఉపాధి కల్పన ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ మాట్లాడుతూ...వీబీజీ రాంజీ పథకం ద్వారా కూలీలకు పనిదినాలు కల్పించాలని, సర్పంచుల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. మే చివరి ప్రతి 15 రోజులకు జాబితా సమీక్షించాలని తెలిపారు. సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావాలను తట్టుకునేలా వర్షపు నీటిని ఒడిసిపట్టి ముందస్తు ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, మిషన్ భగీరథ ENC కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ENC జగదీశ్వర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎంవో, సీనియర్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ, జిల్లా కలెక్టర్లు, కమిషనర్

**వరంగల్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి) :**



వరంగల్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రహదారులు, రోడ్లు, భవనాల శాఖ) వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొని ఆసుపత్రి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా సందర్శించారు. పనుల వేగం, నిర్మాణ నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలనార్థం వరంగల్‌కు విచ్చేసిన సీఎంవో ఉన్నతాధికారులకు జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖ తరఫున ఘన స్వాగతం లభించింది: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి, పర్యావరణ స్పృహను చాటుతూ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ ప్రాంగణంలో సీఎంవో ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.నిట్ (NIT) వరంగల్ వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న సీఎంవో ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, రోడ్లు భవనాల శాఖ ప్రతినిధులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం**
**రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క**

**జయశంకర్ భూపాలపల్లి: సెప్టెంబర్ 25(వుదయం జిల్లా ప్రతినిధి):**



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.శుక్రవారం భూపాలపల్లి మండలం, పెద్దాపూర్ రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలు, ఆదాయ ధ్రువీకరణ తదితర అవసరాలకు కీలకమైన అధికారిక పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు గౌరవం, స్వేచ్ఛతో పాటు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రానున్న 10 నుంచి 15 రోజుల్లో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపారాలు ప్రారంభించేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంఘాల ద్వారా రూ.లక్ష వరకు రుణం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విబిజి రాంజీ పథకం కింద గ్రామాల్లో సుమారు 370 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి సగటున రూ.50 లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నందున మేకల షెడ్లు, కోళ్ల ఫారాలు, ఫామ్ పాండ్లు, డ్రైనేజీలు, కాలువలు తదితర పనులను చేపట్టి గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలనుకునే సొంత స్థలంలో నిలబడి ఫొటోలు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల క్షేత్ర స్థాయి పరిశీలన సులభతరం అవుతుందని పేర్కొన్నారు.జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సురక్షితంగా నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,39,530 స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా 3,95,962 మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మండల పరిధిలోని పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, మూలపల్లి, లంబాడితండ, సుబ్బక్కపల్లి గ్రామాల్లో మొత్తం 1,993 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నకిలీ, డూప్లికేట్ కార్డులకు తావులేకుండా హోలోగ్రామ్, ఇష్యూయింగ్ అథారిటీ ముద్ర, హిడెన్ ఇమేజ్ తదితర తొమ్మిది రకాల భద్రతా ఫీచర్లను ప్రభుత్వం కార్డుల్లో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల విధానంతో రేషన్ పంపిణీలో లీకేజీలను అరికట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రావాల్సిన కోటా సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

**ములుగు/మల్లంపల్లి/వెంకటాపూర్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి) :**



పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిరోధించాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. శుక్రవారం ములుగు జిల్లాలోని మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి, స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మల్లంపల్లిలో 'స్వచ్ఛత హి సేవ': మల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి (IFS)తో కలిసి మంత్రి పాల్గొనడం జరిగింది. 'ఏక్ పేడ్ మా కే నామ్' కింద మొక్కలు నాటి, విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించి, వారికి పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడవులు, పచ్చదనం వల్లే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, ప్రకృతే మానవాళికి జీవనాధారమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ శ్రమదానంలో పాల్గొని ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు.

వెంకటాపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు: వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో రూ.1.80 కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీదేవిపేటలో రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనంతో పాటు, ఎస్సీ ఎస్‌డీఎఫ్, సీఆర్‌ఆర్ నిధులు రూ.90 లక్షలతో పూర్తి చేసిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలందరూ ఐక్యంగా ఉంటూ అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్ బాబు, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీపీవో వెంకయ్య, DRDO రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్, పాఠశాల నిబంధనలపై కఠిన ఆదేశాలు

**– జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి) :**



మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం, గూడూరు మండలం మట్టేవాడ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. చిన్న ముప్పారంలో కొనసాగుతున్న 'ఎస్ఐఆర్' (SIR) సవరణ, హియరింగ్స్, రీసర్వే ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటరు జాబితా మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు షెడ్యూల్ ప్రకారం జరుగుతోందని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల కమిషన్ సూచించిన 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించి మ్యాపింగ్ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. స్పందించని ఓటర్లను చైతన్యపరచాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో రీసర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు.అనంతరం మట్టేవాడలోని గిరిజన ఆశ్రమ (బాలుర) ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నాణ్యమైన ఆహారం అందించాలని, డైట్ మెనూను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు, వంట సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, 100% హాజరు నమోదయ్యేలా చూడాలని పేర్కొన్నారు. డిజిటల్ తరగతుల ద్వారా బోధన అందించాలని స్పష్టం చేస్తూ, వసతి, ఆహార సౌకర్యాలలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరామ్ నాయక్, తహసిల్దార్లు శ్రీనివాస్, నాగ భవాని తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదులో యూత్ కాంగ్రెస్ చురుగ్గా పాల్గొనాలి

**యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపు**

**సూర్యాపేట సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):**



ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర సహాయ ఇన్‌చార్జ్ భవ్యతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను యూత్ కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రారంభం నుంచి పోలింగ్ వరకు ప్రతి దశలో అప్రమత్తంగా ఉంటూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి ఓటును నమోదు చేయించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే పట్టభద్రులు గత పాలనను దృష్టిలో ఉంచుకుని తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి పట్టభద్రుడి వరకు యూత్ కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, ఎన్నికల వరకు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి యూత్ కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జ్ వెలిమినేటి సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, టీపీసీసీ సెక్రటరీ నవీన్ ఆచారి, శక్తి సూపర్ షీ కొత్త విద్య రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రావ్య రెడ్డి, కందుకూరి అంబేద్కర్, ని

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల నాణ్యతలో రాజీపడొద్దు సీఎంఓ ఉన్నతాధికారులు



**వరంగల్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను శుక్రవారం సీఎంఓ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ నేరుగా ప్రాంగణాన్ని సందర్శించి నిర్మాణ పురోగతిని సమీక్షించారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.....నాణ్యతా ప్రమాణాలు: ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచాలి. సమన్వయం: మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా, శాఖల మధ్య సరైన సమన్వయంతో పూర్తి చేయాలి. అత్యాధునిక వైద్యం: ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా సహా పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద (వరంగల్), చాహత్ బాజ్‌పాయ్ (హన్మకొండ) ఉన్నతాధికారులకు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి



**ప్రమాద ప్రాంతాల్లో తక్షణ, దీర్ఘకాలిక చర్య**
**జాయింట్ ఇన్‌స్పెక్షన్ సిఫార్సుల అమలుకు అధికారుల బాధ్యతలు నిర్దేశించాలి**
**రోడ్డు భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, వుదయం బ్యూరో సెప్టెంబర్- 25**

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్షించారు.

జిల్లాలోని వివిధ ప్రమాదకర, సున్నితమైన రహదారి ప్రాంతాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ సమీక్షించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతకు అవసరమైన సామగ్రి, పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఇతర జిల్లాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లను పరిశీలించి, అక్కడ వినియోగించిన సామగ్రి స్పెసిఫికేషన్లు, ప్రమాణాలను క్రాస్ చెక్ చేసి, అదే తరహా స్పెసిఫికేషన్లతో అవసరమైన సామగ్రికి ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించారు.

గత సమావేశంలో సూచించిన మేరకు ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి, తక్షణ, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర కన్సాలిడేటెడ్ నివేదికను సిద్ధం చేయాలని అన్నారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో చేసిన ప్రతి సిఫార్సుకు సంబంధిత అధికారుల బాధ్యతను నిర్దేశించి, ప్రతిపాదించిన చర్యలను రహదారులపై పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించి ఇంజినీరింగ్ చర్యల్లో భాగంగా రంబుల్ స్ట్రిప్స్, పాదచారుల క్రాసింగ్ మార్కింగ్, బ్లింకర్లు, సెంటర్, ఎడ్జ్ లైన్లు, రోడ్ స్టడ్స్, అవసరమైన హెచ్చరిక సూచిక బోర్డుల ఏర్పాటును పూర్తి చేయాలని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిరంతరం కొనసాగించాలని, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.

ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు అవసరమైన రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినందున రోడ్డు మార్కింగ్ పనులను కూడా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. శ్రీశ్రీ సర్కిల్ వద్ద క్రిస్‌క్రాస్‌గా జరుగుతున్న వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. రహదారులపై చేపట్టాల్సిన ప్రతి మార్పు, మెరుగుదల, భద్రతా చర్యలను ముందుగానే కాగితంపై స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ప్రాంతంలో ఏ పని ఎందుకు చేపట్టాలి, దానికి అవసరమైన చర్యలు ఏమిటి అనే వివరాలతో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి జాయింట్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన రహదారి వివరాలను, సమస్య ఉన్న ప్రాంతాల ఫొటోలను, గుర్తించిన లోపాలను, అవసరమైన సిఫార్సులను పొందుపరిచి సమగ్ర నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కేవలం సమస్యలను గుర్తించడం కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను కూడా నివేదికలో స్పష్టంగా సూచించాలని అన్నారు. ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద అవసరమైన రెండు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్లకు సంబంధించిన డిజైన్లను తుది రూపంలో సిద్ధం చేసి, పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో రహదారి భద్రతకు, వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్డు భద్రత కోసం కొనుగోలు చేసే అన్ని రకాల సామగ్రి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ నాణ్యత కలిగిన సామగ్రి వల్ల రోడ్డు భద్రతా చర్యల ఉద్దేశ్యం నెరవేరదని, కొనుగోలుకు ముందే నాణ్యత, స్పెసిఫికేషన్లను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు, ఇతర భద్రతా సమస్యలను పోలీసు శాఖ క్షేత్ర స్థాయిలో గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు, కార్యాచరణ ప్రణాళికను సంబంధిత శాఖలకు అందించాలని అన్నారు.

నిర్ణయించిన పార్కింగ్ ప్రాంతాలకు వెలుపల వాహనాలను నిలిపితే వాటిని తొలగించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఖమ్మం నగరంలోని షాపింగ్ మాల్స్, పెద్ద ఆసుపత్రులు, తదితర వాణిజ్య, ప్రజా వినియోగ సంస్థల్లో తగినంత పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు.రోడ్డుపై వాహనాలు నిలిపే పరిస్థితి ఏర్పడకుండా ఆయా సంస్థల యాజమాన్యాలతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో రోడ్‌సైడ్ పార్కింగ్ వల్ల అధిక సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సమస్య నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమైన రహదారుల పక్కన రోడ్‌సైడ్ పార్కింగ్ లేకుండా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలు నిలపకుండా అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి రామానుజమ్, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డా. రామారావు, జిల్లా రవాణాధికారి జగదీష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, డిఈఓ సదానందం, ఎన్హెచ్ఏఐ పిడి దివ్య, మునిసిపల్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**నిర్మల్ (వుదయం ప్రతినిధి) 25 సెప్టెంబర్ 2026**

## న్యూ వెల్మల్‌లో 80 శాతం సర్వే పూర్తి..

### మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలి: కలెక్టర్



భూముల రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులు, రైతులతో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో భూముల హద్దులు, హక్కులకు సంబంధించి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. న్యూ వెల్మల్ గ్రామంలో ఇప్పటికే 80 శాతం రీ సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు. రీ సర్వేకు రైతులు అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయ్యే వరకు అధికారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు చేపట్టిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సంతోష్, సర్పంచ్ సాగర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం,సంరక్షణ,హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి...జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)**

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా, జిల్లాలోని వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, వారిహక్కులకు సంబంధించిన పోస్టర్లు, "ఎల్డర్ గైడ్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వయోవృద్ధుల సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ సమన్వయంతో కృషి చేయాలని, వృద్ధులకు అవసరమైన సేవలు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అందరికీ చేరవేసేలా ఈ 'ఎల్డర్ గైడ్' ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయసూపరింటెండెంట్ రాజయ్య, పెద్దపల్లి టాస్క్ అధికారి కౌసల్య , ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్ జీవన్ రాజు, సుల్తానాబాద్ ఓల్డ్ ఏజ్ హోం అధ్యక్షులు సతీష్ ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.. కలెక్టర్



**ఆసిఫాబాద్,(వుదయం ప్రతినిధి)**

వానకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ పవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు, కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లపై వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార శాఖ, ఐ. కె. పి. సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ లో 23 వేల 900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్ 1 తేదీన జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, నీడ, వెలుతురు ఉండేలా, కొనుగోలు కేంద్రాలను ఎత్తైన చదును ప్రదేశాలలో, రహదారికి దగ్గరగా వాహనాలు వెళ్లేలా గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్, జిల్లా సహకార అధికారి, ఐకెపి ఎపిఎమ్ లు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు సమస్యలు ఉంటే సత్వరం పరిష్కరించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే




**కరీంనగర్ సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):**

జిల్లా ప్రజలకు తాగనీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్, భూగర్భజలాలు, తాగునీటి నిర్వహణ, క్లోరినేషన్ తదితర అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇవ్వడంతోపాటు విధిగా ఓహెచ్ఎస్ క్లీనింగ్ చేపట్టాలన్నారు. అంగన్వాడీలు, రైతు వేదికలు, ప్రభుత్వాసుపత్రులకు నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. వీ బీజీ రాంజీ పథకం కింద ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారుల తో సమన్వయం చేసుకొని ఫారం ఫండ్స్, ఇంకుడు గుంతల తవ్వకం పనులు చేపట్టడంతో పాటు బోర్ వెల్ రీఛార్జి పనులు చేయించాలన్నారు. రైతులు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈవో చైతన్య జైనీ, డిఎంహెచ్వో రాజగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనోత్సవాలను పరిశీలన...జిల్లా కలెక్టర్



**జగిత్యాల సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)**

తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు జగిత్యాల జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగవైభవంగా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద నిమజ్జనోత్సవాల తీరును జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు. పట్టణంలో అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు చింతకుంట చెరువు వైపు తరలి వెళ్తున్నాయి నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టిందిని తెలిపారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్గాలను పర్యవేక్షించడంతో పాటు నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు చెరువు వద్ద నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ తాగునీరు విద్యుత్ లైటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ మున్సిపాలిటీలు ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయడంతో నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగుతున్నాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారన్నారు. భక్తి ఉత్సాహం క్రమశిక్షణతో సాగిన నిమజ్జనోత్సవాలతో జిల్లా మరోసారి గణేష్ ఉత్సవాల వైభవాన్ని చాటుతుందన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ తహసీల్దార్ రామ్ మోహన్ సంబంధిత అధికారులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

### అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 25 (వుదయం ప్రతినిధి) :**

ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్ లో శుక్రవారం ఎస్పీ మహేష్ బి.గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డు సమీపంలోని మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల వారీగా బాధ్యతలు అప్పగించి, పరస్పర సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్తు తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి,నైపుణ్య శిక్షణే ధ్యేయం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**పెద్దపల్లి, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్, ఇండస్ట్రీ, ఎంగేజ్‌మెంట్" అంశంపై వివిధ కంపెనీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షప్రత్యేక సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక ఉపాధి ఉద్యోగాలు, అర్హతలు, శిక్షణ, జీతం శ్రేణి, ఆశించిన ఉద్యోగాల గురించి చర్చించారు. విద్యార్థులకు డేటా అనలిస్ట్ ప్లేస్‌మెంట్, శిక్షణ నిరుద్యోగులకు అందించాలని, ఉద్యోగ అవకాశాలు, జీతం, భవిష్యత్ అవకాశాలు, విద్యార్థుల అప్‌స్కిల్లింగ్ అవసరాలపై శిక్షణ పెంపొందించేలా నిరుద్యోగులకు ప్రత్యేక చొరవ కలిగి ఉండేలా టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణను అందించాలని తెలిపారు. పదవ తరగతి , ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సైతం ఉపాధి కల్పించేలా బ్యాంకింగ్ బేసిక్ లెవెల్స్, హెల్త్ కేర్ అసిస్టెంట్, పేషెంట్ కేర్ జాబ్స్, ప్రొడక్ట్ డిజైన్, రిటైల్ మార్కెట్లో సేల్స్ వంటి రంగాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బాలికలు, మహిళల కోసం ప్రత్యేక గర్ల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ప్రమోషన్స్ కల్పించేలా 30 రోజుల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆదేశించారు. నియామక డ్రైవ్ నిర్వహించే సాధ్యసాధ్యాలపై చర్చించారు. అవగాహన కార్యక్రమం నిర్వహించి తగిన సంఖ్యలో యువత సిద్ధమయ్యాక డ్రైవ్ నిర్వహించాలని, సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. టాస్క్ ఇంటర్ ద్వారా ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించే అవకాశంపై చర్చించి, అవసరమైన బ్యాచ్, విద్యార్థుల ప్రొఫైల్, అర్హత, ఉపాధి అవకాశాలు, ఏర్పాటు, ఆసక్తి గల స్టార్టప్‌ల గురించి పలు సూచనలు చేశారు. స్థానిక యువతకు వర్క్–ఫ్రమ్–హోమ్ ఉపాధి అవకాశాలు, సోలార్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అవకాశంపై, ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు, బేసిక్–టు–మోడరేట్ స్థాయి ఐటీ, ఉపాధి అవకాశాలపై సమీక్షించారు. అనంతరం పెద్దపల్లి టాస్క్ సెంటర్లో శిక్షణ పొంది ఐసిఐసిఐ బ్యాంక్ లో సీనియర్ ఆఫీసర్ గ్రేడ్‌లో 'రిలేషన్‌షిప్ మేనేజర్' ఉద్యోగం సాధించిన ముస్త్యాల మణిశ్రీ ని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, రీజినల్ టాస్క్ సెంటర్ (ఇంచార్జ్) కౌసల్య, వివిధ కంపెనీల ప్రతినిధులు శ్యామ్, హరిహర్, వంశీ, అర్జున్, సంబంధిత, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 400 మంది పోలీసులతో గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

### విధుల్లో ఉన్న పోలీసులకు జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ బ్రీఫింగ్

### ఏఎస్పీ–1,డీఎస్పీలు–2, సీఐలు –12, ఎస్సైలు –28 మంది ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

ఆసిఫాబాద్ కాగజ్‌నగర్, పట్టణాల్లో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించి, విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, మసీదులు, నిమజ్జన ప్రదేశాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. భద్రతా విధుల్లో ఏఎస్పీ – 1, డీఎస్పీలు – 2, సీఐలు – 12, ఎస్సైలు – 28 మందితో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందిపాల్గొంటున్నారు. నిమజ్జన శోభాయాత్రను 6సెక్టార్లుగా, 11క్లస్టర్ లగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో లిఫ్టింగ్ అండ్ పుషింగ్ పార్టీలను కూడా అందుబాటులో ఉంచారు. నిమజ్జన శోభాయాత్ర జరిగే మార్గాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన వాహనాల క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. సీసీటీవీ కెమెరాలు, పర్యవేక్షణ బృందా ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. విధుల్లో ఉన్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందిం చి, ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించి, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

**కామారెడ్డి, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):**

## డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా..

### కాలినడకన నిమజ్జన రూట్‌ను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ



కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర భక్తిశ్రద్ధలు, డప్పుల దరువులు, డోలు బ్యాండ్లు, సంప్రదాయ నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగింది. గణనాథుడి శోభాయాత్రను తిలకించేందుకు కామారెడ్డి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయమని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. భక్తి, ఆనందోత్సాహాలతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తూ, డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా భద్రతా ఏర్పాట్లను నిరంతరం పరిశీలించారు. అంతేకాకుండా స్వయంగా కాలినడకన నిమజ్జన రూట్‌లో పర్యటిస్తూ పోలీసు అధికారులు, సిబ్బందికి, గణేష్ మండపాల నిర్వాహకులకు ఉత్సాహాన్ని నింపారు. శోభాయాత్ర సజావుగా సాగేందుకు క్షేత్రస్థాయిలో అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతుండటం పట్ల ఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని, అందరి సమన్వయం, సహకారంతోనే ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పోలీసుల సూచనలకు సహకరించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. రోడ్లపై గుమిగూడకుండా, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సురక్షితంగా నిమజ్జన వేడుకలను తిలకించాలని సూచించారు. భక్తి, సంప్రదాయం, ఆనందోత్సాహాల మధ్య గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు, డీజే శబ్దాలు లేకుండా సంప్రదాయ పద్ధతిలో శోభాయాత్ర కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డీజే సౌండ్ లేకపోవడంతో కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా నిమజ్జన వేడుకలను వీక్షించేందుకు అవకాశం కలిగిందని, ఎలాంటి ఇబ్బంది కలగలేదని పలువురు తెలిపారు. ప్రజల ప్రశాంతత, భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తీసుకున్న నిర్ణయాల పట్ల ప్రజలు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే. నర్సింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, ఇతర డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా బొజ్జ గణపయ్య శోభాయమాన యాత్ర నిమర్జనం

### గణపయ్యకు విడ్కోలు పలికిన భక్తజనం

### గణనాథులకు ఘనస్వాగతం పలికిన మంత్రి అడ్లూరి.లక్ష్మణ్



**ధర్మపురి సెప్టెంబర్ 25 (వుదయం విలేకరి):**

ధర్మపురి మండల వ్యాప్తంగా గణేష్ నవ రాత్రులను భక్తులు ఏంతో భక్తి శ్రద్ధలతో, పూజాది కాలతో గణపయ్యను కొలిచి, దూప దీప నైవేద్యాలు సమర్పించి, శుక్రవారం వెళ్ళిరావయ్య గణపయ్య మళ్ళీ రావయ్యా గణపయ్య అంటూ శోభాయ మానంగా మహిళల కోలాటాల తో ,ఆటపాటలతో నిమర్జనకు సాగనంపారు. నిమర్జన ఏర్పాట్ల ను మున్సిపల్,పోలీస్,రెవెన్యూ, విద్యుత్ శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుం డా సిఐ రాంనరసింహ రెడ్డి పర్య వేక్షణలో ఎస్సె లు సధాకర్, రవీందర్ లు బందోబస్తు ఏర్పా ట్లు పర్యవేక్షించారు. స్థానిక నంది చౌరస్తా వద్ద మున్సిపల్ ఆధ్వ ర్యంలో ప్రజాప్రతినిధులు, అధి కారులు,నాయకులు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయగా ముఖ్య అతిధిగా మంత్రి అడ్లూరి హాజరై నంది చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద కొబ్బరికాయ కొట్టి గణనాధులకు ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మం త్రి మాట్లాడుతూ ప్రజలందరికీ గణేష్ నిమార్జనోత్సవ శుభాకాం క్షలు తెలియజేశారు. పట్టణంలో ని వాడవాడలలో వినాయక మండపాలలో 9 రోజులు భక్తి శ్రద్ధలతో పూజది కార్యక్రమాల నిర్వహించి సంప్రదాయబద్దం గా నిమార్జనోత్సవాలను నిర్వ హించడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. పట్టణంలో, గ్రామాల్లో ప్రజలందరూ సకల సంపదలతో ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తిని





ఇవ్వాలని ఆ గణపతిని, శ్రీలక్ష్మి నరసింహ స్వామిని వేడుకుంటున్నానని తెలిపారు. మున్సిపల్, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని, నిమార్జన సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. గోదావరికి వెళ్లే దారిలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్ల ను,ఫైర్ సిబ్బందిని,108 అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. పెద్ద విగ్రహాలను పోలీసులు సూచనల మేరకు రాయపట్నం గోదావరి నది వద్దకు తరలించి నిమర్జన చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల. నాగలక్ష్మి రాజేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# గోమాత ఆకలి తీర్చి భక్తి చాటుకున్న యువకుడు

**ధర్మపురి,సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):**

## ధర్మపురి కాళీమాత ఆలయ గోవులకు గడ్డి వితరణ

### గోశాల నిర్వాహకులు సంజీవ్ స్వామికి అందజేసిన అయిత సందీప్



ధర్మపురిలో గోసేవలో ఒక భక్తు డు తన మంచి మనసును చాటుకున్నారు. శుక్రవారం కాళీ మాత ఆలయంలోని గోవుల ఆకలి తీర్చేందుకు అయిత సందీప్ అనే యువకుడు ముందుకు వచ్చారు. గోమాత పోషణ నిమిత్తం ఆయన గడ్డిని సమకూర్చి, ఆలయ గోశాల నిర్వాహకులు సంజీవ్ స్వామికి అందజేశారు. మూగజీవాల ఆకలి తీర్చడం దైవంతో సమానమని భావించిన సందీప్ చేసిన ఈ సత్కార్యం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంటోంది. గోవులకు సేవలందించిన అయిత సందీప్ పై కాళీమాత కృపాకటాక్షాలు ఉండాలని, ఆ దేవుని దివ్య ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ లభించాలని ఆలయ భక్తులు,స్థానికులు ఆకాంక్షించారు. ధర్మపురి కాళీ మాత ఆలయ గోశాల గోవులకు ఎవరైనా గడ్డి అందించాలనుకుంటే, దాతలు 9110570781 నెంబర్‌ను సంప్రదించి గోశాల నిర్వాహకులు సంజీవ్ స్వామి ని కలిసి తమ వంతు సహకారం అందించవచ్చునని తెలిపారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 25....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో నేడు సర్పంచ్ పెంజర్ల మమతా నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు గ్రామ పరిశుభ్రత లో భాగంగా చెత్తబుట్టల పంపిణీ చేయడం జరిగింది. తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇచ్చిన చెత్తబుట్టలో తెచ్చి గ్రామపంచాయతీ డాక్టర్ లో వేసి గ్రామ పరిశుభ్రతకు తోడ్పడాలని వారు గ్రామస్తులని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్కూరి సత్యనారాయణ. సభ్యులు అశ్రబ్ బేగం. బోలా సదానందం. మస్కూరి సంతోష పరశురాం. ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్. దత్తాత్రేయ గౌడ్. ఇందూరి మంజుల రాజు. బోలా శివరాజ్. మహేష్ గౌడ్. పెంజల్ రా మహేష్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

## ఐ డి ఓ సి సముదాయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి




- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట సెప్టెంబర్ 24(వుదయం ప్రతినిధి)

ఐ డి ఓ సి సముదాయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న ఐ డి ఓ సి భవనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఛాంబర్, మినిస్టర్ ఛాంబర్ మరియు మీటింగ్ హాల్ లను పరిశీలించారు. అలాగే మీటింగ్ హాల్ లో ప్రొజెక్టర్ ఏర్పాటు పై అధికారులకు తగిన సూచనలు చేశారు. కలెక్టర్ కన్ఫరెన్స్ హాల్ లో వీడియో కాన్ఫరెన్స్ కు సంబందించిన టీవీ ఏర్పాటు కు సంబందించిన వాటిని కలెక్టర్ కి వివరించారు. భవనం బయట హార్టికల్చర్ గ్రీనరీ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ . అండ్.బి. ఈ.ఈ.వెంకట రమణ , డి.ఈ.రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిపేట వన్ టౌన్ పరిధిలో సంచలనం



- కిడ్నాప్, పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష!
- రూ. 1,05,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పిన పోక్సో కోర్టు న్యాయమూర్తి వై. జయప్రసాద్
- 2018లో నమోదైన కేసులో పక్కా ఆధారాలతో నిందితుడికి శిక్ష ఖరారు

సిద్ధిపేట, సెప్టెంబర్ 25 (వుదయం బ్యూరో)

మైనర్ బాలిక కిడ్నాప్, పోక్సో కేసుకు సంబంధించి సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిందితుడికి న్యాయస్థానం భారీ శిక్ష విధించింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు రూ. 1,05,000 జరిమానా విధిస్తూ గౌరవ న్యాయమూర్తి వై. జయప్రసాద్ శుక్రవారం చారిత్రాత్మక తీర్పు వెల్లడించారు.

**కేసు పూర్వాపరాలు:**

27 జనవరి 2018న సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. నాటి కేసు దర్యాప్తు అధికారి, అప్పటి ఇన్స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి సత్వరమే స్పందించి సైంటిఫిక్ దర్యాప్తుతో పాటు పక్కా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ విచారణలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (స్పెషల్ పిపి) సాదుల ఆత్మరాములు బలమైన వాదనలు వినిపించారు. ప్రస్తుత ఇన్స్పెక్టర్ పి. మహేందర్ రెడ్డి, సాక్ష్యాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ బాపురెడ్డిలతో పాటు భరోసా ఇన్చార్జ్ అధికారి బి.దుర్గా, లీగల్ అధికారి సౌమ్యల బృందం కేసు విచారణలో సమన్వయంతో కీలక పాత్ర పోషించారు.

**న్యాయస్థానం తీర్పు:**

పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యాలు, సాక్షుల వాంగ్మూలాలను క్షుణ్ణంగా పరిశీలించిన స్పెషల్ కోర్టు న్యాయమూర్తి వై. జయప్రసాద్, నిందితుడైన కొమ్ముగళ్ల బాలకృష్ణ (35)ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1,05,000 జరిమానా విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు.

**అధికారులకు సీపీ అభినందనలు:**

నిందితుడికి సరైన శిక్ష పడేలా పక్కాగా దర్యాప్తు చేపట్టి కోర్టులో సాక్ష్యాలను బలంగా ప్రవేశపెట్టిన అధికారులు, సిబ్బందిని సిద్దిపేట సీపీ రశ్మీ పెరుమాళ్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పిల్లల భద్రతకు సిద్దిపేట కమిషనరేట్ పోలీస్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో ఎలాంటి రాజీ పడేది లేదు" అని హెచ్చరించారు.

## కన్నుల పండువగా గణనాథుల శోభాయాత్ర

- కోలాటాలు, భజనలు..
- దీపాల వెలుగుల్లో ఘనంగా వీడ్కోలు

నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 25 (వుదయం ప్రతినిధి):



నాగర్ కర్నూల్ పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన గణనాథుల శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయకులను నిమజ్జనానికి తరలించే క్రమంలో పట్టణ పురవీధులన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది.

పట్టణంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథులను ఒకే చోటికి చేర్చి అక్కడి నుంచి శోభాయాత్రగా బయలుదేరారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లపై గణనాథులను కొలువుదీర్చి ఘనంగా ఊరేగించారు. ఎడ్లబండ్లకు రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శోభాయాత్రలో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో చేతుల్లో దీపాలను పట్టుకుని పాల్గొనడం కనులవిందుగా మారింది. యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని కోలాటాలు, భజన సంకీర్తనలతో సందడి చేశారు. డప్పుల మోతలు, భక్తిగీతాలు, జై గణేశ్, గణపతి బప్పా మోరియా నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి.

శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. దారి పొడవునా భక్తులు గణనాథులకు పూలు చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ వేడుకున్నారు.ఈ శోభాయాత్రలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, వివిధ కాలనీల ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గుంటిపల్లి పాఠశాలలో విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు

- 100 మంది విద్యార్థులకు రక్త, కంటి పరీక్షలు
- పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

గద్వాల సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)



జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సంధ్యా కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గద్వాల మండలం గుంటిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. పి. రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త, కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టగా, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన మాత్రలను అందజేశారు.

విద్యార్థులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవడం, హ్యాండ్‌వాష్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి, అవసరమైన తదుపరి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బంది తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎన్. కృపయ్య, గ్రామ సర్పంచ్ శివకుమార్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక స్థోమత లేని పేదలకు కాంట్రాక్టర్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు

వనపర్తి సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)



ప్రతి పేద కుటుంబానికి ఒక పక్కా ఇల్లు ఉండాలి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలి..గుడిసెలు లేని వనపర్తి జిల్లా లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

మొదటి విడతలో ఇంటి నిర్మాణం ప్రారంభించుకొని వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు ఒకేసారి బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఆర్థిక స్తోమత లేక కట్టుకోలేని పేదలకు కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు*

ఆర్థిక స్తోమత లేని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఒప్పుకుంటే కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు తక్షణ చర్యలు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టికరణ ప్రతి పేదవానికి ఒక పక్కా ఇల్లు ఉండాలి అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని 100% విజయవంతం చేసేందుకు వనపర్తి జిల్లాలో గుడిసెల్లో నివసించే ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాకుండా.. ఆర్థిక స్థోమత లేక ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు ప్రభుత్వమే ముందుకు వచ్చి లబ్ధిదారునికి కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చే విధంగా ప్రభుత్వము చర్యలు తీసుకుంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వివరించారు.ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులతో శుక్రవారం వనపర్తి ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జిల్లా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆత్మగౌరవం కొరకు ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలి అనే సంకల్పంతో ఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని మొదటి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని దానితోపాటు గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అదేవిధంగా గోడలు ఉండి పైకప్పు రేకులు పెంకులతో ఉన్న వారికి పైకప్పు వేసుకునే విధంగా రెండో విడతలో నియోజకవర్గానికి మరో 2000 ఇళ్ళ చొప్పున మంజూరు చేయడం జరిగింది అన్నారు.ఈ సందర్భంలో వనపర్తి నియోజకవర్గం లో మొదటి విడత మంజూరు చేసిన ఇళ్లలో ఆర్థిక స్థోమత లేక దాదాపు 300 మంది మంజూరు ఉత్తర్వులు పోంది ఇల్లు నిర్మించుకోలేదని అలాంటి వారికి లబ్ధిదారులు ఒప్పుకుంటే కాంట్రాక్టర్ ద్వారా నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులు కాంట్రాక్టర్ బ్యాంకరు ముగ్గురు పేరున ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి పని జరిగే విధంగా విడుతలవారీగా ముందుగా డబ్బులు లబ్ధిదారుని ఖాతాలో జమ చేసి అనంతరం కాంట్రాక్టర్ కు బదిలీ చేయడం జరుగుతుంది. 418 చదరపు కదుపులో 9 పిల్లర్లు రెండు అడుగుల బేస్మెంట్ వరకు వేసి, సిమెంట్ ఇటుకలతో ఒక హాల్, బెడ్ రూమ్, కిచెన్, లాటరిన్ బాత్రూమ్ తో కూడిన చక్కని ఇందిరమ్మ ఇంటిని కాంట్రాక్టర్ ద్వారా నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఒప్పుకొని స్వచ్ఛందంగా కాంట్రాక్టర్ తో ఒప్పందం చేసుకుంటే మూడు నెలల్లోనే ఇల్లు పూర్తి చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తే కొందరు అప్పులు తీసుకువచ్చి అవసరం లేకున్నా ఎత్తయిన బేస్మెంట్లు నిర్మించుకొని ఇల్లు పూర్తి అయ్యేవరకు అప్పుల పాలవుతున్నారని దానివల్ల వారు పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. అవసరం బట్టి నాణ్యమైన ఇళ్ళు కట్టుకోవాలి తప్ప అనవసర ఆర్భాటాలకు వెళ్లి అప్పుల పాలు కావద్దని లబ్ధిదారులను సూచించారు. మొదటి విడతలు ఇందిరమ్మ ఇల్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు త్వరలో ఒకేసారి మొత్తం పేమెంట్ చేసే విధంగా ప్రభుత్వము ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసిందని తెలియజేశారు. దేశంలో ఎల్ నీనో ప్రభావం వచ్చే జూలై వరకు ఉంటుందని అందువల్ల ప్రజలు ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని నల్లాలు ఓపెన్ చేసి వదిలేయడం సరికాదని నీటి విలువను గుర్తించాలని చెప్పారు. విద్యుత్ వినియోగం సైతం అవసరం మేరకు మాత్రమే వాడాలని ప్రభుత్వం డబ్బులు ఇచ్చినా విద్యుత్తు నీరు దొరికే అవకాశం లేదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇళ్లు మంజూరు చేయగా అందులో 3164 ఇళ్లకు మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగిందని, రెండో విడతలో 258 వెరసి 3422 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు దారి చేయడం జరిగింది. ఇందులో ఇప్పటివరకు 1040 ఇల్లు పూర్తి స్థాయిలో నిర్మించుకొని మిగిలినవి వివిధ నిర్మాణ స్థాయిలో ఉన్నాయన్నారు. వనపర్తి జిల్లాలో దాదాపు 443 మంది లబ్ధిదారులు మంజూరు పత్రాలు తీసుకొని కూడా వివిధ కారణాలవల్ల ఇంటి నిర్మాణం ప్రారంభించలేదని అలాంటి వారికి కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ఈ ప్రత్యేక పథకము ఉపయోగపడుతుందన్నారు. అయినప్పటికీ బలవంతం ఏమి లేదని లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఒప్పుకుంటే కాంట్రాక్టర్ ద్వారా నిర్మించి ఇస్తామని లేదంటే లబ్ధిదారులు సొంతంగా కట్టుకోవచ్చని తెలియజేశారు. ఈ రెండు కాకుండా ఇల్లు కట్టుకోకుంటే మాత్రం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు రద్దు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు ఎలా నిర్మించి ఇస్తారో నాణ్యత ప్రమాణాలను వీడియో ద్వారా చూపించారు.ఈ సమావేశంలో పిడి హౌసింగ్ విటోబా వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సర్పంచులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి)



ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై అడ్డాకల్, భూత్పూర్, చిన్నచింతకుంట, దేవరకద్ర, జడ్చర్ల, కోయిలకొండ, కౌకుంట్ల, మూసాపేట, రాజాపూర్ తొమ్మిది మండలాల సర్పంచులు, ఎం.పి.డి.ఓలు, ఎం.పి.ఓలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ**

గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునే విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలలో పొందుపర్చువాలని అన్నారు.గ్రామాభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి, వాటిని వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని తెలిపారు.ఎల్ నీనో వల్ల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున భూగర్భ జలాలపై వాటి ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్లు వంటి పనులను చేపట్టాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. గ్రామాల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.నీటి సంరక్షణ తో పాటూ, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణ అనే నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.గ్రామాలలో పాఠశాల, గ్రామ పంచాయతీ, వి.ఓ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీ గోడలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు తదితర మౌలిక అవసరాలను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని తెలిపారు.అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన తీర్మానాలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, గ్రామాభివృద్ధిలో సర్పంచులు పునాది వంటివారని అన్నారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు, సౌకర్యాలను పొందేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని తెలిపారు. పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే, ప్రభుత్వ స్థాయిలో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మిషన్ భగీరథ ఇంట్రాఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలను సర్పంచులకు వివరించారు. ఆయా శాఖల పరిధిలో ఉన్న పథకాలకు అనుగుణంగా గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్‌చార్జి డి.పి.ఓ వెంకట్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు, ఎం.పి.డి.ఓ లు, ఎం.పి.ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మురుగు నీరు కనిపిస్తేతొలగించాల్సిందే!

- కోహీర్‌లో మున్సిపల్ లో ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం
- డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన
- నీటి నిల్వల తొలగింపు.. బ్లీచింగ్ పౌడర్ చల్లింపు

కోహీర్ , సెప్టెంబరు 25 (వుదయం ప్రతినిధి )

కోహీర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రై డే' కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, వైస్ చైర్మన్ అన్నం జావిద్ నేతృత్వంలో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో సీజనల్ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**దోమల నివారణకు ముందస్తు చర్యలు**

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్, వైస్ చైర్మన్ సూచించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

**ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలకు చెక్**

ఇళ్ల చుట్టుపక్కల మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి బోండాలు, ఎయిర్ కూలర్లు, పూల కుండీలు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు వివరించారు.

వీధి కుక్కల నుంచి జాగ్రత్తలు

ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా వీధి కుక్కల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వీధి కుక్కల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వీధుల్లో మురుగు నీటి తొలగింపుమున్సిపల్ సిబ్బంది ఆయా వార్డుల్లో పర్యటించి వీధుల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించారు. దోమల వృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

బ్లీచింగ్ పౌడర్‌తో పారిశుధ్య చర్యలు

మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టి, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు.ప్రతి శుక్రవారం 'ఫ్రైడే-డ్రై డే' పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అధికారులు కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధులను సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన అవసరం: కలెక్టర్ హేమంత్ పాటిల్



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 25 (వుదయం బ్యూరో)

వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, హక్కులపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎల్డర్ గైడ్ అవగాహన పోస్టర్లను అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్వో పాండు, డీపీవో శ్రీరాములు, పీడీ డీఆర్డీఏ చిన్న ఓబులేసుతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి భద్రత, చట్టబద్ధ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, పథకాలను వారికి చేరవేయడంలో ఎల్డర్ గైడ్ ఉపయోగపడుతుందని తెలిపారు.వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 25న వృద్ధాశ్రమాల్లో వినోద కార్యక్రమాలు, 26న సిబ్బందికి శిక్షణ, 28న సైబర్ భద్రతపై అవగాహన, 29న విద్యార్థులు, తాతాబామ్మల ఆత్మీయ కలయిక, 30న వాకథాన్, అక్టోబరు 1న ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ

- నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు..
- త్వరలో మంజూరు చర్యలు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):

తాండూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి కార్యాలయంలో ప్రజలకు అందుతున్న రిజిస్ట్రేషన్ సేవలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు . ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు హైదరాబాద్ రోడ్డు మార్గంలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. త్వరలోనే నూతన భవన నిర్మాణానికి మంజూరు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రజల సమస్యలపై ఆరా

తనిఖీ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, సేవల అందుబాటు, కార్యాలయ సిబ్బంది పనితీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు పారదర్శకంగా, సకాలంలో సేవలు అందించడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాలెడ్డి వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్





# సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- తాడూర్ మండల అధికారులకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి దిశానిర్దేశం

తాడూర్, సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి):

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచు కుళ్ల రాజేష్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తాడూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, పెండింగ్ లో ఉన్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రా రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రబీ పంటల సాగుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



- జూరాల నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
- మినుములు, శనగలు, మొక్కజొన్న, రబీ జొన్న సాగును ప్రోత్సహించాలని నిర్ణయం

గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల జిల్లాలో రబీ పంటల సాగుకు సంబంధించి మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీఓసీలోని జిల్లా వ్యవసాయ అధికారి ఛాంబర్‌లో సాంకేతిక సమావేశం నిర్వహించారు.సమావేశంలో జిల్లాలో రబీ పంటల మండలాల వారీగా అంచనా సాగు విస్తీర్ణాన్ని ఖరారు చేయడంతో పాటు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై చర్చించారు.నీటిపారుదల శాఖ డీఈ శివకృష్ణ మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నుంచి నవంబర్ వరకు వారాబందీ పద్ధతిలో ప్రతి మూడు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ అనంతరం నీటి లభ్యతపై స్పష్టత లేనందున, నీటి వసతి లేని ప్రాంతాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సాంకేతిక అధికారులు సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, స్థానిక వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మండలాల వారీగా ప్రత్యామ్నాయ పంటలను గుర్తించారు. ముఖ్యంగా మినుములు, శనగలు, మొక్కజొన్న, రబీ జొన్న పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా ప్రణాళిక రూపొందించారు.అలాగే ఆత్మ కార్యక్రమం అమలు, పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అవలంబన, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రబీ పంటల ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో టీఆర్‌వీకే గద్వాల సమన్వయకర్త డా. పి. అర్చన, నీటి పారుదల శాఖ డీఈ శివకృష్ణ, డీహెచ్ఎస్ఓ రాజ్‌కుమార్, కేవీకే మదనాపురం కార్యక్రమ సమన్వయకర్త రాజేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన పావనికి కన్నీటి నివాళి



- భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు
- కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించిన నాయకులు

అయిజ సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన మాల పావని ఇటీవల పాలమూరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. వైద్య విద్యలో అడుగుపెట్టి కుటుంబానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాల్సిన పావని అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అయిజ మున్సిపల్ వైస్‌చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కుమార్తె అయిన పావని కొంతకాలంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఉదయం అయిజలోని మాల నర్సింహులు నివాసానికి చేరుకుని పావని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన కొద్దిరోజులకే పావని మృతి చెందడం తీవ్ర విషాదకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మెడికల్ తిరుమలరెడ్డి, మాజీ టీడీపీ నాయకులు అంజిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు మాదిగ, ఎస్పీ హనుమంతు, ఉప్పల దేవన్న మాదిగ, తెలంగాణ ఉద్యమ ఫోరం అధ్యక్షుడు మిట్టదొడ్డి నరసింహులు, డాక్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సంబంధ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

- రీ సర్వే పనులను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 25 (వుదయం బ్యూరో)



భూ సంబంధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి అన్ని మండలాల తహసిల్దార్లతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించి రీ సర్వే, భూభారతి, సాదా బైనామా తదితర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ నెల 28న వనపర్తిలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి రెవెన్యూ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. భూభారతి, సాదా బైనామా తదితర దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను పేర్కొంటూ నివేదికలు సమర్పించాలని సూచించారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని, అవసరమైన చోట లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభించగా, రెండు గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సర్వే ఏడీ సూకరాజు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ వేదికపై గద్వాల్ జిల్లా కలెక్టర్‌కు అరుదైన అవకాశం

- దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన జోగులాంబ గద్వాల జిల్లా
- ఉత్తమ నీటి నిర్వహణపై జాతీయ వేదికగా ఢిల్లీలో ప్రసంగించే అవకాశం
- ఇది జిల్లా ప్రజలందరికీ గర్వకారణం: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం బ్యూరో)



జాతీయస్థాయి వేదికపై జోగులాంబ గద్వాల జిల్లాలో అమలు చేస్తున్న ఉత్తమ నీటి నిర్వహణ విధానాలపై ప్రసంగించే అరుదైన అవకాశం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు లభించడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. దేశవ్యాప్తంగా పలువురు జిల్లా కలెక్టర్లు ఉన్నప్పటికీ, కేంద్ర జల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్‌లో జిల్లా స్థాయిలో చేపడుతున్న నీటి నిర్వహణ కార్యక్రమాలను వివరించే అవకాశం గద్వాల కలెక్టర్‌కు దక్కడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా అధికారులు పేర్కొన్నారు.కేంద్ర జల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్‌లో భాగంగా ఈ నెల 24న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని, జిల్లాలో అమలు చేస్తున్న ఉత్తమ నీటి నిర్వహణ విధానాలపై ప్రసంగించారు. జాతీయ స్థాయి వేదికపై గద్వాల జిల్లా అనుభవాలను వివరించడం ద్వారా జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా మరింత ఇనుమడించిందని అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగం తరఫున పలువురు అధికారులు ఐడీఓసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో రిజ్వాన్ బాషా షేక్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించుకునేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. వర్షపాతం తగ్గుతున్న పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు.నీటి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో చేపడుతున్న నీటి నిర్వహణ కార్యక్రమాలకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం వెనుక అధికారుల సమిష్టి కృషి, ప్రజల భాగస్వామ్యం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డీపీఓ శ్రీకాంత్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఐఈఓ హృదయ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మందుల భద్రతలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

- ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలి : ఇన్‌ఛార్జి డీఎంహెచ్ వో డాక్టర్ రఫీక్

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 25 (వుదయం బ్యూరో):



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని, మందుల భద్రత నుంచి వాటి సరైన వినియోగం వరకు ఫార్మసీ అధికారులు బాధ్యతాయుతంగా సేవలందిస్తున్నారని ఇన్‌ఛార్జి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఫీక్ అన్నారు.ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం, నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాత కలెక్టరేట్ లోని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కార్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌ఛార్జి డీఎంహెచ్ వో డాక్టర్ రఫీక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎంహెచ్ఎన్ డాక్టర్ రవికుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డాక్టర్ రఫీక్ మాట్లాడుతూ.. ఆసుపత్రి వైద్య వ్యవస్థలో ఫార్మసీ విభాగం ఒక కీలకమైన భాగమని అన్నారు. వైద్యులు సూచించిన మందులు రోగులకు సక్రమంగా అందేలా చూడటంతో పాటు, మందుల నిల్వ, నాణ్యత, గడువు తేదీల పరిశీలన, సరైన పంపిణీ వంటి అంశాల్లో ఫార్మసిస్టులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మందు సరైన రోగికి సరైన మోతాదులో సరైన సమయంలో సురక్షితంగా అందేలా చూడటంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. ప్రజలకు మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, యాంటీబయాటిక్స్ ను అనవసరంగా వినియోగించకుండా సూచనలు ఇవ్వడంలో కూడా ఫార్మసిస్టులు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు కేవలం మందులు పంపిణీ చేసే సిబ్బంది మాత్రమే కాదని, ప్రజారోగ్య వ్యవస్థలో కీలక భాగస్వాములని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల లభ్యతను నిరంతరం పర్యవేక్షించడం, గడువు ముగిసిన మందులు వినియోగంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో ఫార్మసీ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈవిన్ వంటి డిజిటల్ వ్యవస్థల వినియోగంతో మందుల నిర్వహణ మరింత పారదర్శకంగా మారుతోందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగంలో ఫార్మసిస్టుల బాధ్యతలను వివరించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ దామగట్ల కుమార్ మాట్లాడుతూ.. ఫార్మసిస్టుల సేవలు మొత్తం ప్రజారోగ్య వ్యవస్థతో ముడిపడి ఉన్నాయని, మందుల భద్రత, నాణ్యత ద్వారా రోగుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రఘు, సాయి, రజనీ, సంపత్, అఖిల, డిప్యూటీ డీఎంహెచ్ వో కార్యాలయ అధికారులు, జిల్లా ఇమ్యునైజేషన్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కమిటీ నియామకం

- డిసిసి అధ్యక్షుడు తుమ్ముంట అంక్షారెడ్డి ఉత్తర్వులు
- కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం
- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 25, వుదయం:



సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షుడు తుమ్ముంట అంక్షారెడ్డి మిరుదొడ్డి మండల కాంగ్రెస్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ఉత్తర్వులలో మొత్తం 21 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. శుక్రవారం డిసిసి కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసిసి కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా అన్నెబోయిన కీర్తన, బసంగారి కన్నారెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా చిన్నగల్ల బాలకుమార్, ఏనగంటి కిష్టయ్య, ఆగురం కనకారెడ్డి, జోగరి భాస్కర్, సెక్రెటరీలుగా వర్ధమహేందర్, చెప్యాల ఉప్పలయ్య, లాగిశెట్టి లక్ష్మీనారాయణ, నిరాటి రాజు, గొట్టం నరేష్, పంజాల వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వడ్లూరి రత్నారెడ్డి, ఆకుల ప్రశాంత్, సుంకరి రాజం, మాదురి నరేష్, జెగ్గా స్వామి, నేరేండ్ల కిష్ట గౌడ్, ఎర్రోల్ల నర్సిములు, ఎర్రోల్ల రాజు, ధర్మారం ఎల్లయ్య లను నియమించారు. నూతనంగా నియమితులైన నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం బాధ్యతలు అప్పగించిన డిసిసి అధ్యక్షుడు అంక్షారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చెన్నె భూపాల్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# మృతి చెందిన పోలీసు కుటుంబానికి ఎస్పీ అండ

- కార్పస్ ఫండ్ చెక్కులు అందజేత.. మిగిలిన సంక్షేమ ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు

గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)



విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్. అన్నారు. హార్ట్ స్ట్రోక్ కారణంగా 2020 డిసెంబర్ 22న మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ శ్యామప్ప కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా ఎస్పీ కార్పస్ ఫండ్ చెక్కులను అందజేశారు.

కార్పస్ ఫండ్ కింద గత నెలలో శ్యామప్ప రెండో భార్య మనోర, కుమారుడు తేజకు ఒక్కొక్కరికి రూ.12,450 చొప్పున రెండు చెక్కులు అందజేశారు. ప్రస్తుతం మొదటి భార్య కుమారుడు పి.కె. శ్రీకర్, శ్యామప్ప తల్లి నాగమ్మకు ఒక్కొక్కరికి రూ.12,450 చొప్పున మరో రెండు చెక్కులను ఎస్పీ అందజేశారు. దీంతో శ్యామప్ప కుటుంబానికి కార్పస్ ఫండ్ కింద అందించిన నాలుగు చెక్కుల మొత్తం రూ.49,800గా ఉంది.

మిగిలిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. కుటుంబ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి అందాల్సిన మిగిలిన ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో సాయి కృష్ణ, కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి, జూనియర్ అసిస్టెంట్ గాయత్రీ, శ్యామప్ప కుటుంబ సభ్యులు పి.కె. శ్రీకర్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన పూర్వ విద్యార్థినిపావని అకాల మృతి

- పావని మృతికి లయోలా హైస్కూల్ కుటుంబం సంతాపం – నివాళులర్పించిన యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అయిజ సెప్టెంబర్ 25 (వుదయం ప్రతినిధి)



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని లయోలా హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని ఎం. పావని అనారోగ్యంతో అకాల మృతి చెందడం పాఠశాల కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసింది. ఇటీవలే ఎంబీబీఎస్ సీటు సాధించి, వైద్యురాలిగా సేవలందించాలనే తన లక్ష్యం వైపు అడుగులు వేస్తున్న తరుణంలో ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పావని మృతి విషయం తెలుసుకున్న లయోలా హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పావని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ తీరని విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. పావని మృతికి సంతాప సూచకంగా లయోలా హైస్కూల్‌కు శుక్రవారం మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# దళిత యువకుడిపై దాడి.. నిందితులను అరెస్టు చేయాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన డీహెచ్ పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 25 (వుదయం ప్రతినిధి):



వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా దళిత యువకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్ పీఎస్) నాగర్ కర్నూల్ జిల్లా మాజీ అధ్యక్షులు కొమ్ము భరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాగర్ కర్నూల్‌లో ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామంలో గురువారం వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా దళిత యువకుడు పోతేపాక సాయికుమార్ పై దాడి జరిగిందని తెలిపారు. బాధితుడి వాంగ్మూలం ప్రకారం తండు తరుణ్, పండు వేణు, తండు వెంకన్న, తండు లింగమయ్య తో పాటు మరికొందరు కలిసి సాయికుమార్ పై దాడి చేసి కులం పేరుతో దూషిస్తూ ఎడమ పక్క భాగంలో పొడిచి గొంతు కోశారని పేర్కొన్నారు.ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, బాధితుడికి మెరుగైన వైద్యం, కుటుంబానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న ముస్లిం యువకుడు

- రూ.39,900కు ప్రసాదం లడ్డూ వేలం
- కులమతాలకు అతీతంగా ఐక్యతకు ప్రతీకగా రాఘవేంద్ర కాలనీ వేడుకలు

గద్వాల, సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)



గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో శివసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. పదకొండు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయక స్వామి ప్రసాదం లడ్డూను నిర్వహించిన వేలం పాటలో అదే కాలనీకి చెందిన ముస్లిం యువకుడు మహమ్మద్ షఫీ రూ.39,900కు కైవసం చేసుకున్నారు.అదేవిధంగా వినాయక స్వామి వద్ద ప్రతిష్ఠించిన కలశాన్ని తెలుగు కృష్ణ కుమారుడు కిషోర్ రూ.7,777కు వేలం పాటలో కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీరామలింగేశ్వర కాంళ్లే మాట్లాడుతూ రాఘవేంద్ర కాలనీలో శివసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గజానన మహోత్సవాల్లో కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి పాల్గొనడం సంతోషకరమన్నారు. ముస్లిం యువకుడు మహమ్మద్ షఫీ వినాయక స్వామి ప్రసాదం లడ్డూను వేలంలో కైవసం చేసుకోవడం సోదరభావానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు.అనంతరం వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళలు, చిన్నారులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వినాయక స్వామి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శివసేన యూత్ సభ్యులు, రాఘవేంద్ర కాలనీ ప్రజలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

- వేద మంత్రోచ్చారణల మధ్య గోపూజ, హోమ పూజలు
- భక్తులకు అనంత పద్మనాభ సూత్రాల పంపిణీ

ధరూర్ సెప్టెంబర్ 25 (వుదయం కరస్పాండెంట్)



జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని శుక్రవారం ఉడిపి పాలిమార్ మఠం పీఠాధిపతుల ఆధ్వర్యంలో వేదోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.ఉడిపి పాలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాదిశ తీర్థ శ్రీపాదులు, శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు తొలుత మూలరాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామివారికి సంస్థాన పూజ, నవగ్రహ ఆవాహన హోమాలు నిర్వహించి, జంట ఆవులకు శాస్త్రోక్తంగా గోపూజ చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పీఠాధిపతులు భక్తులకు భాగవతం, రామాయణం ప్రవచనాలను అందించారు. అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, సౌభాగ్యం కలగాలని భక్తులు ప్రార్థించారు. భక్తి, నియమం, దానం, సత్యనిష్ఠ, సద్గుణాలను పెంపొందించుకోవడమే ఈ వ్రతం అందించే ప్రధాన ఆధ్యాత్మిక సందేశమని పేర్కొన్నారు.పీఠాధిపతులు భక్తులకు వేద ఆశీర్వచనాలు అందించి అనంత పద్మనాభ సూత్రాలను (ధారలను) పంపిణీ చేశారు. అనంతరం పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.పాలిమార్ పీఠాధిపతుల చాతుర్మాస దీక్షలు శనివారం ఉదయం 9 గంటలకు ముగియనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్చకులు ఆద్య వామనాచారి, ఆద్య కిష్టాచారి, ఆద్య మద్వాచారి, స్వామివారి దివాన్ గిరీశాచార్యులు, ఉడిపి వేద బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

- ప్రత్యేక పూజలు చేసిన సాదుల పవన్ కుమార్

నంగునూరు వుదయం 25 సెప్టెంబర్



నంగునూరు మండల కేంద్రంలో శ్రీ వైష్ణవి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ యూత్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటుతాయని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. యువత ఉత్సాహంగా పాల్గొని 'గణపతి బప్పా మోరియా'అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్రం ఆంజనేయులు, సాయికుమార్, నాగరాజు, గోనపల్లి శివప్రసాద్, నరసింహులు, శేఖర్, భాను రాజు, సోప్పరి రాజ్ కిరణ్, భీమ్ రెడ్డి, అనీష్ రెడ్డి, రాకేష్, అఖిల్, వెంకటేష్, సందీప్ పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## హైరోక్స్ వ్యాయామం అంటే ఏమిటి.. ఎలా చేయాలి..

ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం హైరోక్స్ (HYROX) వంటి అధిక తీవ్రత కలిగిన వ్యాయామ విధానాలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇది సాధారణ జిమ్ వ్యాయామాలు లేదా కేవలం రన్నింగ్‌కు భిన్నంగా ఉంటుంది.




ఇందులో పరుగు, కండరాల బలం, శారీరక సామర్థ్యాన్ని పరీక్షించే వ్యాయామాలను కలిపి చేస్తారు. సాధారణంగా ఎనిమిది కిలోమీటర్ల పరుగు మధ్యలో ఎనిమిది రకాల వ్యాయామాలను చేయాల్సి ఉంటుంది. స్కీఎర్గ్, స్లెడ్ పుష్, స్లెడ్ పుల్, బర్పీ బ్రాడ్ జంప్స్, రోయింగ్, ఫార్మర్స్ క్యారీ, సాండ్‌బ్యాగ్ లంజెస్, వాల్ బాల్స్ ఇందులో ఉంటాయి. ప్రతి దశలో శరీరంపై భిన్నమైన ఒత్తిడి పడడంతో గుండె సామర్థ్యంతో పాటు కండరాల బలం, సహనశక్తి కూడా పరీక్షకు గురవుతాయి. హైరోక్స్‌లో పరుగు, బలవర్ధక వ్యాయామాలు ఒకదాని తర్వాత మరొకటి చేయాల్సి రావడం వల్ల శరీరానికి తీవ్రమైన సవాలు ఎదురవుతుంది. పరుగు గుండె వేగాన్ని పెంచి శ్వాసకోశ సామర్థ్యాన్ని పరీక్షిస్తే, ఇతర వ్యాయామాలు కండరాల బలం, చురుకుదనం, సహనశక్తిని ఉపయోగించుకునేలా చేస్తాయి. ఈ రెండింటి కలయిక వల్ల పోటీ చివరి దశల్లో తీవ్ర అలసట ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అలసట పెరిగినప్పుడు వ్యాయామం చేసే విధానంలో పొరపాట్లు జరిగితే కండరాలు పట్టేయడం, కీళ్ల బెణుకులు, నడుము గాయాలు వంటి సమస్యలు తలెత్తుతాయి. అధికంగా శ్రమించడం వల్ల తీవ్రమైన అలసట, వేడి సంబంధిత అనారోగ్యాలు, ఎక్కువకాలం కొనసాగే శారీరక అలసట వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

అయితే హైరోక్స్ అందరికీ ఒకే విధంగా సరిపోదు. సాధారణంగా వ్యాయామానికి అలవాటు లేని వారు లేదా శారీరక సామర్థ్యం ఇంకా అభివృద్ధి చెందని వారు నేరుగా అధిక తీవ్రత కలిగిన ఈ విధానాన్ని ప్రారంభించడం సరికాదు. తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, నియంత్రణలో లేని కీళ్ల లేదా శరీర నిర్మాణ సంబంధిత గాయాలు ఉన్నవారు, ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. చాలాకాలంగా వ్యాయామం చేయని వారు కూడా ముందుగా తమ శారీరక సామర్థ్యాన్ని పెంచుకుని, అవసరమైతే వైద్యుడు లేదా శిక్షకుడి సలహాతోనే ప్రారంభించడం మంచిది. వ్యాయామం సమయంలో ఛాతీలో నొప్పి, ఊహించని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం, స్పృహ కోల్పోవడం లేదా గుండె కొట్టుకునే విధానంలో అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే వ్యాయామాన్ని ఆపాలి. హైరోక్స్ వంటి అధిక తీవ్రత కలిగిన వ్యాయామాలను సురక్షితంగా చేయాలంటే ముందస్తు సిద్ధత చాలా ముఖ్యం. వ్యాయామానికి ముందు శరీరాన్ని సిద్ధం చేసే వార్మప్, పూర్తయిన తర్వాత కూల్‌డౌన్ చేయాలి. తగినంత నీరు తాగుతూ శరీరంలో ద్రవాల లోటు రాకుండా చూసుకోవాలి. శరీరం తీవ్రంగా అలసిపోయినప్పుడు లేదా నొప్పి వచ్చినప్పుడు బలవంతంగా కొనసాగించకుండా విశ్రాంతి తీసుకోవాలి. సరైన పాదరక్షలు, అనువైన దుస్తులు ఉపయోగించడం కూడా గాయాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. హైరోక్స్ కొత్తగా ప్రారంభించేవారు తక్కువ తీవ్రతతో మొదలుపెట్టి, శారీరక సామర్థ్యం పెరిగే కొద్దీ క్రమంగా తీవ్రతను పెంచడం ద్వారా ఈ వ్యాయామ విధానాన్ని మరింత సురక్షితంగా కొనసాగించవచ్చని నిపుణులు చెబుతున్నారు.


## వీటితో వృద్ధాప్యం దూరం!

వయసు పెరగడం సహజమైన ప్రక్రియే. కానీ, దాని తాలూకు ఛాయలు ముఖంలో కనిపంచకుండా చర్మం ఎప్పుడూ యవ్వనంగా ఉండాలనుకుంటాం. దానికోసం బయట దొరికే బ్యూటీ ఉత్పత్తుల్ని చాలానే వాడుతుంటాం. అయితే అవి ఇచ్చే మెరుపులు తాత్కాలికమే అంటున్నారు నిపుణులు. అందుకే యవ్వనంగా, ఆరోగ్యంగా కనిపించాలంటే రోజువారీ ఆహారంలో కొన్ని పదార్థాల్ని తప్పక చేర్చుకోవాలని చెబుతున్నారు. బెర్రీలు, దానిమ్మ... వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి కొలాజన్ ఉత్పత్తిని పెంచుతాయి. దాంతో చర్మం బిగుతుగా, యవ్వనంగా మారుతుంది.



## ఉంగరాల జుట్టు.. అందంగా కనిపించేలా!

ఉంగరాల జుట్టు సాధారణంగానే పొడిగా ఉంటుంది.. దాంతో నిర్జీవంగా కనిపిస్తుంది.. మెయింటెయిన్ చేయడం కూడా కొందరికి కష్టంగా అనిపిస్తుంటుంది. ఇలాంటప్పుడు కొన్ని సింపుల్ చిట్కాలు పాటిస్తే కర్లీ హెయిర్‌నూ అందంగా కనిపించేలా చేయచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..! కొంతమందికి రోజూ తలస్నానం చేయడం అలవాటు. కర్లీ హెయిర్ ఉన్న వారూ కొందరు ఇలాగే చేస్తుంటారు. దీనివల్ల జుట్టు మరింత పొడిబారుతుందంటున్నారు నిపుణులు.



కాబట్టి, జుట్టు తత్వాన్ని బట్టి వారానికి రెండు నుంచి మూడుసార్లు మాత్రమే తలస్నానం చేయాలంటున్నారు. అది కూడా గాఢత తక్కువగా ఉండే షాంపూని నీళ్లలో కలుపుకొని చేయడం మంచిదని చెబుతున్నారు.

తలస్నానం తర్వాత నాణ్యమైన కండిషనర్‌ను రాయడం మర్చిపోకూడదు. ఇది కేశాలు పొడిబారిపోకుండా చేస్తుంది. అలాగే తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరువెచ్చటి లేదంటే చల్లటి నీళ్లు ఉపయోగించడం మంచిదట. కర్లీ హెయిర్ సంరక్షణ కోసం వారానికి మూడు సార్లు నూనె పెట్టుకోమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొబ్బరి నూనెను కుదుళ్లు, వెంట్రుకలకు అప్లై చేసి కాసేపు మర్దన చేయాలి. ఇలా రాత్రుళ్లు నూనె పెట్టుకొని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేస్తే జిడ్డుగా కూడా అనిపించదని చెబుతున్నారు. తడిగా ఉన్న జుట్టును దువ్వడం, టవల్‌తో గట్టిగా రుద్దుతూ తుడవడం.. వంటివి అస్సలు చేయకూడదట. ఎందుకంటే ఇవి జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయట. మెత్తటి కాటన్ క్లాత్‌తో జుట్టును పొడిగా తుడుచుకొని.. ఆరిన తర్వాత చెక్క దువ్వెనతో చిక్కు తీసుకోవడం మంచిదట. తడిగా ఉన్న కర్లీ హెయిర్‌ను బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే ముడేయడం.. వంటివి చేస్తే జుట్టు చివర్లు చిట్లిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి జుట్టును ముడేసే ముందు సహజసిద్ధంగా ఆరనివ్వడం ఉత్తమం. షియా బటర్, నువ్వుల నూనె.. వంటివి కర్లీ హెయిర్ సంరక్షణకు చక్కగా ఉపయోగపడతాయట. ఉంగరాల జుట్టు పొడిబారకుండా ఇంట్లోనే తయారుచేసుకునే హెయిర్ స్ప్రే కూడా చక్కగా పనిచేస్తుందట. ఈ క్రమంలో ఒక స్ప్రే బాటిల్‌లో డిస్టిల్డ్ వాటర్ నింపి అందులో కొన్ని చుక్కల చొప్పున వెజిటబుల్ ఆయిల్, రోజ్‌మేరీ ఆయిల్, లావెండర్ నూనె వేసి.. ఇవన్నీ చక్కగా కలిసిపోయేలా సీసాను బాగా కదపాలి. దీన్ని జుట్టుపై అప్పుడప్పుడూ స్ప్రే చేస్తుండడం వల్ల మంచి ఫలితం ఉంటుందట.

## సౌందర్య పరిరక్షణలో 'వెదురు'!

వెదురులో ఉండే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు వివిధ సౌందర్య సమస్యల్ని దూరం చేయడంలో పనిచేస్తాయంటున్నారు నిపుణులు. అందుకే కొరియన్లు తమ సౌందర్య పరిరక్షణలో భాగంగా దీన్ని ఎక్కువగా వాడుతుంటారట! మరి, అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో వెదురు ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం రండి..

వెదురులో సిలికా, యాంటీ ఆక్సిడెంట్ల స్థాయులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి తేమనందించి మృదువుగా మార్చుతాయట.

మొటిమల కారణంగా చర్మం బయటి పొర దెబ్బతింటుంది. తద్వారా వాతావరణంలోని బ్యాక్టీరియా, ఇతర కాలుష్య కారకాలు చర్మంపై దాడి చేస్తాయి. ఈ క్రమంలో వెదురు ఎక్స్‌ట్రాక్ట్‌తో తయారుచేసిన సౌందర్య సాధనాలను ఉపయోగించడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. వెదురుతో తయారుచేసిన సౌందర్య ఉత్పత్తులు/సాధనాల్ని తరచూ ఉపయోగించడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుందట. ఫ్రీరాడికల్స్



చర్మ కణాల్ని దెబ్బతీస్తాయి. తద్వారా ముఖంపై ముడతలు, గీతలు.. వంటివి ఏర్పడే ప్రమాదముంది. అదే వెదురుతో తయారుచేసిన ఉత్పత్తుల్ని తరచూ వాడితే ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. వెదురు ఎక్స్‌ట్రాక్ట్‌లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలుంటాయి. ఇవి అలర్జీలు, ర్యాషెస్ వంటి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో సహకరిస్తాయట. అందుకే వెదురు ఎక్స్‌ట్రాక్ట్‌తో తయారుచేసిన క్లెన్సర్లు, బాడీవాష్‌లను చర్మానికి ఉపయోగించడం మేలంటున్నారు నిపుణులు. వెదురులోని సిలికా చర్మ సౌందర్యానికే కాదు.. జుట్టు ఆరోగ్యానికీ మేలు చేస్తుందట.

చర్మ సంరక్షణ, కేశ సౌందర్యం, గోళ్ల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే వెదురు ప్రస్తుతం మార్కెట్లో.. సీరమ్, షీట్ మాస్కులు, ఫేస్ మిస్ట్, మాయిశ్చరైజర్లు, క్లెన్సర్ల రూపంలో అందుబాటులో ఉంది. అలాగే వెదురు ఎక్స్‌ట్రాక్ట్‌తో తయారుచేసిన షాంపూలు, కండిషనర్లు సైతం లభిస్తున్నాయి. అయితే వీటిని ఎంచుకునే ముందు నిపుణుల సలహా తీసుకోవడం, ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మాత్రం మర్చిపోకూడదు.

## మేకప్ తీసేటప్పుడు..!

మేకప్ అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కేవలం మక్కువతోనే కాదు.. వృత్తిలో భాగంగానూ కొంతమంది తరచూ మేకప్ వేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇలా వేసుకోవడంతోనే సరిపోదు.. దాన్ని తొలగించుకునే క్రమంలోనూ కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవాలంటున్నారు సౌందర్య నిపుణులు. అప్పుడే చర్మంపై నుంచి మేకప్ పూర్తిగా తొలగిపోయి ముఖం శుభ్రపడుతుంది. లేదంటే వాటి అవశేషాలు ముఖ చర్మాన్ని దెబ్బతీస్తాయి. మరి, అలా జరగకుండా ఉండాలంటే మేకప్‌ను తొలగించుకునే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం రండి.. మేకప్ తీసే క్రమంలో రిమూవర్ ఉపయోగించినా.. గట్టిగా రుద్దుతూ మరీ శుభ్రం చేసుకుంటారు కొంతమంది. అయితే ఇలా చేయడం వల్ల చర్మం డ్యామేజ్ అయ్యే ప్రమాదమే ఎక్కువ అంటున్నారు నిపుణులు. అందుకే నెమ్మదిగా తీయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చర్మానికి అతుక్కుపోయిన మేకప్‌ను ముందుగా తొలగించాల్సి ఉంటుంది. ఇందుకోసం మేకప్‌ను తొలగించే క్లెన్సర్లు బయట దొరుకుతాయి. ఒక కాటన్ ప్యాడ్‌పై ఈ రిమూవర్‌ను వేసి ముఖమంతా అప్లై చేయాలి. కాస్త ఎక్కువగా మేకప్ వేసిన భాగంలో ఈ కాటన్‌ని కొన్ని సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల మేకప్ తొలగించడం సులభమవుతుందని చెబుతున్నారు నిపుణులు.

మేకప్ తొలగించుకునే క్రమంలో కళ్ల చివర్లు, పెదాలు, మెడ, చెవులు, హెయిర్‌లైన్.. వంటి భాగాలను నిర్లక్ష్యం చేస్తుంటారు చాలామంది. ఇందుకు ఆయా భాగాలపై ఎవరి దృష్టీ పడదన్నది ఒక కారణమైతే.. అక్కడ మేకప్ తొలగించుకోవడానికి కాస్త ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందనేది మరో కారణం. నిజానికి ఈ నిర్లక్ష్యం వల్ల కొన్నాళ్లకు అక్కడి చర్మం దెబ్బతింటుంది. అందుకే ముఖ చర్మంపై ఉండే మేకప్‌ని ఎలాగైతే శ్రద్ధగా తొలగించుకుంటామో.. ఆయా భాగాల వద్ద ఉన్న మేకప్‌ని సైతం అంతే శ్రద్ధగా తొలగించుకోవాలి. కళ్ల చివర్లు, పెదాలు, హెయిర్‌లైన్ వద్ద మేకప్‌ని తొలగించడానికి కాటన్ ప్యాడ్‌కి బదులు ఇయర్ బడ్ ఉపయోగించచ్చు.. ఇక మెడ, చెవుల వద్ద కాటన్ ప్యాడ్‌తో మేకప్ తొలగించుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇలా ముఖంపై వేసుకున్న మేకప్‌ని తొలగించుకున్న తర్వాత ఆఖర్లో ఫేస్‌వాష్‌తో ఓసారి ముఖాన్ని శుభ్రం చేసుకుంటే సరిపోతుందట.

మేకప్‌ని తొలగించే ప్రక్రియ త్వరగా, సులభంగా పూర్తవుతుందన్న ఉద్దేశంతో కొంతమంది మార్కెట్లో దొరికే మేకప్ రిమూవింగ్ వైప్స్‌పై ఆధారపడుతుంటారు. నిజానికి ఇవి పూర్తిగా మేకప్‌ని తొలగించవట. కాబట్టి ఇవి వాడినా ఆఖర్లో ఫేస్‌వాష్‌తో ముఖం కడుక్కోవాల్సిందేనట.

కొన్ని రకాల మేకప్ రిమూవర్స్ చర్మంలోని సహజసిద్ధమైన నూనెల్ని తొలగిస్తాయి. తద్వారా చర్మం పొడిబారిపోతుంది. ఇలాంటప్పుడు మేకప్ తొలగించుకొని, ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత చర్మానికి మాయిశ్చరైజర్ అప్లై చేయడం తప్పనిసరి. ఇక పెదాలకు లిప్‌బామ్, కళ్లకు ఐ క్రీమ్.. వంటివీ ఆయా భాగాల్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయని చెబుతున్నారు నిపుణులు.



## యువతలో పెరుగుతున్న పక్షవాతం కేసులు.. ముప్పు కలిగించేవి ఏవి?



సాధారణంగా పక్షవాతం (Stroke) అనేది వృద్ధాప్యానికి సంబంధించిన సమస్యగా పరిగణిస్తాం. ఇటీవలి పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని మారుస్తున్నాయి. గత మూడు దశాబ్దాల్లో 20 నుంచి 54 ఏండ్ల వయస్సు గల వారిలో పక్షవాతం సంభవించే రేటు దాదాపు రెట్టింపయ్యిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దీనిపై అమెరికాలో చేపట్టిన అధ్యయన వివరాలు సెప్టెంబర్ 23న న్యూరాలజీ (Neurology) అనే పత్రికలో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయన వివరాలు 1993 నుంచి 2020 మధ్య కాలంలో గ్రేటర్ సిన్సినాటి, ఉత్తర కెంటకీ ప్రాంతాలకు చెందినవి. 20 నుంచి 54 ఏండ్ల వయసు గల వారిలో మొదటిసారి పక్షవాతం వచ్చిన 2076 కేసులను గుర్తించారు. లక్షకు 33.9 కేసులు నమోదవగా, 2020 నాటికి అది 62.2కు చేరింది. ఇస్కీమిక్ స్ట్రోక్స్ (Ischemic Strokes) కేసులే ఎక్కువగా ఉన్నాయి. అంటే మెదడులో ఏర్పడిన బ్లడ్ క్లాట్ లేదా ఇతర ఏదైనా ఇతర ఏదైనా అవరోధం ఒక భాగానికి రక్త ప్రసరణను అడ్డుకోవడం వల్ల ఇది సంభవిస్తుంది. ఈ రకమైన పక్షవాతం ఈ అధ్యయనం కాలంలో లక్షకు 23.8 నుంచి 47.3 కేసులకు పెరిగింది. అయితే పరిశోధకులు ఇంట్రాసెరెబ్రల్ లేదా సబర్నకాయిడ్ హేమరేజెస్ విషయంలో ఇలాంటి పెరుగుదలను గుర్తించలేదు. యువకుల్లో ఈ పక్షవాతం పెరుగుదలలకు సరైన కారణాన్ని పరిశోధకులు ఇప్పటివరకు గుర్తించలేదు. కానీ పక్షవాతానికి గురైన యువకుల్లో ఎక్కువగా మధుమేహం (Daibetes), అట్రియల్ ఫైబ్రిలేషన్, అధిక బీపీ ఉన్నట్లు తేల్చారు. అంతేకాదు మత్తు పదార్థాల వినియోగం వల్ల కూడా ఈ పక్షవాతం సంభవిస్తున్నట్లు గమనించారు. వీటి వినయోగం 1993–94లో 4.6 శాతం నుంచి 2020 నాటికి 40.2 శాతానికి పెరిగింది. దీనిలో అధిక భాగం గంజాయి వాడకం వల్లనే సంభవించింది. ఈ అధ్యయనం ఒక్క అమెరికాకే కాకుండా ప్రపంచంలోని 204 దేశాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా 1990 నుంచి 2021 మధ్య 15 నుంచి 49 ఏండ్ల సంవత్సరాలు గల వారిలో పక్షవాత కేసులు 36 శాతం పెరిగినట్లు గుర్తించారు. దీనికి అధిక సిస్టోలిక్ బీపీ, అధిక బాడీ మాస్ ఇండెక్స్ (BMI), పెరిగిన LDL కొలెస్ట్రాల్, రక్తంలో గ్లూకోజ్ స్థాయులు వేగంగా పెరగడం, వాయు కాలుష్యం వంటివి కారణాలు అని పరిశోధకులు వెల్లడించారు.

అధిక బరువు (Excess Weight), పొగ తాగడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బీపీ, అధికంగా మద్య తాగడం, ఆహార అలవాట్లలో మార్పు, అధిక కొలెస్ట్రాల్ ఇవన్నీ పక్షవాతం రావడానికి కారకాలు అని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ ఇవే ప్రధాన కారణమని యూఎస్ చేపట్టిన కొత్త పరిశోధన నిరూపించలేదు. అయినప్పటికీ వీటిలో చాలా వాటిని మనం మార్చుకుంటే మంచిదని పరిశోధకులు చెబుతున్నారు. పక్షవాతానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు (High BP) అని గుర్తించారు.

అధ్యయనాల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ వయసుతో సంబంధం లేకుండా వచ్చే అకస్మాత్తుగా వచ్చే నాడీ సంబంధిత (Neurological) వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు. అకస్మాత్తుగా వచ్చే నీరసం లేదా తిమ్మిరి, శరీరంలోని ఒకవైపునకు ముఖం వాలిపోవడం, వదలని తలనొప్పి, మాట్లాడటంలో ఇబ్బంది, అకస్మాత్తుగా దృష్టిలోపాలు, తల తిరగడం వంటి పక్షవాతానికి సంకేతాలు కావచ్చు. కాబట్టి వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

## విపణిలోకి మివీ స్మార్ట్‌ఫోన్

తెలుగు రాష్ట్రాల నుంచి కొత్తగా ఒక స్మార్ట్‌ఫోన్ విపణిలోకి వస్తోంది. మివీ వన్ 5జీ స్మార్ట్‌ఫోన్లను అక్టోబరు 8 నుంచి విక్రయిస్తామని మివీ సహ వ్యవస్థాపకులు విశ్వనాథ్ కందుల తెలిపారు. 4ఎన్ఎం స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 2 మొబైల్ ప్లాట్‌ఫామ్‌పై, ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ డ్యూయల్ కెమెరాతో 4జీబీ–6జీబీ–8జీబీ ర్యామ్, 128 జీబీ మెమొరీతో ఈ 5జీ ఫోన్లను ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయిస్తామని పేర్కొన్నారు. రూ.11,999 నుంచి వీటి ప్రత్యేక ధరలు ప్రారంభమవుతాయన్నారు. హైదరాబాద్‌లోనే ఈ సంస్థ ప్లాంట్ ఉంది.






# MDR ట్యాక్సో, సెస్సో కాదు.. ప్రభుత్వానికి రూపాయి రాదు: నిర్మలా సీతారామన్



యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ (MDR On UPI) విధింపుపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రతిపాదిత రుసుములు కేవలం రూ.2వేల కన్నా అధికంగా ఉన్న యూపీఐ లావాదేవీలకే వర్తిస్తాయని గుర్తు చేశారు. అలాగని ఇది పన్నో, సెస్సో కాదని, సర్‌ఛార్జీ అంతకంటే కాదని పేర్కొన్నారు. దీంట్లో ఖజానాకు వచ్చేది ఏమీ ఉండదని స్పష్టంచేశారు. డిజిటల్ పేమెంట్స్ ఎకో సిస్టమ్‌లో యూపీఐ సేవలందిస్తున్న పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు, మర్చంట్ బ్యాంకులు, అందులోని భాగస్వామ్య పక్షాలకే ఈ మొత్తం చేరుతుందని వెల్లడించారు. "ఇది పన్ను కాదు, సెస్ కాదు, సర్‌ఛార్జ్ కూడా కాదు. ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరదు. మొత్తం ఎండీఆర్‌లో 40 శాతం వినియోగదారుల ఉపయోగించే బ్యాంకులకు, 30 శాతం పేమెంట్ గేట్‌వేకి, 20 శాతం యూపీఐ యాప్‌కి, మిగిలిన 10 శాతం యూపీఐ యాప్ స్పాన్సర్ బ్యాంకుకు వెళ్తుంది. ఈ రుసుములు వ్యాపారి మాత్రమే భరించాలి'' అని నిర్మలా సీతారామన్ తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సాంకేతిక మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి, మెరుగుదలకు, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి ఈ ఛార్జీని చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వామి వర్గాలే పంచుకుంటాయని స్పష్టంచేశారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలపై ఇప్పటికే వ్యాపారులు ఎండీఆర్ చెల్లిస్తున్నారని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. యూపీఐలో లావాదేవీలపై ఎండీఆర్‌ను వినియోగదారులపై పడే ఛార్జీగా చూడకూడదన్నారు. రూ.2 వేలు వరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపారు. వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ పరిధిలోకి రావని పేర్కొన్నారు. ప్రతిపాదిత ఎండీఆర్ వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్న విమర్శల వేళ నిర్మలా సీతారామన్ ఈ మేరకు స్పష్టతనిచ్చారు. అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి.

# విదేశాలకు వెళ్లే వారికి VI గుడ్‌న్యూస్..





ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా (VI) కొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. తమ చందాదారులకు ఇంటర్నేషనల్ రోమింగ్‌ను ఉచితంగా అందిస్తోంది. ఎంపిక చేసిన పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్, ఎంటర్‌ప్రైజ్ ప్లాన్లతో ఈ సదుపాయం ఉచితంగా ఇస్తోంది. ప్రత్యేకంగా ఎలాంటి రోమింగ్ ఛార్జీలూ చెల్లించకుండా 170కి పైగా దేశాల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఏడాదికి మూడు ట్రిప్పుల వరకు ఈ అవకాశం కల్పిస్తోంది. తద్వారా రూ.9 వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. సాధారణంగా విదేశాలకు వెళ్లే ప్రయాణికులు పాత సిమ్ తీసేసి, స్థానిక సిమ్ వినియోగిస్తుంటారు. లేదంటే ఇన్‌కమింగ్ కాల్స్, ఓటీపీలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు వేరుగా ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌తో రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియా యూజర్లు మాత్రం కాల్స్, ఓటీపీల కోసం తమ నంబర్‌నే యథాతథంగా కొనసాగించొచ్చు. రూ.501 పైబడిన పోస్ట్ పెయిడ్ ప్లాన్లు, వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్ యూజర్లు, రూ.451తో ప్రారంభమయ్యే ఎంటర్‌ప్రైజెస్ ప్లాన్ కలిగిన వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. వీఐ యాప్ ద్వారా రోమింగ్ ఫ్రీ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చని చెప్పింది. ప్యాకేజీని బట్టి ఇంటర్నేషనల్ డేటా, ఔట్ గోయింగ్ కాలింగ్ ప్రయోజనాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది.

# ATM ఛార్జీలు రద్దు చేసిన ఎస్‌బీఐ



బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె సమయంలో వినియోగదారులకు ఊరట కల్పిస్తూ ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను రద్దు చేసింది. సెప్టెంబర్ 28–30 మధ్య ఈ సదుపాయాన్ని కల్పిస్తోంది. సాధారణంగా నిర్ణీత సంఖ్య దాటిన తర్వాత ఏటీఎంలో చేసే లావాదేవీలపై బ్యాంకులు రుసుములు వసూలు చేస్తుంటాయి. సమ్మె నేపథ్యంలో ఆ మినహాయింపు ఇస్తూ ఎస్‌బీఐ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. గరిష్ఠ వేతనం రూ.15 వేలు–రూ.25 వేల మధ్య ఉంటే ఆటోమేటిక్‌గా పింఛను పథకం వర్తింపు ఐదు రోజుల పని దినాలు, ఇతర డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వ రంగ బ్యాంకు యూనియన్లు మూడు రోజుల పాటు సమ్మెకు దిగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాతా దారులకు బ్యాంకు సేవల్లో ఆటంకం ఏర్పడకూడదన్న ఉద్దేశంతో ఈ ఆదివారం బ్యాంకులు పనిచేసేలా కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలోనే సమ్మె కాలంలో ఏటీఎం ఛార్జీల భారం నుంచి ఖాతాదారులకు ఎస్‌బీఐ మినహాయింపు ఇచ్చింది. ఏ బ్యాంకు ఏటీఎం నుంచి లావాదేవీలు జరిపినా ఛార్జీలు వర్తించబోవని స్పష్టంచేసింది. అలాగే, బ్యాంకు సేవల కోసం మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాట్సప్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించింది.

# ఏఐ మోడల్స్‌కు ఏఐతోనే ట్రైనింగ్..




ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ హవా కొనసాగుతోంది. కృత్రిమ మేధను మరింత అభివృద్ధి చేయడానికి ఏఐ కంపెనీలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ (OpenAI).. తమ మోడళ్లకు మనుషుల సహజ స్పందనపై శిక్షణ నివ్వడానికి కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. అయితే ఏఐకి ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా ఆ ఉద్యోగులు.. ఏఐనే వాడుతుండడంతో అటువంటి వారిపై వేటు వేసింది.

తమ ఏఐ (AI) చాట్‌బాట్ ఎలా స్పందిస్తుందో అంచనా వేయడానికి, చాట్‌జీపీటీ (ChatGPT) వినియోగదారుల ప్రాంప్ట్‌లను చదవడానికి ఓపెన్ ఏఐ సంస్థ వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. వాటిని చదివిన తర్వాత ఉద్యోగులు ఏఐ ప్రతిస్పందనలను విశ్లేషించి.. వినియోగదారుడు ఏమి అడిగారో ఆ సమాచారాన్ని మాత్రమే ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకుగానూ కంపెనీ వారికి గంటకు 50 డాలర్ల (సుమారు రూ.4,795) జీతం అందిస్తోంది. అయితే.. వీరిలో చాలామంది కంపెనీ మోడళ్లకు స్వయంగా శిక్షణ ఇవ్వడానికి బదులుగా.. ఏఐ (AI)నే వాడి ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన యాజమాన్యం.. సదరు ఉద్యోగులను సంస్థ నుంచి తొలగించింది. ఇలా కృత్రిమ మేధ సాయంతో ఏఐకి శిక్షణనివ్వడం వల్ల 'మోడల్ కొలాప్స్' అయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. AI–సృష్టించిన కంటెంట్‌తోనే శిక్షణ పొందుతున్న కొద్దీ.. ఒకే రకమైన సమాచారం రిపీట్ అవుతుందని, కాలక్రమేణా వివిధ మోడల్స్ వాటి కచ్చితత్వాన్ని, వైవిధ్యతను కోల్పోతాయన్నారు.




## సింధు, లక్ష్యలకు కఠిన డ్రా



ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్‌లకు కఠిన డ్రా ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సింధుకు తొలి రౌండ్లో బై లభించింది. ఆమె ప్రిక్వార్టర్స్‌లో ఏడో సీడ్ తొమోక మియాజాకి (జపాన్)ను ఢీకొనచ్చు. సెమీస్ చేరాలంటే మాత్రం ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫై (చైనా)ను ఓడించాల్సి రావొచ్చు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌కు కూడా తొలి రౌండ్లో బై లభించింది. రెండో రౌండ్లో ప్రపంచ మాజీ ఛాంపియన్ లో కీన్ యి (సింగపూర్)ను ఎదుర్కోనున్న లక్ష్య.. క్వార్టర్స్‌లో ప్రపంచ నం.1 జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో తలపడాల్సి రావొచ్చు. పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సాత్విక్, చిరాగ్ జోడీకి సులువైన డ్రా ఎదురైంది. నాలుగో సీడ్ సాత్విక్ జోడీకి సెమీస్‌లో టాప్ సీడ్ కిమ్ వోన్ హో, సియో సియుంగ్ జే (కొరియా) జంట ఎదురుకావొచ్చు. మిగతా మ్యాచ్‌ల్లో తేలికైన ప్రత్యర్థులే పడ్డారు. గత ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్ మూడు పతకాలు నెగ్గింది.

# భారత్‌కు రెండో గోల్డ్ మెడల్

ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశపర్చినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో మన దేశానికి రెండో పసిడి పతకం లభించింది. అంతకుముందు మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక, దక్షిణకొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి. ఇక, పురుషుల 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో మన షూటర్లు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంశ్ పాటిల్, నీరజ్ కుమార్ మొత్తంగా 1762 పాయింట్లు సాధించారు. 1766 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం నెగ్గింది. కేవలం నాలుగు పాయింట్ల తేడాతో మన జట్టుకు త్రుటిలో పసిడి చేజారింది.

మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్న చిన్నప్ప, సెంథిల్ కుమార్ పతకం ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినో–జెమైకా అరిబాడోను 11–3, 11–5తో ఓడించి మన ఆటగాళ్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. దీంతో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు.

అటు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్ షా, దియా చితాలే కూడా పతకం ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో వీరు హాంకాంగ్ జోడీని 11–6, 13–15, 11–9, 11–5తో ఓడించారు.




# ఒక్క బంతీ పడకుండానే రద్దయిన రెండు మ్యాచ్‌లు



మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు వరుసగా రెండో రోజు వరుణుడు అడ్డం పడ్డాడు. మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో గురువారం జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో మధ్యాహ్నం వైజాగ్ ఫైర్ బర్డ్స్, రాయలసీమ జెన్ స్టార్స్ మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్.. సాయంత్రం అమరావతి ఈ ఛాంపియన్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ మధ్య రెండో మ్యాచ్ ఒక్క బంతీ పడకుండానే తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో నాలుగు జట్లకు తలో పాయింట్ దక్కింది. ప్రస్తుతం రాయలసీమ, అమరావతి, గోదావరి జట్లు ఆరేసి పాయింట్లతో ఉన్నాయి. నెట్‌రన్‌రేట్లో రాయలసీమ జెన్ స్టార్స్ (+0.643) అగ్రస్థానంలో ఉంది. అమరావతి (+0.383), గోదావరి (–0.164) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌లలో ఓడిన వైజాగ్ జట్టు రెండే పాయింట్లతో ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. శుక్రవారం మధ్యాహ్నం వైజాగ్‌తో గోదావరి.. సాయంత్రం రాయలసీమతో అమరావతి తలపడనున్నాయి. లీగ్ దశలో చివరి రెండు మ్యాచ్‌లు ఇవే. ఈ మ్యాచ్‌లకు కూడా వర్షం అంతరాయం కలిగించొచ్చు. ఇవి కూడా రద్దయితే లీగ్ దశలో తొలి రెండు స్థానాలతో రాయలసీమ, అమరావతి ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

# ఆస్ట్రేలియా–ఎ లక్ష్యం 363

ఆస్ట్రేలియా–ఎతో నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్–ఎ విజయానికి రంగం సిద్ధం చేసుకుంది. ప్రత్యర్థి ముందు 363 పరుగుల లక్ష్యాన్ని ఉంచిన దేవదత్ పడిక్కల్ సారథ్యంలోని జట్టు.. గురువారం మూడో రోజు ఆట ముగిసేసరికి కంగారూ జట్టును 55/2కు కట్టడి చేసింది. విజయం సాధించాలంటే ఇంకో 308 పరుగులు సాధించాల్సిన ఆసీస్.. భారత స్పిన్నర్లను ఏ మేరకు కాచుకుంటుందో చూడాలి. అంతకుముందు 163 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 199 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 93/1తో ఉన్న జట్టు.. ఆఫ్‌స్పిన్నర్ టాడ్ మర్ఫీ (4/44) లియామ్ స్కాట్ (2/22) విజృంభించడంతో వేగంగా వికెట్లు కోల్పోయింది. పడిక్కల్ (59), కుమార్ కుశాగ్ర (46 నాటౌట్), సాయి సుదర్శన్ (39) రాణించి జట్టుకు పోరాడే స్కోరును అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్–ఎ 334 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా–ఎ 171 పరుగులకే ఆలౌటైంది.



# అనంత్‌జీత్, పరినాజ్ జోడీకి కాంస్యం

భారత షూటర్లు అనంత్‌జీత్ సింగ్ నరుకా, పరినాజ్ ధలివాల్.. చరిత్ర సృష్టించారు. ఆసియా క్రీడల మిక్స్‌డ్ టీమ్ స్కీట్ ఈవెంట్లో భారత్‌కు పతకం అందించిన తొలి జోడీగా నిలిచారు. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఈ ద్వయం 44 పాయింట్లతో మూడో స్థానం సాధించింది. క్వాలిఫికేషన్లో 138 పాయింట్లతో నాలుగు జట్ల ఫైనల్‌కు అనంత్‌జీత్, పరినాజ్ అర్హత సాధించారు. అందులో ముందుగా ఖతార్ జోడీ వైదొలగడంతో భారత్‌కు పతకం ఖాయమైంది. చైనా, దక్షిణ కొరియా స్వర్ణ పోరుకు అర్హత సాధించాయి. ఆ దేశ జోడీలు వరుసగా 52, 51 పాయింట్లతో స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకోగా.. భారత ద్వయానికి కాంస్యం దక్కింది. స్కీట్‌లో భారత్ పోటీపడ్డ మూడు విభాగాల్లోనూ పతకాలు సాధించడం విశేషం. పురుషులు, మహిళల విభాగాల్లోనూ భారత్‌కు కాంస్యాలు దక్కాయి. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో మన దేశానికి నిరాశ తప్పలేదు. కమల్‌జీత్, బాలకృష్ణ కేదార్‌లింగ్, ఆకాశ్ భరద్వాజ్ త్రయం పురుషుల టీమ్ విభాగంలో పతకానికి దూరమైంది. ఆరు సిరీస్‌ల ఫైనల్లో భారత క్రీడాకారులు 1730 పాయింట్లతో నాలుగో స్థానానికి పరిమితం అయ్యారు. ఈ ముగ్గురూ వ్యక్తిగత విభాగాల్లో ఫైనల్ చేరలేకపోయారు.



# 'కల్కి 'సీక్వెల్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం



**వుదయం సినిమా:** రెబల్ స్టార్ ప్రభాస్ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ మైథలాజికల్ ఎక్స్ట్రావెగాంజా 'కల్కి 2898 ఏడీ' కోసం క్రియేటివ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ సృష్టించిన ప్రపంచం ఇప్పుడు మరింత భారీ స్థాయిలో విస్తరించబోతోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సీక్వెల్ రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ మరోసారి అలరించబోతున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కూడా కీలక పాత్రల్లో కొనసాగనున్నారు. తొలి భాగం అద్భుతమైన బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. అంతేకాకుండా రెండు నేషనల్ అవార్డులను సొంతం చేసుకుంది. దీంతో నెక్స్ట్ పార్ట్ పై అంచనాలు మరింత పెరిగాయి. తొలి భాగం ఘనవిజయం సాధించడంతో సీక్వెల్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. దీంతో ఇది దేశవ్యాప్తంగా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా మారింది.మరింత భారీ స్థాయిలో రూపొందనున్న ఈ చాప్టర్ కోసం నాగ్ అశ్విన్ తెరవెనుక ఇంటెన్స్ వర్క్ చేస్తున్నారు. వరల్డ్, స్కేల్, కథను మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.ప్రభాస్‌తో పాటు ఇతర కీలక నటీనటులు వచ్చే నెల నుంచి తమ షూటింగ్ షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారు. భారీ షెడ్యూల్‌తో షూటింగ్‌ను ప్లాన్ చేస్తున్న టీమ్.. మొత్తం ప్రొడక్షన్‌ను 2027 మిడ్ కి పూర్తి చేయాలని నాగ్ అశ్విన్ లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇప్పటికే ఇంటెన్స్ ప్రీ-ప్రొడక్షన్ వర్క్ పూర్తయిన నేపథ్యంలో.. నాగ్ అశ్విన్ తన విజన్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇంతకాలం సిద్ధం చేసిన భారీ ప్రణాళికలను మరింత గ్రాండ్ సినిమాటిక్ స్పెక్టకిల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## వుదయం సినిమా

MOVIE TIME!

# 'కాకా' డబ్బింగ్ ప్రారంభం

**వుదయం సినిమా:** బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత మెగా స్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి మరోసారి కలిసి చేస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా'. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.తాజాగా 'కాకా' డబ్బింగ్ పనులు పూజా కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో శరవేగంగా జరుగుతున్నాయి.THE BLOODY BENCHMARK సెట్ చేసేందుకు చిత్ర బృందం ఫుల్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది.ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్ గా చేస్తున్నారు.




# మోక్షజ్ఞ తొలి సినిమా వెనుక బాలయ్య బాబు మాస్టర్ ప్లాన్..



**వుదయం సినిమా:** నందమూరి అభిమానులు దశాబ్దకాలంగా ఎంతోఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ అధికారికంగా ఖరారైంది. అయితే ఈ సినిమా వెనుక బాలయ్య బలం ఏంటనేది ఇప్పుడు బయటకొచ్చి హాట్ టాపిక్ అయింది.నందమూరి అభిమానులు దశాబ్ద కాలంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. నట సింహం నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ అధికారికంగా ఖరారైంది. 'బింబిసార', 'విశ్వంభర' లాంటి సోషియో ఫాంటసీ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకు న్న యువ దర్శకుడు వశిష్ఠ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సినిమా ను ఒక రొటీన్ మాస్ ఎంటర్టైనర్తో కాకుండా, ఒక భిన్నమైన జానర్తో మోక్షజ్ఞను వెండితెరకు పరిచయం చేయబోతుండటం ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రం పూర్తిస్థాయి సోషియో-ఫాంటసీ యాక్ష న్ డ్రామాగా తెరకెక్కనుందని సమాచారం.ఆసక్తికరమైన ఎలిమెంట్స్తో పాటు హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ (VFX) ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

# 'లవ్ & వార్' ఫస్ట్ లుక్‌లో రణ్‌బీర్ కపూర్




**వుదయం సినిమా:** సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ & వార్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ వంటి ముగ్గురు స్టార్ హీరోహీరోయిన్లు కలిసి నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రణ్‌బీర్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో కనిపించే గ్రాండ్ విజువల్స్, రిచ్‌నెస్ ఈ పోస్టర్‌లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. రణ్‌బీర్ ఇప్పటివరకు కనిపించని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా విజువల్స్‌కు అద్భుతంగా సరిపోయింది. సంగీతం విషయంలో భన్సాలీ మార్క్ మరోసారి కనిపించింది.ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన మేకర్స్ "వోహ్ రుత్బా, వోహ్ రౌబ్, వోహ్ జునూన్!" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'లవ్ & వార్' చిత్రం 2027 జనవరి 21న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

# 'హాయ్' తమిళ జీ5లో స్ట్రీమింగ్



భారతదేశంలోని అగ్రశ్రేణి సూపర్‌స్టార్స్ నటించిన పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన తమిళ జీ5 తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. 'జననాయగన్'కు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత, ఇప్పుడు నయనతార, కవిన్ నటించిన 'హాయ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించటానికి సిద్ధమవుతోంది. విభిన్నమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం.. నేటితరం సంబంధాలను సరికొత్త కోణంలో ఆవిష్కరిస్తూ, హృదయాన్ని హత్తుకునే ప్రేమకథగా అలరించనుంది.నయనతార, కవిన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'హాయ్' చిత్రం.. నేటితరం సంబంధాలు, ప్రేమను హృదయానికి హత్తుకునేలా, భావోద్వేగంగా ఆవిష్కరిస్తుంది. నయన్, కవిన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. తెరపై వారి కెమిస్ట్రీ కథకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. నయనతార.. ఆత్మవిశ్వాసం, హుందాతనం, స్వతంత్ర భావాలున్న మహిళ పాత్రలో సహజంగా ఒదిగిపోయారు. ఇక కవిన్.. నిజాయతీ, అమాయకత్వం కలగలిసిన యువకుడిగా ఆకట్టుకున్నారు. అతడి పాత్రలో కనిపించే సున్నితమైన భావోద్వేగాలు ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. ఇద్దరి నటన సహజత్వం ఉట్టిపడేలా, ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రలను ఆవిష్కరించాయి.

# నవంబర్ 20న "రాయవలస"

**వుదయం సినిమా:** కార్తిక్ జయంతి హీరోగా పరిచయమౌతున్న యాక్షన్ ఎంటర్టైనర్ "రాయవలస". రాధిక జయంతి దర్శకత్వం వహిస్తున్నారు. RaysuN ప్రొడక్షన్స్ పై గోపీ కృష్ణ జె నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. డెబ్యూ హీరో అయినప్పటికీ కార్తిక్ జయంతి పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌తో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు.తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. నవంబర్ 20న ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో కార్తిక్ త్రిశూలంతో అమ్మవారి విగ్రహం ముందు నిలబడి వుండటం పవర్ ఫుల్ గా ఉంది. ఈ చిత్రంలో శ్రీషనులు హీరోయిన్ గా నటిస్తోంది. అన్నపూర్ణమ్మ, అనిత చౌదరి, జయప్రకాశ్, రవి వర్మ, కాశీ విశ్వనాథ్ వంటి సీనియర్ నటులతో పాటు త్రినాధ్ రావు, సుహాస్, కంచరపాలెం రాజు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి అర్జున్ బాలా సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.



# "మత్స్య" గ్లింప్స్ రిలీజ్



**వుదయం సినిమా:** యంగ్ టాలెంటెడ్ హీరో వివస్వాన్ నటిస్తున్న ఫోక్ లోర్ అడ్వెంచర్ ఫిలిం "మత్స్య". ఈ చిత్రంతో వివస్వాన్ టాలీవుడ్ లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రాన్ని జి.బి.ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సంహిత గణపతి ఇంటూరి నిర్మిస్తున్నారు. రవి గోలి, తేజ కనకాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు "మత్స్య" సినిమా అఫీషియల్ గ్లింప్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ టాప్ క్వాలిటీ విజువల్స్, వీఎఫ్ఎక్స్ తో ఒక కొత్త సినిమాటిక్ వరల్డ్ ను పరిచయం చేసింది.'అమ్మా కొత్త బెడ్ టైమ్ కథ చెప్పమ్మా..! అంటూ బాబు అమ్మను అడగగా, ఒక ఫిష్ కథ చెప్పనా అంటూ అమ్మ చెప్పే డైలాగ్ తో "మత్స్య" గ్లింప్స్ మొదలవుతుంది. ఎన్నో వింతలు, అద్భుతాలు, ఒక ట్రావెలర్ ఉండే ఆ కథను అమ్మ చెబుతుంటే హీరో క్యారెక్టర్ ను కలర్ ఫుల్ గా పరిచయం చేశారు. గ్లింప్స్ లో వివస్వాన్ స్టైలిష్ లుక్, అప్పీయరెన్స్, బాడీ లాంగ్వేజ్ తో ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంతో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా వివస్వాన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. గ్లింప్స్ చివరలో హీరో ఉన్న బోట్ కింద నుంచి మిథికల్ ఫిష్ వెళ్లడం ఆసక్తి కలిగిస్తోంది. "మత్స్య" చిత్రంలో ఫోక్ లోర్, అడ్వెంచర్ వంటి అంశాలను మేళవించి ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నట్లు గ్లింప్స్ తో తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# 'గరివిడి లక్ష్మి' నుంచి కొండ కోన కోరసు పాడే సాంగ్

**వుదయం సినిమా:** భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది.తాజాగా కొండ కోన కోరసు పాడే సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటని చరణ్ అర్జున్ స్వయంగా సాహిత్యం అందించి ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. అనన్య భట్, చరణ్ అర్జున్ పాడిన తీరు అందరినీ అలరించింది. ఈ పాటకు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది.ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.గరివిడి లక్ష్మి మన ఊరి పాటలు, అనుభూతులు, మన మూలాల నుంచి వచ్చే ఆత్మ గౌరవానికి సెల్యూట్ లాంటి సినిమా.అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.